అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 21-4-2023 | సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 110 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

రాహుల్‌కు దక్కని ఉపశమనం

- శిక్షను నిలిపివేయాలన్న పిటిషన్‌ను తిరస్కరించిన సూరత్ సెషన్స్‌కోర్టు
- అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలు వినియోగించుకుంటాం : కాంగ్రెస్



న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీకి ఎదురుదెబ్బ తగిలింది. 'మోడీ' ఇంటిపేరు వ్యాఖ్యలపై పరువు నష్టం కేసులో తనకు విధించిన రెండేండ్ల శిక్షను నిలిపివేయాలని ఆయన చేసిన అభ్యర్థనను సూరత్ సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. దీంతో అనర్హత వేటు నుంచి రాహుల్ గాంధీ తప్పించుకోవడం దాదాపు అసాధ్యమని నిపుణులు, విశ్లేషకులు తెలిపారు. ఈ పరువునష్టం ...2లో

మూడు నెలల్లో వలస, అసంఘటిత కార్మికులకు

రేషన్ కార్డులు ఇవ్వాలి

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీం ఆదేశం


- స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని కేంద్రానికి ఆదేశం



న్యూఢిల్లీ : ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన వలస, అసంఘటిత కార్మికులకందరికీ రేషన్ కార్డులను మూడు నెలల్లోగా అందించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. వలస కార్మికులకు డ్రై రేషన్, ఓపెన్ కమ్యూనిటీ కిచెన్‌లపై 2021లో జారీ చేసిన సుప్రీంకోర్టు ఆదేశాలను కేంద్ర ప్రభుత్వం, కొన్ని రాష్ట్రాలు పాటించడం లేదని పేర్కొంటూ సామాజిక కార్యకర్తలు హర్ష్ మందర్, అంజలి భరద్వాజ్, జగదీప్ చోకర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ తాజా జనాభా లెక్కలు లేకపోవడం వల్ల 10 కోట్ల మందికి పైగా జాతీయ ఆహార భద్రతా చట్టం-2013లోని రక్షిత గొడుగు నుంచి రేషన్ కార్డులు కూడా లేకుండా మినహాయించబడ్డారని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా నిర్ణయించబడిన ఆహార భద్రతా చట్టం కింద కవరేజీ సరిపోదని తెలిపారు.

"ప్రస్తుతం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ పోర్టల్‌లో నమోదైన వలస కార్మికులకు జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఎ) కింద ప్రయోజనాలను పొందేందుకు విస్తృత ప్రచారం కల్పించాలి. సంబంధిత రాష్ట్రాలకు, కేంద్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయడంతో ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారికి రేషన్ కార్డులను జారీ చేయడానికి కసరత్తును చేపట్టడానికి సంబంధిత రాష్ట్రాలకు మరో మూడు నెలల సమయం ఇస్తున్నాం. జిల్లా కలెక్టర్ల కార్యాలయాన్ని సంప్రదించడం, తద్వారా పోర్టల్‌లో నమోదైన ఎక్కువ మందికి రేషన్ కార్డులు జారీ చేయబడతాయి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ప్రయోజనాలను పొందేందుకు వీలు కల్పిస్తుంది. అలాగే జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 ప్రయోజనాన్నీ పొందవచ్చు" అని ధర్మాసనం పేర్కొంది. స్టేటస్ రిపోర్టును దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను అక్టోబర్ 3న ...5లో

కుల గణన అనివార్యం



అదే అంబేద్కర్‌కు నిజమైన నివాళి

చివరగా 1931లో కుల గణన

- ఆ లెక్కల మీదే ఆధారపడిన మండల్ కమిషన్
- వాస్తవ లెక్కలను బయటకు తీయాలి
- రాజకీయ విశ్లేషకులు, నిపుణులు

ఓబీసీల గణన చేపట్టాలని దేశంలోని అన్ని ప్రధాన పార్టీలు (ఎన్డీఏలోని పార్టీలతో సహా), సామాజిక సంస్థలూ కోరుతున్నాయి. తన హిందూత్వ ప్రయోజనాలకు అడ్డుగా నిలుస్తుందన్న ఒకే ఒక్క కారణంతో బీజేపీ నిరాకరిస్తోంది. అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నది. కులగణన జరిగితే సామాజిక తరగతుల్లో ఎవరి సంఖ్య ఎంతో తేలిపోతుంది. ఆ ప్రకారం ఆయా తరగతులు తమ న్యాయమైన వాటా అడుగుతారు. ఇది తమ హిందూత్వ ఎజెండాను దెబ్బతీస్తుంది. ఆరెస్సెస్ చాతుర్వర్ణ వ్యవస్థ పునరుద్ధరణ ఆకాంక్ష ఆవిరైపోతుంది. అందుకే కేంద్రం ఇందుకు మోకాలడ్డుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.



న్యూఢిల్లీ : భారత రాజ్యాంగ నిర్మాత, తొలి న్యాయశాఖ మంత్రి డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ 132వ జయంతి ఉత్సవాలను ఇటీవల ప్రజలందరూ దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఇంకా చెప్పాలంటే, అంబేద్కర్ జయంతిని గతంతో పోల్చుకుంటే దేశప్రజలు, యువత, సబ్బండ వర్గాలు ఘనంగా జరుపుకున్నారు. ఆయన జయంతి వేడుకలు ఈ ఏడాది 150కి పైగా దేశాలలో జరిగాయి. అయితే, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్ తెగలు(ఎస్టీ), ఇతర వెనకబడిన వర్గాలు(ఓబీసీ), మైనారిటీ, అణగారిన, పీడిత వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన అంబేద్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి కుల గణనే అని రాజకీయ విశ్లేషకులు, సామాజిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఆరెస్సెస్, ఇతర హిందూత్వ సంస్థలు, బీజేపీ, దాని అనుకూల సంస్థలు బయటకు అంబేద్కర్ పేరును చెప్పుకొని రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నాయనీ అంతర్గతంగా మాత్రం అంబేద్కర్ సిద్ధాంతాలకు తూట్లు పొడుస్తున్నాయని విమర్శిస్తున్నారు. కుల నిర్మూలనకు పాటు పడిన అంబేద్కర్ ఆశయాలను అంతం చేయాలని చూస్తున్నాయని విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా, మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే ఇందుకు నిదర్శనమని చెపుతున్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నీరు గార్చాలని ప్రయత్నించినా.. ఆ వర్గాల్లో ఐక్యత కారణంగా మోడీ సర్కారు వెనక్కి తగ్గిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు.

కేంద్రంలో 2014లో మొదటి సారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ మోడీ ప్రభుత్వం రిజర్వేషన్లను తొలగించే ప్రయత్నాలనే చేపడుతున్నదని, ఇందులో భాగంగానే ప్రభుత్వ సంస్థలను ప్రయివేటు కంపెనీలు, సంస్థలు, వ్యక్తులకు అప్పగించే చర్యకు పూనుకున్నదని చెపుతున్నారు. కార్పొరేటు, ప్రయివేటు వ్యక్తులు, సంస్థల ప్రయోజనాలకు అనుకూలంగా పని చేస్తున్నదంటున్నారు. మోడీ ప్రభుత్వం తన చేతికి మట్టి అంటకుండా ప్రయివేటీకరణ ద్వారా రిజర్వేషన్లను ఎత్తేసే ప్రయత్నాలను చేస్తున్నదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దేశంలో జనగణన అనేది షెడ్యూల్ ప్రకారం జరగాల్సి ఉన్నా.. అది జరగలేదు. దీంతో 2011 జనాభా లెక్కల మీదే ప్రభుత్వ పథకాలు, ఇతర కార్యక్రమాలు ఆధారపడి పని చేస్తున్నాయి. ఇదిలావుండగా.. దేశంలో కుల గణన అవసరాన్ని నిపుణులు నొక్కి చెప్తున్నారు. దేశంలో చివరగా స్వాతంత్ర్యానికి పూర్వం 1931లో కుల గణన జరిగిందనీ, అందులో వెనకబడిన తరగతులకు(బీసీ) చెందిన ...2లో

నలుగురు సైనికుల సజీవదహనం

- జమ్ముకాశ్మీర్‌లో ప్రమాదం



శ్రీనగర్ : జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. గురువారం మధ్యాహ్నం పూంచ్ - జమ్మూ హైవేపై వెళ్తున్న ఆర్మీ ట్రక్కులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నలుగురు సైనికులు సజీవదహనమయ్యారు. సమాచారం ...5లో

కిలో కాప్సికమ్ ఒక రూపాయే !

- ధర లేక రోడ్డుపై పారబోస్తున్న పంజాబ్ రైతులు



లూథియానా : తాము కష్టపడి పండించిన కాప్సికమ్ పంటకు కనీస ధర కూడా లభించకపోవడంతో పంజాబ్‌లోని మన్సా జిల్లా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కిలోకు రూపాయి ధర మాత్రమే పలుకుతుండడంతో పంటను ...5లో

కొలీజియం సిఫార్సు బుట్టదాఖలు!

- బీజేపీ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయమని ఆదేశించిన జడ్జి
- అది మనసులో పెట్టుకొనే సిఫార్సును తొక్కిపెట్టిన కేంద్రం
- చేసేదేమీ లేక వెనక్కి తీసుకున్న సుప్రీం వివరాలు 5లో..



యెమెన్‌లో ఘోర విషాదం..

- తొక్కిసలాటలో 85 మంది మృతి



సనా : యెమన్‌లో ఘోర విషాదం జరిగింది. ఓ ఛారిటీ పంపిణీ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో 85 మందికి పైగా మరణించగా, వందలాది మందికి గాయాలైనట్టు అధికారులు తెలిపారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. వివరాల ప్రకారం.. యెమెన్ ...5లో

సమ్మె మరింత ఉధృతం

21 నుంచి దశలవారీగా నిరసనలు

- మే 3న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, వంటావార్పు
- కార్యాచరణ ప్రకటించిన ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలనీ, తదితర సమస్యల్ని పరిష్కరించాలనీ డిమాండ్ చేస్తూ చేస్తున్న సమ్మెను మరింత ఉధృతం చేయనున్నట్టు తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ అనుబంధం) ప్రకటించింది. ఈ నెల 17 నుంచి సమ్మె చేస్తున్నా సెర్ప్ ఉన్నతాధికారులు కనీసం స్పందించకపోవడం దారుణమనీ, 21 నుంచి దశలవారీగా నిరసనలు తెలుపుతామని వెల్లడించింది. మే మూడో తేదీన కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, అక్కడే వంటావార్పు నిర్వహిస్తామని తెలిపింది. రాష్ట్ర కమిటీ పిలుపులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. గురువారం హైదరాబాద్‌లోని ...5లో



గుజరాత్ అల్లర్ల కేసులో నిందితులకు క్లీన్‌చిట్

అహ్మదాబాద్ : 2002లో జరిగిన గుజరాత్ అల్లర్లకు సంబంధించిన నరోడా గామ్ కేసులో బీజేపీ నాయకురాలు మాయా కొడ్నానీ, బజరంగ్‌దళ్ నాయకుడు బాబూ బజరంగి సహా 60 మంది నిందితులకు క్లీన్‌చిట్ ఇస్తూ అహ్మదాబాద్‌లోని ప్రత్యేక కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. నరోడా గామ్‌లో మతోన్మాదులు గృహదహనాలకు పాల్పడడంతో 11 మంది ముస్లింలు ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసులో సాక్షిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా 2017లో కోర్టుకు హాజరయ్యారు. 2002లో నరేంద్ర మోడీ నేతృత్వంలోని గుజరాత్ ప్రభుత్వంలో కొడ్నానీ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలోనే రాష్ట్రంలో మతహింస చెలరేగింది. ఆమెకు నరోడా పటియా అల్లర్ల కేసులో న్యాయస్థానం 28 సంవత్సరాలు జైలుశిక్ష విధించగా ఇప్పుడు గుజరాత్ హైకోర్ట్ నిర్దోషిగా విడిచి పెట్టింది.

కష్టాల్లో కంటి పరీక్షలు

పాడైన పరికరాలు

- సరోజినీ దేవి ఆస్పత్రిలో రోగుల తిప్పలు
- నెలలు గడుస్తున్నా బాగు చేయని వైనం
- ఆ పరీక్షలకు ప్రయివేటే దిక్కు



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒకవైపు రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండో దశ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుండగా, మరో వైపు రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ కంటి ఆస్పత్రి సరోజినీ దేవి ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో మాత్రం పరీక్షలకు అంతరాయం ఏర్పడింది. కంటివెలుగు కార్యక్రమంలో రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి కండ్లకు సంబంధించిన ప్రాథమిక పరీక్షలు చేయడం, సమస్యలను ప్రారంభంలోనే గుర్తించి అప్రమత్తం చేస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. అంతే కాకుండా ఈ శిబిరాల్లో రీడింగ్ గ్లాసెస్ అవసరమైన వారికి అక్కడికక్కడే వాటిని అందజేస్తున్నారు. ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరమైన వారి వివరాలు తీసుకుని వాటిని తయారికి పంపించి అనంతరం పంపిణీ చేస్తున్నారు. వీరు కాకుండా కాటరాక్ట్, గ్లకోమా తదితర వ్యాధుల అనుమానితులను గుర్తించి వారిని సంబంధిత ఆస్పత్రులకు పంపిస్తున్నారు. ఇలా సిఫారసు చేస్తున్న రోగుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ లోని సరోజినీ దేవి కంటి ఆస్పత్రికే వస్తుండటం గమనార్హం.

అయితే కంటి వెలుగుకు ముందు సరోజినీకి వచ్చే వారి సంఖ్య ప్రతి రోజు 800 నుంచి 900 వరకు సరాసరిగా ఉండేది. ప్రస్తుతం ఆ సంఖ్య వెయ్యి నుంచి 1,200 వరకు నమోదవుతున్నది. అదే విధంగా ఇన్ పేషెంట్ల సంఖ్య కూడా పెరిగింది. గతంలో రోజువారీగా హాస్పిటల్ అడ్మిషన్లు 80 వరకూ ఉంటుండగా ప్రస్తుతం ఆ సంఖ్య 130 వరకు పెరిగినట్టు సమాచారం. ఆస్పత్రిలో చేరుతున్న వారిలో 70 నుంచి 80 మంది వరకు కాటరాక్ట్ సమస్యతోనే బాధపడుతున్నట్టు తెలుస్తున్నది. ప్రతి రోజు వచ్చే రోగుల లక్షణాల ఆధారంగా వారికి తప్పనిసరిగా చేయాల్సిన పరీక్షలుంటాయి. కంటిలోని రెటీనా వల్ల వచ్చే సమస్యలను ...5లో

నాలుగు నిమిషాల్లోనే..

- గాల్లోనే పేలిన అతిపెద్ద రాకెట్ స్టార్ షిప్



వాషింగ్టన్: ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్‌ఎక్స్ చేపట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద రాకెట్ 'స్టార్‌షిప్' ప్రయోగం విఫలమైంది. అమెరికా దక్షిణ టెక్సాస్‌లోని బోకా చీకా తీరం నుంచి నిప్పులు చిమ్ము కుంటూ నింగిలోకి దూసుకెళ్లిన ఈ భారీ రాకెట్.. కొద్దిసేపటికే పేలి పోయింది. టెస్ట్ ఫ్లైట్‌లో భాగంగా ఈ వ్యోమనౌక రెండు సెక్షన్లు (బూస్టర్, స్పేస్‌క్రాఫ్ట్).. నిర్ణీత సమయం (3 నిమిషాలు)లోగా విడిపోవాలి. కానీ, అంతకుముందే పేలి పోయింది. ఈ ప్రయోగ ఫలితాలను తమ శాస్త్రవేత్తలు సమీక్షిస్తారని 'స్పేస్‌ఎక్స్' వెల్లడించింది. నేటి వైఫల్యం నుంచి అనేక పాఠాలు నేర్చుకున్నామని, మరికొద్ది నెలల్లో మరో ప్రయోగం చేపడతామని.. సిబ్బందిని అభినందిస్తూ ఎలాన్ మస్క్ ట్వీట్ చేశారు.

మహీంద్రాలో సీఐటీయూ హ్యాట్రిక్

మూడోసారి ఘన విజయంతో చరిత్ర తిరగరాసిన సీఐటీయూ

- ఆనందంలో మునిగితేలిన మహేంద్ర కార్మికులు
- ఈ విజయం కార్మికులదే : యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు



నవ తెలంగాణ జహీరాబాద్

మహేంద్ర పరిశ్రమలో సీఐటీయూ మూడోసారి ఘనవిజయం సాధించింది. పరిశ్రమలో చరిత్రను తిరగరాసిన ఘనత చుక్క రాములకే దక్కుతుంది. గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా టీఎంఎస్ అభ్యర్థి గెలుపు కోసం మంత్రి హరీశ్‌రావు, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్ రావు అనేక విధాలా ప్రయత్నాలు చేశారు. ఎమ్మెల్యే మాణిక్యరావు గేట్ మీటింగ్‌లో పాల్గొని ...5లో

కార్మికులదే గెలుపు : సీఐటీయూ

వివరాలు 5లో..

కుల గణన అనివార్యం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు 52 శాతంగా ఉన్నారని తేలిందని గుర్తుచేస్తున్నారు. ఈ సంఖ్య మీదే మండల్ కమిషన్ నివేదిక ఆధారపడిందని తెలిపారు. దీని ఆధారంగానే 1990 దశకంలో దేశంలోని బీసీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పించిన విషయాన్ని నిపుణులు, రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

అయితే, దశాబ్దాల కాలం నుంచి దేశంలో కుల గణన జరగటం లేదనీ, దీని ద్వారా బడుగు, బలహీన వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని స్పష్టం చేస్తున్నారు. పేదలు మరింత పేదలుగా, ధనికులు మరింత ధనికులుగా మారుతున్నారని, దేశంలో సామాజిక, ఆర్థిక అంతరాలు తీవ్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బీజేపీ పాలనలో హిందూత్వ, జాతీయవాదం వంటి భావోద్వేగ రాజకీయాలు దేశ యువతను ఈ వాస్తవాలవైపు ఆలోచించనీయడంలేదని ఆందోళన చెందుతున్నారు. కులం ఆధారంగా జనాభా గణాంకాలు లేకపోవడంతో.. విద్యలో, ఉద్యోగాల్లో, ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నది. తనను తాను ఓబీసీగా చెప్పుకుంటున్న మోడీ.. కచ్చితంగా చేపట్టాల్సిన కులగణనపట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ప్రజల ఆగ్రహానికి మోడీ సర్కారు గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు. కుల గణన జరపడమే అంబేద్కర్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అని పలువురు నిపుణులు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రాహుల్‌కు దక్కని ఉపశమనం


(మొదటిపేజీ తరువాయి)

కేసులో సూరత్‌లోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు కోర్టు రాహుల్ గాంధీకి రెండేండ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. పై కోర్టులో సవాలు చేసేందుకు వీలుగా 30 రోజుల గడువును సైతం రాహుల్‌కు కల్పించింది. అనంతరం పార్లమెంటరీ సెక్రెటేరియట్ ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసింది. దీంతో ఇప్పటికే ఆయన ప్రభుత్వ బంగ్లాను సైతం ఖాళీ చేశారు.

దీంతో రాహుల్ తనకు విధించిన శిక్షను నిలుపుదల చేయాలంటూ సూరత్ సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. శిక్ష నిలుపుదలతో పాటు తనను దోషిగా తేలుస్తూ ఇచ్చిన తీర్పును సైతం నిలిపివేయాలంటూ కోర్టులో రెండు పిటిషన్లను దాఖలు చేశారు. ట్రయల్ కోర్టు ఈ కేసుపై పారదర్శకంగా విచారణ జరపకుండా కఠినంగా వ్యవహరించిందనీ, ఇది రెండేండ్ల జైలు శిక్ష విధించాల్సిన కేసు కాదని రాహుల్ తన పిటిషన్‌లో కోరారు. శిక్షను నిలిపేయకపోతే తన ప్రతిష్టకు నష్టం కలుగుతుందని వివరించారు. రాహుల్ పిటిషన్‌పై న్యాయమూర్తి ఆర్‌పీ మొగేరా గత గురువారం (ఈనెల 13న) వాదనలు విన్నారు. దీనిపై గురువారం తీర్పును వెలువర్చారు. అలాగే, ఈనెల 3న విచారణ చేపట్టిన కోర్టు.. రాహుల్‌కు బెయిల్‌ను మంజూరు చేసిన విషయం విదితమే.

అయితే రాహుల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పుపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. చట్టప్రకారం తమకు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలను వినియోగించుకుంటామని తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. సెషన్స్ కోర్టు తీర్పును సవాలు చేస్తూ గుజరాత్ హైకోర్టు లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం రాహుల్‌కు ఉన్నదని నిపుణులు తెలిపారు.


సైయంట్ 320 శాతం డివిడెండ్



హైదరాబాద్ : ప్రముఖ టెక్నలాజీ సొల్యూషన్స్ కంపెనీ సైయంట్ లిమిటెడ్ 2023 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.16 లేదా 320 శాతం తుది డివిడెండ్‌ను అందించడానికి ప్రతిపాదిం చింది. దీనికి ఆ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. రెండవ సారి ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా రమేస్ అభిశేక్‌ను కొనసాగించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభాలు ఏడాదికేడాదితో పోల్చితే 5.83 శాతం పెరిగి రూ.163.20 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.154 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.1,181 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన త్రైమాసికంలో రూ.1,751.40 కోట్లకు పెరిగింది. శాతం పెరిగి రూ.1,448.9 కోట్లకు చేరింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ సంస్థకు ప్రపంచ వ్యాప్తంగా విభిన్న రంగాల్లోని 300 పైగా ఖాతాదారులు ఉన్నారు.

ఆర్ఆర్ఆర్‌కు మోక్షమెప్పుడో...!?

- భూసేకరణకు నిధులు కరువు • బడ్జెట్‌లో కేటాయింపు రూ.500 కోట్లే • గత ఏడాదీ రూ. 600 కోట్లే ఖర్చు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర రాజధానికి హైదరాబాద్ నగరంతోపాటు మరో నాలుగు జిల్లాలను కలుపుతూ నిర్మించతలపెట్టిన రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) భూసేకరణ ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆర్ఆర్ఆర్‌ను రెండు భాగాలుగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దక్షిణ భాగానికి సంబంధించిన ప్రక్రియ పూర్తయి టెండర్లు సైతం పిలిచారు. దీనికి 6,480 కోట్లు కాగా, 182 కిలోమీటర్ల మేర నిర్మితం కానుంది. అలాగే ఉత్తర భాగానికి రెండు వారాల క్రితం కేంద్రం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. దీనికి 158 కిలోమీటర్లకుగాను రూ.9,164 కోట్లు అవసరమవుతాయి. రెండు భాగాలు కలిపి 340 కిలోమీటర్లు. మొత్తంగా రెండు దశలకు రూ.17 వేల కోట్లు ఖర్చుచేయనున్నారు. దీనికి సంబంధించిన భూసేకరణ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నది. ఎనిమిది లైన్ల రింగురోడ్డు నిర్మాణానికయ్యే భూసేకరణ కార్యక్రమాన్ని వేగంగా చేపట్టేందుకు అవసరమయ్యే నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించలేదు. గత బడ్జెట్ కంటే కూడా ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దాదాపు రూ.250 కోట్లు తక్కువగా చూపించడమే ఇందుకు సాక్ష్యం. రాష్ట్ర ప్రభుత్వం 2022-23 వార్షిక బడ్జెట్‌లో కేవలం రూ.500 కోట్లు మాత్రమే కేటాయించింది. అయితే ఈ నిధులు ఆ ప్రాజెక్టు భూసేకరణకు ఏమాత్రం సరిపోవని ఆ శాఖా అధికారులే చెబుతున్నారు. సుమారు రూ.1400 కోట్లు ఇటీవల బడ్జెట్‌లో కేటాయించి ఉంటే, భూసేకరణ ప్రక్రియ వేగంగా సాగేదని అంటున్నారు.

చెరిసగం

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం నిధులు ఇస్తుండగా, భూసేకరణకు అయ్యే ఖర్చును మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ భరించాల్సి ఉంటుందని డీపీఆర్‌లో పేర్కొన్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్ఆర్ఆర్‌కు ఇచ్చిన నిధులు భూసేకరణకు సరిపోయేలా లేవు. దీంతో ఆ ప్రక్రియ ఆలస్యం కానుంది. గతేడాది 2021-22 బడ్జెట్‌లో రూ.750 కోట్లు కేటాయించగా, అందులో కేవలం రూ.600 కోట్లు ఖర్చు చేశారు. ఈమేరకు సవరించిన బడ్జెట్ అంచనాల్లో సర్కారు పేర్కొంది. మిగతా రూ. 150 కోట్లను ప్రభుత్వం ఇంకా వ్యయం చేయలేదు. ఈసారి మాత్రం రూ. 500 కోట్లు కేటాయించినప్పటికీ, సవరించిన అంచనాల్లో నిధులను పెంచుతారా ? లేక తగ్గిస్తారా ? అనే సంగతి సందేహాస్పదంగానే ఉంది. అది తేలాల్సి ఉంది. దీంతో భూసేకరణ వ్యవహారంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అను మానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఉత్తర భాగానికి సుమారు 4700 ఎకరాల భూమి అవసరమవుతుంది. దీనికోసం మొత్తం రూ.4000 కోట్లు అవసరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి 50 శాతం చొప్పున భరించాల్సి ఉంటుంది. అంటే రూ. 2000 కోట్ల చొప్పున వ్యయం చేయాలి. గత బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు, ఖర్చును పరిశీలిస్తే, పూర్తిస్థాయిలో వ్యయం చేసినా ఇంకో రూ.1100 కోట్లు భూసేకరణకు అవసరం కానున్నాయి.

మరో ఏడాది

ఈ భారీ ప్రాజెక్టుకు నిధుల కొరత నేపథ్యంలో భూసేకరణ ప్రక్రియ మరో సంవత్సరం పట్టే అవకాశం ఉందని పేరు రాయడానికి ఇష్టపడని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. భూసేకరణ వేగంగా సాగకపోతే రానున్న రోజుల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం కూడా మరింత పెరిగే ప్రమాదం లేకపోలేదని సమాచారం. ఇప్పటికే ఈ ఉత్తరభాగం ప్రాజెక్టుకు రూ. 9,164 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా, నిధులు ఆలస్యంగా ఇస్తే, ఆ వ్యయం సైతం మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో నిధులు పెంచితేగానీ, భూసేకరణ ప్రక్రియ వేగంగా సాగదని చెబుతున్నవారూ ఉన్నారు. అయితే బడ్జెట్‌లో కేటాయించకపోయినా, అవసరాన్ని బట్టి ప్రభుత్వం నిధులను ఇస్తుందని ఆర్థిక శాఖ అధికారులు చెప్పారు. ఆర్ఆర్ఆర్ భూసేకరణ, నిధులు తదితర అంశాలపై ఇటు ఆర్అండ్‌బీ, అటు ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారులను సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులో లేరు.

నిరంతరం పోరాడిన నేత సునీత్ చోప్రా

బహుముఖ ప్రజ్ఞాశాలి, త్యాగశీలి

- ఆయన మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు
- బలమైన భూ పోరాటాలు, కూలిపోరాటాలను నిర్వహించడమే ఆయనకు నిజమైన నివాళి: సంతాప సభలో వ్యవసాయకార్మికసంఘం ప్రధానకార్యదర్శి బి.వెంకట్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉన్నత వర్గంలో పుట్టి ఉన్నతమైన చదువులు చదివి అట్టడుగు వర్గాల ప్రజల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేసిన వ్యక్తి సునీత చోప్రా అని వ్యవసాయకార్మికసంఘం అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. దేశవ్యాప్తంగా భూ పోరాటాలను, కూలి పెంపు పోరాటాలను ఉధతంగా నిర్వహించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని చెప్పారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అధ్యక్షతన సునీత్‌చోప్రా సంతాప సభను నిర్వహించారు. అనంతరం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం విస్తత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు సునీత్ చోప్రా చిత్రపటానికి పూలమాలలేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా బి. వెంకట్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు ఆకర్షితుడై ప్రజా ఉద్యమాల్లోకొచ్చిన సునీత్ చోప్రా ఢిల్లీ, కలకత్తా, లండన్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించారని వివరించారు. ఢిల్లీ జేఎన్‌యూలో ఎస్ఎఫ్ఐ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. జలంధర్‌లో జరిగిన డీవైఎఫ్ఐ మహాసభలో మొదటి ట్రెజరర్‌గా ఎన్నికయ్యారని తెలిపారు. 1986 పాలఘాట్‌లో జరిగిన అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం రెండో మహాసభ నుండి మొన్న బెంగాల్లో జరిగిన అఖిలభారత్ పదో మహాసభ వరకు వివిధ బాధ్యతల్లో పనిచేశారని చెప్పారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ కూలీలు జరిపిన అనేక భూ పోరాటాలు, కూలి పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని చెప్పారు.

దేశంలో కార్పొరేట్, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని వెంకట్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగంగా రేషన్ షాపుల ద్వారా బియ్యంతోపాటు వంట సామాను కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను కార్పొరేట్ బహుళ జాతి కంపెనీలకు అప్పనంగా కట్టబెడుతున్నదని చెప్పారు. పేదలకు మాత్రం 60 గజాల ఇంటి జాగా ఇవ్వడానికి మాత్రం చేతులు రావడం లేదని అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద సంవత్సరానికి రెండు కోట్లు ఇండ్లు కట్టి పేదలకు ఇస్తామని చెప్పిన బీజేపీ సర్కార్ ఎనిమిదేండ్ల పాలనలో ఒక్క ఇల్లు కూడా పేదలకు ఇవ్వలేదని చెప్పారు.

వామపక్షాల పోరాట ఫలితంగా పార్లమెంటు ఆమోదించిన అటవీ హక్కుల చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టాలను అమలు చేయ కుండా మోడీ ప్రభుత్వం తొక్కి పెడుతున్నదని, దేశవ్యాప్తంగా పోడు సాగు దారులుగా ఉన్న ఆదివాసి గిరిజనులకు, గిరిజనేతర పేదలకు భూమిపై హక్కు పత్రాలు ఇవ్వకుండా కార్పొరేట్ బహుళజాతి కంపెనీ లకు ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యం పేరుతో, అడవులు పెంచడమనే పేరుతో విలువైన అటవీ భూములు, ఇతర సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టా లని చూస్తుందని వివరించారు. నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతోపాటు నిరుద్యోగాన్ని అరికట్టడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. పెరిగిన ధరల కనుగుణంగా గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీల కనీస వేతనాల జీవోలను సవరించకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుందని తెలిపారు గ్రామీణ ఉపాధి హామీ నిధులను రూ. లక్ష కోట్ల నుండి రూ.60 వేలకోట్లకు కుదించిందని వివరించారు. ఆధార్ కార్డు, జాబ్‌కార్డు, బ్యాంక్ అకౌంటు ఆన్‌లైన్ అనుసంధానం పేరుతో కోట్లాదిమంది పేదలకు పని దినాలకు తగ్గించిందని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణం ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరల కనుగుణంగా రోజు కూలి రూ.600 ఇవ్వాలని, ఉపాధి పనిని 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత పేదలు 55 వేల గుడిసెలను వేలాది ఎకరాల్లో వేసుకుని నివాసం ఉంటున్నారని, వీరందరికీ జీవో నెంబర్ 58, 59 ప్రకారం స్థలాలను క్రమబద్ధీకరించి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగు లక్షల మంది పోడు సాగుదారులకు హక్కు పట్టాలు సిద్ధం చేశామని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఆచరణలో ఒక్కరికి కూడా హక్కు పట్టా ఇవ్వలేదని అన్నారు. తక్షణమే సాగులో ఉన్న ప్రతి ఒక్కరికీ చట్ట ప్రకారం హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే పేదలతో ఉద్యమాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యకాస అఖిలభారత కమిటీ సభ్యులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, నారి ఐలయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పొన్నం వెంకటేశ్వరరావు, బొప్పన పద్మ పాల్గొన్నారు.

ప్రపంచ గమనం

చైనా దౌత్యంతో యెమెన్ యుద్ధంలో కాల్పుల విరమణ

నెల్లూరు నరసింహారావు



అరబ్ దేశమైన యెమెన్ ఎనిమిదిన్నరేండ్ల అంతర్యుద్ధంలో కకావికలయింది. 2014లో మొదలైన ఈ అంతర్యుద్ధం కారణంగా కనీసం 3.5 లక్షలమంది చనిపోయారు. వీరిలో 85వేల మంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలు. వీరు ఆహారం అందక చనిపోయారు. మౌలిక పౌర సదుపాయాలు, ప్రజా పంపిణీ సరఫరా చైన్లు పతనమయ్యాయి. కలరా వంటి అంటువ్యాధులతో ప్రజలు లెక్కకు మించి చనిపోయారు. ఈ అంతర్యుద్ధం ప్రధానంగా యెమెనీ ప్రభుత్వానికి, హౌతీ సాయుధ ఉద్యమానికి మధ్య జరుగుతోంది. 2022లో అబ్ద్రాబ్బు మన్సూర్ హది నుంచి రషద్ అల్ అలీమీకి అధికారం బదిలీ అయింది. 2015 నుంచి మొదట హదీకి, ఆ తరువాత అలీమీకి సౌదీ అరేబియా మద్దతు ఇవ్వటంతో యెమెనీ అంతర్యుద్ధం తీవ్రతరమైంది. అంతిమంగా ఈ యుద్ధం సౌదీ అరేబియా, ఇరాన్ అనుకూల శక్తుల పోరుగా పరిణమించింది.

ప్రస్తుతం ఈ అంతర్యుద్ధం పరిష్కారం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కాల్పుల విరమణపై ఇరుపక్షాలకు ఒక అవగాహన వచ్చిందని ఏప్రిల్ 6వ తేదీనాడు అమెరికా మీడియా పేర్కొంది. యెమెన్‌లో జరుగుతున్న యుద్ధాన్ని నిలిపి వేయాలని సౌదీ అరేబియా యెమెన్ ప్రభుత్వానికి తెలియజేసిందని, సౌదీ ప్రభుత్వం "శాశ్వత కాల్పుల విరమణ" కోసం ఒక ప్రతినిధి వర్గాన్ని యెమెన్ కు పంపిందని, ఏప్రిల్ 14వ తేదీకల్లా దీనికి సంబంధించిన చర్చలు ముగిశాయని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది.

ఇరాన్, సౌదీ అరేబియాల మధ్య రాజీ కుదిరి దౌత్యసంబంధాలు పునరుద్ధరించబడటంవల్లనే యెమెన్, సిరియాలలో జరుగుతున్న అంతర్యుద్ధాలకు ముగింపు పలికే అవకాశం ఏర్పడింది. అన్నింటకంటే ముఖ్యంగా అర్థం కావలసిందేమిటంటే యెమెన్లో జరుగుతున్న అతర్యుద్ధాన్ని పరిష్కరిస్తానన్న అమెరికా అధ్యక్షుడు ఆపని చెయ్యలేదు. కానీ చైనా దౌత్యంతో మాత్రమే ఈ అంతర్యుద్ధానికి పరిష్కారం లభించబోతోంది. అమెరికన్ మీడియా, ఇంటర్సెప్ట్ వంటి స్వతంత్ర వార్తా సంస్థలు చైనా దౌత్యవిజయం వల్లనే లక్షలాది ప్రజల మరణాలకు దారితీసిన యెమెన్ అంతర్యుద్ధం నిలిచిపోనున్నదని కథనాలను ప్రసారం చేశాయి.

ఈ మానవ హననాన్ని ఒక దశాబ్దంపాటు పశ్చిమ దేశాల మీడియా పట్టించుకోలేదు. మధ్య ప్రాచ్య దేశాలతో సంబంధాలు, అనుబంధాలు లోతుగా వున్న అమెరికా ఎన్నడూ ఈ ప్రాంతంలో జరుగుతున్న ఘర్షణలను ఆపటానికి ప్రయత్నం చెయ్యకపోగా వాటిని మరింతగా తీవ్రతరం చేసింది. సౌదీ అరేబియా తన ప్రాంతీయ ప్రత్యర్థి దేశాలతో రాజీపడటం తమను "తీవ్ర నైరాస్యానికి" గురిచేస్తోందని అమెరికా గూఢచార సంస్థ డైరెక్టర్ విలియం బర్న్స్ అన్నట్టు వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా కలలో కూడా ఊహించని అనేక శాంతి ప్రతిపాదనలను అమెరికాకు ఏమాత్రం తెలపకుండా సౌదీ అరే బియా ఆమోదించటంతో అగ్రరాజ్య ఆగ్రహానికి అవధులు లేకుండా పోయాయి. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమంటే అమెరికా నుంచి అత్యధిక విలువగల ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్న దేశం సౌదీ అరేబియా. అమెరికాలోని మిలిటరీ-ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ కి లాభాలు రావాలంటే యుద్ధాలు జరగాలి. శాంతి ఆయుధ వ్యాపారానికి అడ్డంకిగా మారుతుంది. కాబట్టి అమెరికా దౌత్యం శాంతికి వ్యతిరేక దిశలో సాగుతుంటుంది. అనేక దశాబ్దాలుగా మధ్యప్రాచ్య ప్రాంతంలోని దేశాల మధ్య జరిగుతున్న యుద్ధాల లో అమెరికా ప్రమేయం, పాత్రా ఉన్నాయి. అలా అలా దేశాలమధ్య ఘర్షణలను రెచ్చగొట్టి, వాటిని యుద్ధాలకు దారితీసేలా చేసి తన ఆయుధ పరిశ్రమకు లాభాలను అమెరికా ఇబ్బడిముబ్బడిగా దోచిపెడుతోంది.

మరోవైపు చైనా ఈ దేశాలతో మరోలా వ్యవహరిస్తోంది. నిజానికి చైనా ప్రపంచంలో నాలుగవ ప్రధాన ఆయుధ ఎగుమతిదారు. అయితే ప్రపంచ ఆయుధ వ్యాపారంలో అమెరికా వాటా 40 శాతం గా వుంటే చైనా వాటా 5.2 శాతంగా ఉంది. చైనా కంపెనీలు సరుకులను, సేవలను అమ్ముతాయి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేస్తాయి. చైనా కార్యకలాపాలు కొనసాగాలంటే అందుకు అనువైన రాజకీయ పర్యావరణం, స్థిరత్వం, క్రమత పాటించే విలువలుగా ఉండాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చైనా వాటా దాదాపు అమెరికాకు సమానం అవుతోంది. ప్రపంచంలో అత్యధికంగా చమురుని దిగుమతి చేసుకునే దేశంగా చైనా ఎదిగింది. అన్ని దేశాలకంటే ఎక్కువగా సౌదీ అరేబియా చైనాకు క్రూడ్ ఆయిల్ ని ఎగుమతి చేస్తోంది. 2021 లెక్కల ప్రకారం ఈ చమురు విలువ 38.3 బిలియన్ డాలర్లు. సౌదీ చమురు ఎగుమతుల్లో చైనా కు చేస్తున్న ఎగుమతి వాటా 27.8శాతం. అలాగే 2022 లెక్కల ప్రకారం ఇరాన్ విదేశీ వాణిజ్యంలో చైనా వాటా 30శాతంగా ఉంది. చైనాకు ప్రధాన వాణిజ్య భాగస్వాములుగా వున్న సౌదీ అరేబియా, ఇరాన్ దేశాలు మధ్య ప్రాచ్యంలో ఘర్షించే శక్తులకు వెన్నుదన్నుగా ఉన్నాయి. ఈ రెండు దేశాలమధ్య సయోధ్య ఏర్పడితే యావత్ మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొంటుంది. ఈ దిశగా చైనా చేసిన మధవర్తిత్వంతో సౌదీ అరేబియా, ఇరాన్‌ల మధ్య 2021నుంచి చర్చలు కొన సాగుతున్నాయి. 2023 మార్చి10వ తేదీనాడు చైనాలో ఐదు రోజులపాటు జరిగిన చర్చలు సఫలమై రెండు నెలల్లో ఇరు దేశాలమధ్య దౌత్య సంబంధాలను పునరుద్ధరించుకోవాలనే నిర్ణయం జరిగింది. ఒకరి అతర్గత రాజకీయాలలో మరొకరు జోక్యం చేసుకోకూడదని కూడా ఇరుదేశాలు అంగీకారానికి వచ్చాయి. దీనితో యెమెన్‌తో సహా యావత్ మధ్యప్రాచ్యంలోని దేశాల మధ్య శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరిసే అవకాశం ఏర్పడింది.

రాజ్యాంగ రక్షణ కోసం ఫూలే, అంబేద్కర్ జన జాతరలు

29న హైదరాబాదులో రాష్ట్రస్థాయి ఉత్సవం: కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాజ్యాంగ హక్కులను రక్షించుకోవడానికి ఈ నెల15న ప్రారంభించిన ఫూలే, అంబేద్కర్ జన జాతరలను 30వరకు కొనసాగిస్తారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ తెలిపారు.గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక సంఘాల రాష్ట్ర స్థాయి సమావేశాన్ని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవి రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెస్లీ మాట్లాడుతూ ఈ నెల 29న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద రాష్ట్ర స్థాయి ఫూలే, అంబేద్కర్ జనజాతరను వేలాది మందితో నిర్వహిస్తామని తెలిపారు.మనువాద పాలకులు అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టడమే ఈ జాతర్ల ఉద్దేశమని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలను నిర్వీర్యం చేసి, దాని స్థానంలో మనుస్మృతిని ప్రవేశపెట్టేందుకు బీజేపీ సర్కార్ కుట్రలు పన్నుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం ద్వారా బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్లకు సమాధి కడుతున్నదని విమర్శించారు. బీసీ కుల గణను ఎందుకు చేపట్టటం లేదని ప్రశ్నించారు.బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, మహిళలపై 300 శాతం మేర దాడులు, దౌర్జన్యాలు, లైంగిక దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరో పక్క మోడీ సర్కార్ పేదలపై విపరీతమైనభారాలు మోపుతున్నదని తెలిపారు. ఈ



నేపథ్యంలో రాజ్యాంగ రక్షణ కోసం రాజకీయాలకతీతంగా ఐక్య ఉద్యమం చేపడుతామన్నారు. సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరామ్ నాయక్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడసం భీమ్ రావు, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహ్మా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి జగదీష్ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఔరంగబాద్ జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు ప్రచార రథాలు

- తెలంగాణ మోడల్‌ను వివరించే వాల్ పోస్టర్లు
- ఆవిష్కరించిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివద్ధి, సంక్షేమ పథకాల గురించి గ్రామగ్రామాన విస్తత ప్రచారం చేయడానికి ఔరంగబాద్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ప్రచార రథాలు కదిలాయని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 24న తేదీన ఛత్రపతి శంబాజీనగర్ (ఔరంగబాద్)లోని జబిందా మైదానంలో జరగనున్న బీఆర్ఎస్ బహిరంగ సభ విజయవంతానికి పెద్ద ఎత్తున చేస్తున్న ఏర్పాట్లలో భాగంగా ప్రచార రథాలను గురువారం ఆయన ప్రారంభించారు. తెలంగాణ అభివద్ధి, సంక్షేమ పథకాల సమాహారం, తెలంగాణ మోడల్‌ను వివరించే వాల్ పోస్టర్లను టీఎస్ఐఐసీ ఛైర్మన్ గ్యాదరి బాలమల్లుతో కలిసి ఆవిష్కరించారు.

ఆరోగ్యానికి జలక్రీడలు దోహదం

మంత్రి తలసాని



హైదరాబాద్: ఆరోగ్యానికి శారీరక శ్రమ అవసరమని, అందుకు జలక్రీడలు ఎంతగానో దోహదపడతాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సికింద్రాబాద్ స్విమ్మింగ్ పూల్ ను ఆయనప్రారంభోత్సవం చేశారు. వేసవి కాలంలో స్విమ్మింగ్ పూల్ అందుబాటులోకి రావటం సంతోషంగా ఉన్నదని వివరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్ స్విమ్మింగ్ పూల్ గ్రేటర్ హైదరాబాద్ ఇన్‌చార్జి సురేష్, చిరంజీవి, ప్రభాకర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

అహల్యా రంగ్నేకర్, దుర్గాదేవి పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు : ఐద్వా



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

అహల్యా రంగ్నేకర్, దుర్గాదేవి పోరాట స్పూర్తితో ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరముందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మహిళా ఉద్యమ నేతలు దుర్గాదేవి, అహల్యా రంగ్నేకర్ వర్ధంతులను సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణ జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా ప్రజాతంత్ర మహిళ సంఘం నిర్మాతల్లో దుర్గాదేవి ఒకరని గుర్తుచేశారు. పేద మహిళల కోసం ఆమె అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. సారా వ్యతిరేక పోరాటంలో కీలక పాత్ర పోషించారన్నారు. అహల్యా రంగ్నేకర్ చట్ట సభల్లో మహిళల హక్కులకోసం పోరాడారని తెలిపారు. చనిపోయేంత వరకు మహిళల సమస్యల పరిష్కారం కోసం పోరాడారని గుర్తుచేశారు. ఐద్వా ఉపాధ్యక్షురాలు బత్తుల హైమవతి మాట్లాడుతూ.. దుర్గాదేవి గిరిజన మహిళల సమస్యలు, పోడు భూములు సమస్యలపై నిర్వహించిన అనేక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. మహిళల పేరుతోనే భూములకు పట్టాలివ్వాలంటూ ఉద్యమాలు నడిపారని వివరించారు. కె.ఎన్ ఆశలత మాట్లాడుతూ.. దుర్గాదేవి ధనిక కుటుంబం నుంచి వచ్చినా సాధారణ మహిళాగానే జీవించారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మాచర్ల భారతి, బి. అనురాధ బి. కవిత తదితరులు పాల్గొన్నారు.

లీకేజీ కేసులో సీఎం ముఖం చాటేస్తున్నారు

- బీఎస్‌పీ అధ్యక్షులు

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ కేసులో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖం చాటేస్తున్నారని బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. నెల రోజులు గడిచినా ఆ కేసులో పురోగతి లేదని తెలిపారు. కేసులో సిట్ అధికారులు 18 మంది నిందితులను అరెస్టు చేసినట్టే చేసి, వారిని భద్రంగా చూసుకుంటున్నారని విమర్శించారు. లీకేజీ కేసు పాత్రదారులపై పీడీ యాక్టు కింద ఎందుకు కేసు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు.

సంపాదకీయం

జనాభాలో చైనాను అధిగమిస్తే ఒరిగేదేమిటి?

జనాభాలో భారత దేశం చైనాను అధిగమించనుందని ఐరాస జనాభా నిధి విభాగం ప్రకటించింది. అనేక మీడియా సంస్థలు ఈ వార్తను ప్రముఖంగా ఇచ్చాయి. ఇదే వార్త మీద చైనా మీడియా స్పందన భిన్నంగా ఉంది. భారత్ అగ్రస్థానంలోకి వచ్చిన అంశాన్ని సాకుగా తీసుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు పశ్చిమ దేశాల మీడియా మండిపడింది. ఐరాస

> గత కొద్ది సంవత్సరాలుగా చైనాలో పెరిగిన వేతనాల కారణంగా వెలుపలికి పోయిన సంస్థలు వియత్నాం, బంగ్లాదేశ్ వంటి దేశాలకు వెళ్లాయి తప్ప మన దేశానికి వచ్చిన దాఖలా లేదు. ఫోర్డు వంటి సంస్థలు కొన్ని మన దేశంలోని దుకాణాలను మూసుకున్నాయి. మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా పిలుపులు, ప్రోత్సాహకాలను ఎవరూ పట్టించుకోలేదు. అందరికీ పని కల్పించే, గౌరవ ప్రదమైన వేతనాలను ఇస్తే తప్ప దేశంలో, ఉపాధి, డిమాండ్ పెరగదు.

అంచనా ప్రకారం ఈ ఏడాది మధ్యనాటికి మన దేశ జనాభా 142.86కోట్లు, చైనాలో 142.57కోట్లుగా పేర్కొన్నది. ఇరవైతొమ్మిది లక్షల మంది మనవారు ఎక్కువగా ఉంటారు. నిజానికి దీని గురించి జనవరిలోనే కొన్ని సంస్థలు విశ్లేషణలు ఇచ్చాయి. వాస్తవానికి తైవాన్ ఇప్పుడు వెలుపల ఉన్నా అది కూడా చైనాలో భాగంగా చూస్తే ఇప్పటికిప్పుడు మరో రెండున్నర కోట్లు అధికంగా ఉంటుంది. తమ జనాభా తగ్గటం గురించి ఎక్కువగా చెప్పిన పశ్చిమ దేశాల విశ్లేషకులు అభివృద్ధిని చూడకుండా విస్మరించారని చైనా స్పందించింది. రాసి కాదు చూడాల్సింది వాసిని అన్నట్లుగా తమ దగ్గర నిపుణులైన పనివారు ఎందరున్నారో చూడాలని పేర్కొన్నది. అధిక జనాభా వలన కలిగే లబ్దిని చైనా కోల్పోయిందని, ఇక భారత్ యుగం ప్రారంభమైందని కొందరు చిత్రించారు. ఐరాస నివేదికను చూపి తమ దేశాన్ని ఒంటరిపాటు చేసేందుకు పూనుకున్నారని చైనా విశ్లేషకులు పేర్కొన్నారు. గడిచిన ఆరు దశాబ్దాల్లో తొలిసారిగా గతేడాది చైనా జనాభా తగ్గినపుడే అది రెండవ స్థానంలోకి వెళ్లనుందని స్పష్టమైంది. అప్పటి నుంచి మన దేశాన్ని మునగచెట్టు ఎక్కించేందుకు పశ్చిమ దేశాలు పూనుకున్నాయి.



ఐరాస అంచనా ప్రకారం 2060 నుంచి భారత్ జనాభా తగ్గటం ప్రారంభం అవుతుంది. సంఖ్యరీత్యా 2100 నాటికి మన జనాభా 150కోట్లు దాటితే చైనా జనం 77కోట్లకు తగ్గుతారు. జనాభా పెరుగుదల తగ్గనుందని కొన్ని సంవత్సరాల క్రితమే అంచనాకు వచ్చిన చైనా ఎక్కువ మంది పిల్లల్ని కంటే ప్రోత్సాహకాలు ఎక్కువగా ఇస్తామని చెబుతుండగా మన దేశం జనాభాను అదుపు చేసేందుకు 2019లో ఒక బిల్లును తెచ్చి దాని మీద విమర్శలు తలెత్తటంతో వెనక్కు తీసుకుంది. ప్రస్తుతం పని చేసే వయస్సులో ఉన్న వారు మన దేశం కంటే చైనాలో స్వల్పంగా తక్కువ మంది ఉన్నారు. జనాభా ఎక్కువగా ఉండటాన్ని అనుకూలంగా మార్చుకోవాలని చెప్పేవారిని ఎవరూ తప్పుపట్టటం లేదు. చైనా అలాంటి అవకాశాన్ని వినియోగించుకొని ఎంతో లబ్ది పొందింది. భారత్ కూడా చైనాతో పోటీపడి ఎగువకు రావాలని, జనజీవితాలు బాగుపడాలని అందరం కోరుకోవాలి. అమెరికా వారి మాదిరి అగ్రస్థానం తమకే ఉండాలి, మిగిలిన దేశాలన్నీ తమకు లొంగి ఉండాలని కోరుకుంటే తప్పు. ఇక్కడ ప్రశ్న జనాభాతో మన దేశం ఇంతవరకు అలాంటి అవకాశాన్ని ఉపయోగ పెట్టుకోకుండా అడ్డుకున్నది ఎవరు?

వృద్ధులు భారంగా మారుతున్నారు, సమస్య తీవ్రంగాక ముందే మేలుకోవాలి అనే పేరుతో ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ మీద మన దేశంలో దాడి ప్రారంభించారు. చైనాలో అలాంటిదేమీ లేకపోగా వృద్ధుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకున్నారు.ఏ దేశంలోనైనా పనిచేయగలిగిన వయస్సులో ఉన్న వారిని కార్మిక లేదా శ్రమశక్తి అని పిలుస్తారు. సిఇఐసి సమాచారం ప్రకారం 2011 చైనాలో వారి భాగస్వామ్యం అంటే పనిచేస్తున్నవారు 70శాతంపైగా ఉంటే 2021నాటికి అది 68.57శాతంగా ఉంది. ఇదే కాలంలో మన దేశంలో 54 నుంచి 2022లో 41శాతానికి పడిపోయింది. 2018లో 36.9శాతానికి దిగజారింది. అందుకే నరేంద్రమోడీ 2019 ఎన్నికలకు ముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాల ప్రకటన ఆశ చూపారు. వృద్ధులు భారంగా మారినట్లు ప్రభుత్వమే కాదు, మన సమాజం కూడా భావిస్తున్నది. ఆర్థికవేత్తలు చెబుతున్నదాన్ని బట్టి వృద్ధుల కంటే పనికి దూరంగా ఉండే శ్రామికశక్తి అసలు సమస్య. చైనాలో 60శాతం మహిళా శక్తి ఉత్పత్తి రంగంలో ఉంటే మన దేశంలో కేవలం 22శాతమే ఉన్నారు. అందువలన జనాభాలో మనం చైనాను అధిగమిస్తే ఒరిగేదేమిటి, జరిగేదేమిటి? అన్న పద్ధతుల్లో చర్చ జరుగుతోంది. గత కాంగ్రెస్, వర్తమాన నరేంద్రమోడీ ఏలుబడి తీరు తెన్నులను చూసిన వారెవరికీ చైనా ప్రపంచ ఫ్యాక్టరీ మూతపడి భారత్‌లో తెరుచుకుంటుందని విశ్వాసం కలగటం లేదు. గత కొద్ది సంవత్సరాలుగా చైనాలో పెరిగిన వేతనాల కారణంగా వెలుపలికి పోయిన సంస్థలు వియత్నాం, బంగ్లాదేశ్ వంటి దేశాలకు వెళ్లాయి తప్ప మన దేశానికి వచ్చిన దాఖలా లేదు. ఫోర్డు వంటి సంస్థలు కొన్ని మన దేశంలోని దుకాణాలను మూసుకున్నాయి. మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా పిలుపులు, ప్రోత్సాహకాలను ఎవరూ పట్టించుకోలేదు. అందరికీ పని కల్పించే, గౌరవ ప్రదమైన వేతనాలను ఇస్తే తప్ప దేశంలో, ఉపాధి, డిమాండ్ పెరగదు. లేకపోతే ఇప్పటి నుంచి ప్రపంచంలో అధిక జనాభా కలిగిన దేశమేది అనే ప్రశ్నకు భారత్ అనే ఒక మార్కు ప్రశ్నకు సమాధానం రాసుకోవటం తప్ప అగ్రస్థానం వలన ప్రయోజనం ఉండదు.

అసలు 'సతీసహగమనం' ఎలా మొదలయ్యింది?

భారతదేశంలో చెప్పుకోదగ్గ బౌద్ధ చక్రవర్తులలో హర్షవర్ధనుడు ఒకరు. ఈయనకు 'శిలాదిత్య' అనే బిరుదు ఉంది. శిలాదిత్య అంటే బుద్ధుడు చెప్పిన 'పంచశీల'ను పూర్తిగా ఆచరించేవాడు - అని అర్థం. పంచశీల-అంటే ఏమిటి? 1. హింసకు పూనుకోకూడదు. 2. దొంగతనం చేయకూడదు. 3. వ్యభిచరించకూడదు. 4. అబద్ధాలు చెప్పకూడదు. 5. మద్యం సేవించకూడదు. ఇవి బుద్ధుడు చెప్పిన అయిదు సూత్రాలు. హర్షుడు కాన్యకుబ్జ్ రాజధానిగా సాధారణ శకం 606 నుండి 647 మధ్యకాలంలో నలభై ఒక్క సంవత్సరాలు పరిపాలన సాగించాడు. కాన్యకుబ్జ్-పేరు మారి తర్వాత కాలంలో కన్నౌజ్ అయింది. ఇది నేటి ఉత్తరప్రదేశ్‌లో ఒక నగరం. హర్షవర్ధనుడి తండ్రి ప్రభాకర వర్ధన్ నేటి హర్యానాప్రాంతంలోని థానే సర్ అనే ఒక చిన్న రాజ్యానికి రాజు. ఈయన పుష్యభూతి వంశపు రాజులలో అయిదవ వాడు. ఈయన భార్య యశోమతి. ప్రభాకర వర్ధన్ - యశోమతి దంపతులకు రాజ్యవర్ధన్-హర్షవర్ధన్ అనే ఇద్దరు కొడుకులు, రాజశ్రీ అనే కూతురు ఉండేవారు. రాజశ్రీ సంగీత సాహిత్యాలలో మంచి ప్రావీణ్యం గడిస్తుంది. ఆమె వివాహం కన్నౌజ్ రాజు గ్రహవర్మన్‌తో జరుగుతుంది. వారు సుఖ సంతోషాలతో కాలం గడుపుతున్న సమయంలో మాల్వాను పరిపాలించే దేవగుప్త దండెత్తివచ్చి, గ్రహవర్మను చంపేస్తాడు. విషయం రాజ్యవర్ధన్‌కు తెలిసి కోపోద్రిక్తుడై తన బావను చంపిన దేవగుప్తుడిపై ప్రతీకారం తీర్చుకుంటాడు. అతణ్ణి చంపి విజయుడై తిరిగి వెళుతున్నప్పుడు, అవకాశం కోసం ఎదురు చూస్తున్న గౌడ్ రాజు (నేటి బంగ్లాదేశ్ ప్రాంతపు రాజు) శశాంక్ కుట్రపూరితంగా రాజ్యవర్ధన్‌ను చంపిస్తాడు. శశాంక్ అసలు



డాక్టర్ దేవరాజు మహారాజు

> ఇష్టం ఉన్నా లేకపోయినా భర్త చితిపైకి భార్యను సజీవంగా తోసేసి హత్య చేసేవారు. మంటల్లో కాలుతూ భరించలేక కేకలేస్తూ ఆమె లేచి బయటికి వచ్చే ప్రయత్నం చేస్తే, మళ్ళీ కర్రలతో లోపలికి తోసేసే ఏర్పాటు ఉండేది. ఇంతటి క్రూరమైన మానవ హననం ప్రపంచంలో ఏ సమాజంలోనూ లేదు. భారతీయ ఔన్నత్యం గొప్పగా పెంచి డబ్బాకొట్టుకునే ప్రబుద్ధులకు ఇలాంటి మూర్ఖపు ఆచారాలు కనబడవా? ఇదెక్కడి స్త్రీ జనోద్ధరణ? ఇదెక్కడి మానవ వాదం? ఇలాంటి అమానవీయ, అనాగరిక ఆచారాలు ఏర్పరుచుకున్నందుకే ప్రపంచం మన దేశం వైపు వింతగా చూస్తోంది. మనలో కొందరు మాత్రం "మా సంస్కృతే గొప్పది" అని వృథాగా చంకలు కొట్టుకుంటున్నారు.

పేరు నరేంద్ర గుప్త. ఈయన బెంగాల్ ప్రాంతపు రాజు. బలీయమైన రాజ్యకాంక్ష ఆ విధంగా రాజ కుటుంబాలను సర్వనాశనం చేస్తూ ఉండేది. హర్షుడు పుష్పవర్మన్ కుమార్తె పుష్పవతిని పెండ్లి చేసుకుంటాడు. వారికి సంతానం కలగకపోవడం వల్ల హర్షుడి తర్వాత ఆ రాజ్యం అనతికాలంలో ఛిన్నాభిన్నమైంది.


తల్లిదండ్రులు, అన్న, బావ ఒకరి తర్వాత ఒకరు చనిపోవడం వల్ల ఆ రాజకుటుంబంలో మిగిలింది ఒక్క హర్షవర్ధనుడే. అప్పుడతని వయసు కేవలం పదహారేళ్ళు. కుమిలి కుమిలి ఏడుస్తూ కాలం గడుపుతున్న సమయంలో రాజ్యాధికారం చేపట్టవలసి వచ్చింది. మంత్రులు, సైన్యాధ్యక్షులు, ప్రజలూ అందరూ హర్షుడిపై ఒత్తిడి తెస్తారు. సింహాసనం అధిష్ఠించి పరిపాలన కొనసాగించమని వేడుకుంటారు. తన వ్యక్తిగత దుఃఖాన్ని దిగమింగి, అనుభవం లేకపోయినా మంత్రుల అండదండలతో, ప్రజల ప్రేమాభిమానాలతో బాధ్యతను స్వీకరిస్తాడు - హర్షుడు. అలాంటి కిష్టపరిస్థితిని ఎదుర్కొని, నిలబడి, నిలదొక్కుకుని, అనుభవజ్ఞుడిలాగా అందరూ అబ్బురపడేలా ఏకరాజాధిపత్య ప్రభుత్వాన్ని కొనసాగించాడు. వ్యక్తిత్వ వికాసం - విషయంలో నేటి యువతీ యువకులు హర్షుడి జీవితం నుండి కొన్ని విషయాలు నేర్చుకోవచ్చు. కల్పిత కథల్లోని, అభూత కల్పనల్లోని, పుక్కిటి పురాణాల్లోని పాత్రలను ఆదర్శంగా తీసుకోకుండా ఇలాంటి చరిత్రక పురుషుల జీవితాల్లోంచి, వాస్తవ ఘటనల్లోంచి, వారి అనుభవాల్లోంచి నేటి యువతీ యువకులు స్ఫూర్తిని పొందాలి. ముందు పురాణాలకు, చరిత్రకూ గల తేడాను తెలుసుకోగలగాలి. ఆ సామర్థ్యాన్ని పెంచుకోవాలి. రాముడు, కృష్ణుడు వంటి కల్పిత పాత్రలు మనకు ఆదర్శం అని చెప్పే వారి అజ్ఞానాన్ని ఎండగట్టాలి!

కుటుంబపరంగా వీరు శైవులు అయినప్పటికీ, హర్షవర్ధనుడు (శిలాదిత్య) బౌద్ధధమ్మం పట్ల ఆకర్షితుడయ్యాడు. అందులో మహాయాన శాఖను స్వీకరించాడు. అశోకుడు ప్రపంచంలో తొలి బౌద్ధచక్రవర్తి అయితే, బహుశా హర్షుడే చివరి బౌద్ధచక్రవర్తి. ఆ కాలంలో హూణుల దండయాత్రలు విరివిగా కొనసాగుతూ ఉండేవి. వారిని తిప్పికొడుతూ ప్రభాకరవర్ధన్ తన రాజ్యాన్ని పదిలంగా కాపాడుకున్నాడు. అయితే విస్తరించుకోలేకపోయాడు. ఆ పని ఆయన చిన్నకుమారుడితో సాధ్యమైంది. హర్షుడు ఒక్కొక్క రాజ్యాన్ని గెలుచుకుంటూ ఉత్తరాన అరబ్ ప్రాంతం నుండి దక్షిణాన నర్మదా నది దాకా రాజ్యాన్ని విస్తరింపజేశాడు. పడమరలో ఒక్క పంజాబ్ ప్రాంతం, దక్షిణంలో చాళుక్యుల రాజ్యం తప్ప మిగతా భారతదేశమంతా హర్షుడి పాలనలోనే ఉండేది. ఆక్రమించుకుంటూ రాజ్యం విస్తరించుకోవడం ఒక ఎత్తయితే, శాంతియుతంగా ప్రజారంజకంగా పరిపాలించడం మరొక ఎత్తు. కుట్రలతో అధికారంలోకి రావడం, అవివేకంతో ప్రజాజీవితాన్ని అస్తవ్యస్తం చేయడం, అబద్ధాలతో కొనసాగాలనుకోవడం, తమని ప్రజలు విశ్వసిస్తున్నారని భ్రమించడం మనం ఈ రోజుల్లో ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఆ రోజుల్లో జీవన విలువలు, నైతికత సమాజాన్ని నడిపిస్తే - ఇప్పుడు అవి పూర్తిగా కనుమరుగై పోయాయి.

భారతదేశంలో 'సతీ సహగమనం' ఎలా వాడుకలోకి వచ్చిందో తెలుసుకోవాలంటే... హర్షుడి తల్లి గురించి, ఆమె తీసుకున్న నిర్ణయం గురించీ తెలుసుకోవాలి. హర్షవర్ధనుడి తండ్రి ప్రభాకర వర్ధన్ మరణశయ్యపై ఉంటాడు. ఆ సమయానికి కొడుకులు ఇద్దరూ యుద్ధభూమిలో దూరంగా ఎక్కడో ఉత్తర భారత దేశంలో ఉంటారు. తండ్రి ఆరోగ్యం విషమంగా ఉన్న విషయం వేగుల వల్ల హర్షుడికి తెలుస్తుంది. ఆయన హుటాహుటిన యుద్ధభూమి నుండి వెనుదిరిగి తండ్రి దగ్గరికి వస్తాడు. మరణశయ్యపై ఉన్న తండ్రితో చివరిసారి మాట్లాడుతాడు. పక్కనే శోకదేవతలా కూర్చుని ఉన్న తల్లి యశోమతిని చూస్తాడు. తండ్రి ప్రాణాలు కాపాడటానికి ఇంకా ఏమేం చేయాల్సి ఉందో వైద్యులతో, మంత్రులతో సంప్రదించడానికి బయటికి వెళ్ళిపోతాడు. కొంత సమయం

> సతీ సహగమనాన్ని అరికట్టడానికి దేశ స్వాతంత్ర్యానికి ముందు నుండే విస్తృతంగా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. రాజా రామ్మోహన్‌రాయ్ లాంటి సంఘ సంస్కర్తలు నాటి బ్రిటిష్ పాలకులతో నిరంతరం సంఘర్షించాల్సి వచ్చింది. చివరకు ఇందులో మూర్ఖత్వాన్ని అర్థం చేసుకుని, నాటి బ్రిటిష్ పాలకులే ఈ ఆచారాన్ని రద్దు చేస్తూ చట్టం చేశారు. ఉన్నత స్థాయిలో ఉన్నవారి పనులు కిందిస్థాయిలో ఉన్నవారిని ఎలా ప్రభావితం చేస్తాయో చెప్పడానికి ఇదొక ఉదాహరణ! హర్షుని తల్లి - ఒక రాణి గారు - తన ఇష్ట ప్రకారం అగ్నికి ఆహుతవుతుంది - నిజమే! కానీ, అది కొంత మంది కుత్సిత బుద్ధులకు ఒక దురాలోచనను ఇచ్చింది. 'సతీ సహగమనం పేర ఒక దుష్ట సంప్రదాయానికి దారి తీసింది.

తర్వాత ఒక పరిచారిక "రాజమాతను కాపాడండి" అని కేకలేస్తూ పరుగు పరుగున ఆయన మందిరంలోకి వస్తుంది. హర్షుడికి ఏమీ అర్థం కాదు. మరణశయ్యపై ఉన్నది తన తండ్రిగారైతే, ఈ పరిచారిక ఏమిటీ రాజమాతను కాపాడమంటుందీ- అని ఆశ్చర్యపోతాడు. విషయం ఏమిటో నిదానంగా స్పష్టంగా



చెప్పమంటే అప్పుడు చెపుతుంది... "రాణిగారు తనను తాను అగ్నికి ఆహుతి చేసుకుంటున్నారు - వెళ్ళి కాపాడండి" అని కుమిలి కుమిలి ఏడుస్తూ చెపుతుంది.

గుండె పగిలిన హర్షుడు "అమ్మా!" అంటూ చిన్న పిల్లాడిలా రాజభవనం బయటికి పరిగెత్తాడు. అక్కడ కొంత దూరంలో చితి పేర్పించుకుని ఆయన తల్లి యశోమతి చితిచుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటుంది. చితి మీద అగ్నికీలలు పైకి ఎగిసి పడుతుంటాయి. హర్షుడు తల్లి కాళ్ళమీద పడతాడు. అగ్ని ప్రవేశం చెయ్యొద్దని, ప్రయత్నం మానుకోవాలని వేడుకుంటాడు. పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక పోతాడు. 'కరుణించు మాతా! దయచూడు తల్లీ - నువ్వు లేకుండా మేమెలా బతకాలమ్మా' అంటూ ఆమెను అడుగుముందుకేయనివ్వడు. అప్పుడు ఆ తల్లి యశోమతి కుమారుడికి ఇలా చెపుతుంది. "కుమారా! నేను చెప్పే విషయం శ్రద్ధగా విను - మీ నాన్నగారు, ఏ క్షణంలోనైనా ప్రాణం వదిలేయవచ్చు. అందువల్ల అంతకన్నా ముందే నేను సుమంగళిగా వెళ్ళిపోవాలనుకుంటున్నాను. విధవరాలిగా ఈ ప్రపంచానికి నా ముఖం చూపదలుచుకోలేదు. పుత్రా! నువ్వు యువకుడి వయ్యావు. యుద్ధాలు చేసి వీరుడి వయ్యావు. ఇక నా సంరక్షణ నీకు అక్కరలేదు. నన్ను సుమంగళిగా వెళ్ళిపోనీయ్! నా దారికి అడ్డు నిలవకు. నేను బలమైన నిర్ణయం తీసుకున్నాను. దానికి తిరుగులేదు. మీ నాన్నగారు లేని ఒంటరి జీవితం నాకు అక్కరలేదు.." అంటూ ఆ తల్లి ముందుకు సాగిపోయింది. హర్షుడు మళ్ళీ మళ్ళీ బేలగా తల్లికాళ్ళకు అడ్డం పడ్డాడు. ఆమె మళ్ళీ మళ్ళీ ఆ మాటలే చెప్పింది. భిన్నుడైన హర్షుడు తల వంచుకుని దఃఖంలో కూరుకుపోయాడు. రాణి యశోమతి వెళ్ళి అగ్నిలో లీనమై పోయింది. హర్షుడు నేల మీద జీవచ్ఛవంలా పడిపోయాడు.

ఈ ఘట్టం ఈ దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రచన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో ఉంది. ఆ రచన ఆధారంగా ప్రఖ్యాత సమాంతర సినిమా దర్శకుడు శ్యాం బెనెగల్ సమర్పించిన దూరదర్శన్ సీరియల్ "భారత్ ఏక్ ఖోజ్"లో ఈ దృశ్యం చిత్రితమైంది. ఇది సాధారణ శకం ఏడవ శతాబ్దంలో జరిగిన ఒక సంఘటన. ఈ ఘటనకంటే ముందు భర్త చనిపోకముందే భార్యలు అగ్నికి ఆహుతికావడం అనేది జరగలేదు. ఇది కూడా ఒక రాణిగారు తీసుకున్న వ్యక్తిగత నిర్ణయం - అప్పటికి అది ఒక సంప్రదాయంగా లేదు. భర్త మరణించకముందే ఇక్కడ ఒక భార్య తనకు తాను నిర్ణయం తీసుకుని, అగ్నికి ఆహుతైంది. విధవరాలిగా బతకడానికి భయపడింది. అంతే- ఎనిమిదవ శతాబ్దంలో శంకరాచార్యుల వారు రంగప్రవేశం చేశాక, వైదిక మత ఉద్ధరణలో భాగంగా 'సతీ సహగమనా'నికి రూపకల్పన జరిగింది. భర్త చనిపోయిన తర్వాత భార్యలు బతికి ఉండకూడదన్న కఠినమైన నిర్ణయం వాడుకలోకి వచ్చింది. యుద్ధాల్లో భర్తలు చనిపోయారని తెలియగానే భార్యలు బావుల్లోకి దూకి మరణించడం - ఆ తర్వాత కాలాల్లో జరుగుతూ వచ్చింది.

ఇష్టం ఉన్నా లేకపోయినా భర్త చితిపైకి భార్యను సజీవంగా తోసేసి హత్య చేసేవారు. మంటల్లో కాలుతూ భరించలేక కేకలేస్తూ ఆమె లేచి బయటికి వచ్చే ప్రయత్నం చేస్తే, మళ్ళీ కర్రలతో లోపలికి తోసేసే ఏర్పాటు ఉండేది. ఇంతటి క్రూరమైన మానవ హననం ప్రపంచంలో ఏ సమాజంలోనూ లేదు. భారతీయ ఔన్నత్యం గొప్పగా పెంచి డబ్బాకొట్టుకునే ప్రబుద్ధులకు ఇలాంటి మూర్ఖపు ఆచారాలు కనబడవా? ఇదెక్కడి స్త్రీ జనోద్ధరణ? ఇదెక్కడి మానవ వాదం? ఇలాంటి అమానవీయ, అనాగరిక ఆచారాలు ఏర్పరుచుకున్నందుకే ప్రపంచం మన దేశం వైపు వింతగా చూస్తోంది. మనలో కొందరు మాత్రం "మా సంస్కృతే గొప్పది" అని వృథాగా చంకలు కొట్టుకుంటున్నారు.

సతీ సహగమనాన్ని అరికట్టడానికి దేశ స్వాతంత్ర్యానికి ముందు నుండే విస్తృతంగా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. రాజా రామ్మోహన్‌రాయ్ లాంటి సంఘ సంస్కర్తలు నాటి బ్రిటిష్ పాలకులతో నిరంతరం సంఘర్షించాల్సి వచ్చింది. చివరకు ఇందులో మూర్ఖత్వాన్ని అర్థం చేసుకుని, నాటి బ్రిటిష్ పాలకులే ఈ ఆచారాన్ని రద్దు చేస్తూ చట్టం చేశారు. ఉన్నత స్థాయిలో ఉన్నవారి పనులు కిందిస్థాయిలో ఉన్నవారిని ఎలా ప్రభావితం చేస్తాయో చెప్పడానికి ఇదొక ఉదాహరణ! హర్షుని తల్లి - ఒక రాణీ గారు - తన ఇష్ట ప్రకారం అగ్నికి ఆహుతవుతుంది - నిజమే! కానీ, అది కొంత మంది కుత్సిత బుద్ధులకు ఒక దురాలోచనను ఇచ్చింది. 'సతీ సహగమనం పేర ఒక దుష్ట సంప్రదాయానికి దారి తీసింది. దేశ జనాభాలో సగభాగమైన స్త్రీలను అణిచిపెట్టడానికి వైదిక ప్రబోధకులకు ఒక మార్గం దొరికింది. చెడగొట్టడం తేలిక - దాన్ని పునరుద్ధరించుకోవడం చాలా కష్టం!

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.




పెరుగుతున్న జనాభా... తగ్గుతున్న జీవన ప్రమాణాలు...

కొన్ని దేశాల్లో జనాభా పెరిగింది. కొన్ని దేశాల్లో జన సంఖ్య తగ్గుముఖం పట్టింది. వృద్ధుల సంఖ్య పెరిగి, యువ జనాభా తగ్గడం కూడా ఆందోళన కలిగించే విషయమే. తక్కువ భూభాగం కలిగి ఎక్కువ జనాభాతో బాధపడే దేశాలు అభివృద్ధిని సాధించలేవు. అధిక జనాభాతో బాధపడే దేశాల్లోని ప్రజలకు అన్ని సదుపాయాలూ కల్పించడం కష్టం. ఈ కారణంగానే చాలా దేశాలు వెనకబడే ఉంటున్నాయి. వాస్తవ పరిస్థితులను ప్రభుత్వాలు, ప్రజలు అర్థం చేసుకోవాలి. జనాభాను తగ్గించుకుని, పేదరికాన్ని పారదోలాలి. లింగ వివక్షతను రూపు మాపి, సమానత్వాన్ని, మానవత్వాన్ని మెరుగు పరచి మానవ హక్కులను కాపాడాలి. 1989లో యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యు.ఎన్.డి.పి) నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలంటే ప్రభుత్వాల్లో కదలిక రావాలి. 800కోట్లకు చేరువలోనున్న ప్రపంచ జనాభాకు అన్ని వసతులు సమకూర్చవలసిన బాధ్యత వాటిపై ఎంతైనా ఉంది. ఇప్పటికే అడవులను, పచ్చని భూములను ధ్వంసం చేసి, పర్యావరణాన్ని నాశనం చేసేశారు. దాని ఫలితాలను ప్రజలు చవిచూస్తున్నారు. సరైన వసతి లేదు. ఆహార భద్రత లేదు. విద్యా వైద్య సదుపాయాలు గగన కుసుమంలా మారాయి. ఆధునిక ప్రపంచంలో చాలా గ్రామాల్లో తాగునీరు లేక వ్యాధుల బారిన పడుతున్నారు. నగరాలన్నీ మురికి కూపాలుగా మారిపోతున్నాయి. కుటుంబ పోషణార్థం బాలలు వెట్టిచాకిరీ వైపు పయనిస్తున్నారు. బాలకార్మిక వ్యవస్థ పురుడు పోసుకోవడానికి ఆర్థిక లేమి కారణమవుతున్నది. విద్యా సౌకర్యాలు లేక, పట్టించుకునే వారు కరువై వీధి బాలలుగా మారే వారి సంఖ్య ప్రస్తుత ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో పెరిగే అవకాశముంది.

జనాభా పెరుగుదల వలన కలిగే దుష్పరిణామాలను అవగతం చేసుకున్న ఐక్యరాజ్యసమితి దశాబ్దాల క్రితమే కార్యాచరణ ప్రారంభించింది. పలు ప్రపంచ దేశాలు సైతం చేతనైన ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా, ప్రపంచ ప్రజల, ప్రభుత్వాల ఆలోచనా విధానంలో మార్పు రాకపోతే ఫలితం శూన్యం. కాబట్టి జనాభా పెరుగుదల వలన కలిగే విపత్కర పరిణామాలపై ప్రజల్లో నిరంతర చైతన్యం కలిగించాలి. చైనా జనాభా కొద్ది దశాబ్దాల్లో గణనీయంగా తగ్గే అవకాశాలున్నాయి. జనాభాలో వృద్ధుల శాతం పెరుగుతుండటంతో చైనా వన్ చైల్డ్ విధానానికి వీడ్కోలు చెప్పింది. ఇద్దరు పిల్లలను కనేందుకు జంటలకు అనుమతి ఇచ్చింది. ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరాన్‌లో జనాభా విస్ఫోటనం జరిగింది. కాని ప్రస్తుతం జనాభా తగ్గుముఖం పడుతున్నది. ఇటలీ జనాభా తరిగిపోయి, వృద్ధులు పెరిగిపోతున్నారు. జపాన్ జనాభాలో సగం మంది వృద్ధులు ఉండే అవకాశాలున్నాయి. భారత జనాభా చైనాను అధిగమించిందని వార్తలు. జన విస్ఫోటనం మధ్య మానవాళి ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆహార, ఆవాస, తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంలో ప్రపంచమంతా అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రపంచ దేశాలన్నీ నిర్దిష్టమైన ప్రణాళిక, కార్యాచరణతో సమిష్టితత్వంతో ముందుకు సాగాలి.

- సత్తిరాజు



అబ్బో ... మనది మనకే గొప్ప

పెరిగాము... కాళ్ళూ చేతులూ తలల లెక్కల్లో
అక్కడే అనేకం... ఆకలి కడుపుల నకనకల్లో
ఆ పక్కనే వందకొకటి... కార్పొరేట్ పందికొక్కు


మన నిజం దాచేసుకుని... చైనాతో పోలికెందుకు
ఉన్నోళ్ళవీ లేనోళ్ళవీ... అన్నీ కలబోసి చూపేటి
తరసరి లెక్కలూ తలల లెక్కలతోనా అభివృద్ధి?
దారిద్ర్యంపై పోరాటం వారిది... దానితో దోస్తీ మనది
కాకులగొట్టి గద్దలకు దోచి పెట్టే రాజనీతి మనది
గద్దల అదుపులో పెట్టి
కాకుల కడుపు నిమిరే దారి వారిది

వొద్దొద్దులే.... మానేద్దాం.... మూసేద్దాం
పనికిరాని పరువు తక్కువ పోలికలు

- ఉన్నం వెంకటేశ్వర్లు

'విశాఖ ఉక్కు-తెలుగువారి హక్కు'ను కాపాడుకుందాం..

ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 32మంది ఆత్మబలిదానాలతో 18వేల కుటుంబాలు త్యాగం చేసిన 20వేల ఎకరాల భూములలో విశాఖ పట్టణాన నెలకొన్నది ఉక్కు పరిశ్రమ. అందుకే దాన్ని కేవలం పరిశ్రమగా కాదు, 'మన అమరవీరుల స్మృతి చిహ్నం!- "అన్నదాతల త్యాగఫలం!"గా భావిస్తున్నాం. అందువల్లనే 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అన్న నినాదం నేటికీ తెలుగువారి గుండెల్లో కొలువుండిపోయింది. ఈ పరిశ్రమకు నాడు కేంద్రం అందించిన మూలధనం రూ.5వేల కోట్లు. ప్రతి ఫలంగా ఈ సంస్థ కేంద్రానికి చెల్లించిన పన్ను రూ.20వేల కోట్లు. అయినా సరే ప్రయివేటు ఉక్కు పరిశ్రమలకు ఉదారంగా ఇనుప గనులను కేటాయించిన కేంద్రం, ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష కుటుంబాలకు ఆసరా కల్పిస్తున్న ఈ ప్రభుత్వ సంస్థకు నేటికీ గనులు కేటాయించలేదు. సొంత గనులున్న పరిశ్ర మలకు టన్ను ఖనిజం వెయ్యి రూపాయలకు లభిస్తుంటే, గనులు లేక మార్కెట్లో టన్ను రూ.6వేలకు కొంటున్నందున ఉత్పత్తి ఖర్చు తడిసి మోపెడవుతున్నది అందుకే. అప్పుల పాలైంది సంస్థ. పోనీ ఈ సంస్థ కోసమని రైతులిచ్చిన పొలాలను రాష్ట్రపతి పేరిట కాకుండా సంస్థకు బదిలీచేస్తే వాటిలో బ్యాంకు రుణాలు తెచ్చుకుని సంస్థను అభివృద్ధి చేసుకోగలిగే వాళ్ళమంటున్నారు.ఇప్పటికైనా మించిపోలేదు. కేంద్రం మాకు రూ.5వేల కోట్లు వర్కింగ్ కేపిటల్ అందించినా, భూములను సంస్థ పేరిట బదిలీ చేసినా,గనులను కేటాయించినా ఈ సంస్థ లాభాల బాటలో పరుగెత్తిస్తామంటున్నది యాజమాన్యం.



పాతూరి వెంకటేశ్వరరావు
9849081889

అలా చేయటం మోడీ ప్రభుత్వానికి కష్టమేముంది? ఉదాహరణకు 18వందల కి.మీ. దూరంలోని గుజరాత్ ముంద్రా వద్ద గల ఆదానీ 7 పోస్కోల జాయింట్ వెంచర్‌కు తెలంగాణ లోని 'బైలదిల్లా' గనులను కేటాయించిన మోడీ, 450 కి.మీ.లోని విశాఖ ఉక్కుకు ఆ గనులెందుకు కేటాయించలేక పోతున్నారు? నేడు ఆదానీకి నచ్చిన ఏ ప్రభుత్వ సంస్థనైనా, అది చట్టవిరుద్ధమైనా సరే అతనికి కట్టబెడుతున్నారు ప్రధాని. ఇది జగమెరిగిన సత్యమే. వేలాది ఎకరాల భూములతో, సాగరతీరాన, ఓడరేవు నగరాన వెలసిన భారతైక ఉక్కు పరిశ్రమ. అందుకే దీనిపై ఆదానీకన్ను పడింది. అందుకే దీన్ని నష్టాల్లోకి నెట్టయినా అదానీ కోర్కె తీర్చేందుకే ప్రధాని ఇలా చేస్తున్నారని బహిరంగంగానే కార్మికులు, ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ ప్రకారం రూ.2లక్షల కోట్ల భూములు ప్లస్ 750 మిలియన్ టన్నుల ఉక్కును, 500 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలిగిన రూ. లక్షకోట్ల మిషనరీ. మొత్తం రూ.3 లక్షల కోట్ల విలువైన ఈ సంస్థను కేవలం రూ.3 వేల కోట్లకు తెగనమ్మేందుకు బరితెగించింది బీజేపీ. ఇంకో దయనీయమైన అంశం ఏంటంటే నాడు పరిశ్రమకు భూములిచ్చిన వారందరినీ ఉద్యోగాలిస్తామని ఒప్పించిన 18వేల కుటుంబాలలో 8వేల కుటుంబాలకే ఉద్యోగాలివ్వగలిగింది

> ఈ నేపథ్యంలో విశాఖ సంస్థను కొనటానికి కాదు, కొంత వర్కింగ్ కేపిటల్, బొగ్గు, ఇనుప ఖనిజం ఇచ్చి ప్రతిగా దాని ఉక్కు ఉత్పత్తులను తీసుకోవటం ద్వారా సదరు సంస్థను ఆదుకోవాలన్న సత్సం కల్పంతో ముందుకొచ్చిన బీఆర్ఎస్‌ను కసురుకోవటమెందుకు? మునిగిపోతున్న ఆ సంస్థ ఉద్యోగులు, కార్మికులు ఎవరు చేయందించినా పట్టు కోవటానికి సిద్ధంగా ఉన్నారన్నది నిజం. అలా సహకరించటం ద్వారా అదానీ, పోస్కోలాంటి వాళ్ళు చొరబడకుండా చేసే సదుద్దేశంతోనే ముందుకొచ్చింది బీఆర్ఎస్. పోనీ ఆ పనేదో వైసీపీ చేసినా సంతోషిస్తారు బాధితులు.

సంస్థ. మరి ఈ స్థితిలో ఆ భూములతో సహా సంస్థను అమ్మేస్తే, ఇటు ఉద్యోగాలు రాక, అటు భూముల్నీ కోల్పోయిన ఆ పదివేల కుటుంబాలవారు తమ 'గోడు' నెవరికి చెప్పుకోవాలంటూ బావురమంటున్నారు. ఈ అంశంపై వైసీపీ, టీడీపీ, జనసేన మెతకవైఖరిని అవలంబిచడం పట్ల కూడా ప్రజలు విమర్శల బాణాలు గుప్పిస్తున్నారు. పరిశ్రమను కాపాడేం దుకు వామపక్షాలు మాత్రమే శక్తిమేరకు ఉద్యమిస్తున్నా యనేది వాస్తవం. ప్రభుత్వ ఆస్తుల్ని తెగనమ్మటమే తమ పాలసీ అంటున్న బీజేపీ ఏపీలో వైసీపీచేత అమ్మిస్తున్నది. ఒక్క ఏపీలోనే కాదు, దేశవ్యాప్తంగా ప్రభుత్వ సంస్థల్ని తెగనమ్ముతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సన్న చిన్న రైతుల పిల్లలకూ రిజర్వేషన్ సౌకర్యం లేకుండా చేస్తున్నందుకు బీజేపీ అంటేనే ప్రజలు భగ్గుమంటున్నారు. బీజేపీకి తలూపుతున్న పార్టీల పట్ల కూడా గుర్రుగా ఉన్నారన్నది వాస్తవం.

ఈ నేపథ్యంలో విశాఖ సంస్థను కొనటానికి కాదు, కొంత వర్కింగ్ కేపిటల్, బొగ్గు, ఇనుప ఖనిజం ఇచ్చి ప్రతిగా దాని ఉక్కు ఉత్పత్తులను తీసుకోవటం ద్వారా సదరు సంస్థను ఆదుకోవాలన్న సత్సం కల్పంతో ముందుకొచ్చిన బీఆర్ఎస్‌ను కసురుకోవట మెందుకు? మునిగిపోతున్న ఆ సంస్థ ఉద్యోగులు, కార్మికులు ఎవరు చేయందించినా పట్టు కోవటానికి సిద్ధంగా



ఉన్నారన్నది నిజం. అలా సహకరించటం ద్వారా అదానీ, పోస్కోలాంటి వాళ్ళు చొరబడకుండా చేసే సదుద్దేశంతోనే ముందుకొచ్చింది బీఆర్ఎస్. పోనీ ఆ పనేదో వైసీపీ చేసినా సంతోషిస్తారు బాధితులు.

ఉదాహరణకు కేరళలోని "హిందూస్తాన్ పేపర్ లిమిటెడ్"ను కేంద్రం తెగనమ్ముతుంటే, ప్రయివేటు కార్పొరేట్ల పరం కాకుండా పినరయ్ ప్రభుత్వం రూ.146కోట్లకు తీసుకుని కేరళ పేపర్ ప్రొడక్ట్ పేరిట దాన్ని లాభాల్లో పరిగెత్తిస్తూ 7వేల కుటుంబాలను రోడ్డున పడకుండా కాపాడుకున్నది కదా? ఈ సందర్భంగా పార్లమెంట్లో వామపక్ష పార్టీల ప్రాతినిధ్యం లేనందువల్లనే మోడీ ప్రభుత్వం దూకుడుకు కనీసం స్పీడుబ్రేకరన్నా లేకుండా పోయిన వనీ, రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనైనా పార్లమెంటులో కమ్యూ నిస్టుల ప్రాతినిధ్యం ఉండాలనీ కోరుకుంటున్నారు చైతన్యవంతులైన ప్రజలు. ఇలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీలు కూడా బీజేపీ విధానాలను ధిక్కరించేందుకు సంసిద్ధమైన బీఆర్ఎస్ వంటి పార్టీలతో కలిసి పయనిస్తే అణ గారిన వర్గాల్లో వారి పట్ల మరింత గౌరవం పెరుగుతుంది. నాడు భారత్‌లో బ్రిటిష్ పాలకులు సృష్టించిన వాటికన్నా మిన్నగా, ఆర్థిక అసమానతలను, మత విద్వేషాలను పెంచుతున్న ప్రగతి నిరోధక బీజేపీకి, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించే పార్టీ కూడా నాడు కౌరవులకు తోడ్పడిన భీష్మ, ద్రోణ, కర్ణ, కృపాది సజ్జనులు కూడా కాలగర్భంలో కలిసిన సత్యాన్ని మననం చేసుకోవటం సర్వశ్రేయోదా యకం. భూమి తన చుట్టూ తాను తిరుగుతూనే, సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నట్లే, తమ శ్రేయస్సుతో పాటు, తమ రాష్ట్ర, దేశ శ్రేయస్సు కోసం పరితపించాలి. ఈ ఉభయ కర్తవ్యాలను నిర్వహించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలకు, ప్రభుత్వాలకు ఉన్నది.



రంజాన్ పండుగను దేశవ్యాప్తంగా వైభవంగా జరుపుకుంటారు ముస్లింలు. నిరుపేదలు సైతం ఈ పండుగను సంబరంగా జరుపుకుంటారు. ఈద్ సందర్భంగా ప్రతి ఇంటిలో వివిధ రకాల వంటకాలు ఘుమఘుమలాడుతుంటాయి. ఈ పండుగలో సేమియాకి చాలా ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. అందుకే షీర్ కుర్మా రంజాన్ స్పెషల్ వంటకంగా చెప్పుకోవచ్చు. అలాగే హలీం, పాయ షోర్బా కూడా ఎంతో ఇష్టంగా చేసుకుని తింటారు. అలాంటి కొన్ని రంజాన్ స్పెషల్స్ ఈ రోజు మీ కోసం...

ఈద్..పసంద్

మటన్ హలీం

కావాల్సిన పదార్థాలు : మటన్ ఖీమా - ముప్పావు కేజీ, పచ్చిమిర్చి - ఎనిమిది, అల్లంవెల్లుల్లి పేస్టు - టేబుల్ స్పూను, పసుపు - అర టేబుల్ స్పూను, దాల్చిన చెక్క - రెండు అంగుళాల ముక్క, లవంగాలు - నాలుగు, యాలకులు - మూడు, సోంపు - టేబుల్ స్పూను, మిరియాలు - టేబుల్ స్పూను, ఉప్పు - రుచికి సరిపడా, గోధుమ రవ్వ - అరకప్పు, మినపప్పు - టేబుల్ స్పూను, కందిపప్పు - టేబుల్ స్పూను, శనగ పప్పు - టేబుల్ స్పూను, పెసరపప్పు - టేబుల్ స్పూను, బియ్యం - టేబుల్‌స్పూను, ఆయిల్ - మూడు టేబుల్ స్పూన్లు, ఉల్లిగడ్డ - నాలుగు(సన్నగా తరుక్కోవాలి), అల్లంవెల్లుల్లి పేస్టు - టేబుల్ స్పూను, కొత్తిమీర తరుగు - పావుకప్పు, పుదీనా తరుగు - పావు కప్పు, పచ్చిమిర్చి చీలికలు - రెండు, మిరియాలపొడి - అర టేబుల్ స్పూను, పసుపు - పావు టీస్పూను, పెరుగు - ఒకటిన్నర కప్పులు, నెయ్యి - ఆరు టేబుల్ స్పూన్లు, డ్రైఫ్రూట్స్ గార్నిష్‌కు సరిపడా.

తయారు చేసే విధానం : కుకర్‌లో మటన్ ఖీమాను శుభ్రంగా కడిగి వేయాలి.

దీనిలో పచ్చిమిర్చి, అల్లంవెల్లుల్లి పేస్టు, లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, సోంపు, మిరియాలు, పసుపు, రుచికి సరిపడా ఉప్పు, గ్లాసు నీళ్ళు పోసి కలిపి, సన్నని మంటమీద ఐదారు విజిల్స్ రానివ్వాలి. మరో కుకర్ గిన్నెతీసుకుని గోధుమ రవ్వ, పప్పులు, బియ్యం వేసి శుభ్రంగా కడిగి మూడు గ్లాసులు నీళ్లపోసి నాలుగు విజిల్స్ వచ్చేంత వరకు ఉడికించాలి. ఉడికిన మటన్ ఖీమాను మిక్సీజార్‌లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఉడికిన పప్పులను కూడా మెత్తగా రుబ్బుకోవాలి. సన్నగా తరిగిన ఉల్లిగడ్డ తరుగును గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి వచ్చేంత వరకు వేయించాలి. ఇప్పుడు అల్లం వెల్లుల్లి పేస్టు వేసి పచ్చివాసన పోయేంత వరకు వేయించాలి. తర్వాత కొత్తిమీర, పుదీనా తరుగు, పచ్చిమిర్చి వేయాలి. ఇవన్నీ వేగాక మిరియాలపొడి, పసుపు, పెరుగు, ఖీమా పేస్టు, పప్పుల పేస్టు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి. మూతపెట్టి పదిహేను నిమిషాలు ఉడికించి నెయ్యి, డ్రైఫ్రూట్స్ వేసి సర్వ్ చేసుకోవాలి.

షీర్ కుర్మా



కావాల్సిన పదార్థాలు : సన్నని సేమియా - 250 గ్రాములు, మఖానా - కప్పు, నెయ్యి - మూడు స్పూన్లు, చక్కెర కోవా - ఒకటిన్నర కప్పు, పాలు - 250 గ్రాములు, సన్నగా తరిగిన బాదం - చెంచా, సన్నగా తరిగిన జీడిపప్పు - చెంచా, ఏలకులు - నాలుగైదు (పొడి)

తయారు చేసే విధానం : ముందుగా పాన్‌లో నెయ్యి పోసి సన్నని మంటపై వేడి చెయ్యాలి. అది వేడయ్యాక యాలకులు వేసి వేయించాలి. వాటిని తీసి పక్కన పెట్టుకోవాలి. పాన్లో చక్కెర, నీటిని పోసి వేడి చేయాలి. పాకం అవుతున్నప్పుడు దానికి వేయించి పెట్టుకున్న సేమియా జోడించండి. బాగా కలుపుకొని అందులో పాలు పోసి తక్కువ మంటపై మరిగించాలి. పాలు చిక్కబడే వరకు ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు దాని పైన వేయించిన యాలకులు, డ్రై ఫ్రూట్స్ వేసుకుంటే వేడి వేడి షీర్ కుర్మా రెడీ.

పాయ షోర్బా



కావాల్సిన పదార్థాలు : పాయ - అర కేజీ, స్పూన్ పసుపు పొడి - అర స్పూను, ఉప్పు - రుచికి సరిపడా, నల్ల మిరియాలు పొడి - స్పూను, ఏలకులు - రెండు, నూనె లేదా నెయ్యి - రెండు టేబుల్ స్పూన్లు, ఉల్లిగడ్డలు - మూడు (సన్నగా తరిగినవి), పచ్చిమిర్చి - రెండు (సన్నగా తరగాలి), అల్లం వెల్లుల్లి పేస్ట్ - టేబుల్ స్పూను, టమాటో - ఒకటి (సన్నగా తరిగినది), కారం - టీ స్పూను, గరం మసాలా పొడి - అర స్పూను, కొత్తిమీర - కట్ట, చనా పప్పు - ఒకటిన్నర స్పూను, తురిమిన కొబ్బరి - ఒకటిన్నర టేబుల్ స్పూను.

తయారు చేసే విధానం : వేయించిన చనా పప్పు, కొబ్బరి తురుము కలిపి మెత్తగా పేస్ట్ చేసి పక్కన పెట్టుకోవాలి. పచ్చి వాసనను తొలగించడానికి గోధుమ పిండి, వెనిగర్, పసుపు పొడితో పాయాను బాగా కడగాలి. పసుపు పొడి, ఉప్పు, నల్ల మిరియాల పొడి, ఏలకులతో పాటు పాయాను ప్రెజర్ కుక్కర్‌లో వేసి 5 కప్పుల నీరు పోసి 10 నిమిషాల వరకు ఉడికించాలి. పాయా కుక్కర్‌లో ఉడుకుతున్న ప్పుడు మసాలా సిద్ధం చేసుకోవాలి. బాణలిలో నూనె పోసి వేడయ్యాక ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి వేసి వేయించాలి. తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేయాలి. పచ్చి వాసన అంతా పోయే వరకు వేయించాలి. తర్వాత టొమాటో వేసి మెత్తగా అయ్యే వరకు ఉడికించాలి. ఇప్పుడు కారం పొడి, కొబ్బరి తురుము వేసుకోవాలి.

మసాలా నుండి నూనె విడిపోయే వరకు ఉడికించాలి. ఇప్పుడు పాయా ఉడికిన ప్రెషర్ కుక్కర్‌ని తెరిచి అందులో ఈ సిద్ధం చేసుకున్న మసాలా వేయాలి. కుక్కర్ మూత పెట్టి మళ్లీ మీడియం మంట మీద 10 నిమిషాలు ఉడికించి దించేయాలి. ఇందులో సూప్ ఎక్కువ కావాలనుకుంటే నీరు పోసి మళ్ళీ మరిగించాలి. చివరగా గరం మసాలా పొడి, కొత్తిమీర తరుగు వేయాలి. నూనె పైన తేలియాడే వరకు తక్కువ వేడి మీద ఉడికించు కుంటే పాయా రెడీ. ఇది పరాటా లేదా నాన్‌తో వేడిగా తింటే ఎంతో రుచిగా ఉంటుంది.

ముర్గ్ టిక్కా



కావాల్సిన పదార్థాలు : చికెన్ - అరకిలో, అల్లంవెల్లుల్లి ముద్ద - టేబుల్ స్పూను, గరం మసాలా - టీ స్పూను, పెరుగు - కప్పు, కారం - టీ స్పూను, నిమ్మరసం - రెండు టేబుల్ స్పూన్లు, జీడిపప్పు పేస్టు - ఒక టేబుల్ స్పూను, కలర్ - కొద్దిగా, ఉప్పు - తగినంత, శెనగపిండి - ఒక టేబుల్ స్పూను, కోడి గుడ్లు - రెండు, బ్రెడ్ పొడి - రెండు టేబుల్ స్పూన్లు.

తయారు చేసే విధానం : ముందుగా చికెన్‌లో అల్లం వెల్లుల్లి ముద్ద, గరం మసాలా వేసి బాగా కలిపి అరగంట సేపు నాన పెట్టాలి. తర్వాత ఇందులో పెరుగు, నిమ్మరసం, జీడిపప్పు పేస్టు, కలర్, ఉప్పు, కారం వేసి బాగా కలుపు కోవాలి. ఈ ముక్కల్ని తందూరి ఊచకి గుచ్చాలి. ఇప్పుడు ఒక గిన్నెలో కోడిగుడ్డు సొన వేసుకో వాలి. ఇందులో బ్రెడ్‌పొడి, శెనగ పిండి కూర వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఊచకి ఉన్న చికెన్ ముక్క లకి పట్టించాలి. ఎరుపు రంగు వచ్చే వరకు వేగించాలి.



వడదెబ్బ తగలకుండా...

ఎండలు విపరీతంగా ఉన్నాయి. ఈ వేడికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే వడదెబ్బతగిలే ప్రమాదం ఉంది. కాబట్టి.. మనం తీసుకునే ఆహారం, వేసుకొనే దుస్తులపైనా దృష్టి పెట్టాలి..

- ఎండ వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురవటమే కాకుండా చర్మ సంబంధిత సమస్యలూ తలెత్తుతాయి. రోజుకి రెండు నుంచి మూడు లీటర్ల నీటిని తప్పకుండా తీసుకోవాలి.
- చెమటను పీల్చేందుకు, శరీరాన్ని చల్లగా ఉంచేందుకు తేలికపాటి కాటన్ వస్త్రాలు ధరించాలి. వ్యాయామం లాంటివి ఉదయం తొమ్మిది గంటల్లోపు సాయంత్రం అయిదు తర్వాత చేయడం మంచిది.
- ఆహారాన్ని తక్కువ పరిమాణంలో తీసుకుంటే తేలికగా జీర్ణమవుతుంది. వేపుళ్లు, ఎక్కువ మసాలా వేసిన మాంసాహారాలు కాకుండా ఉడకబెట్టిన కూరగాయలు, తాజా పండ్లకు ప్రాధాన్యమివ్వాలి.
- బయటకు వెళ్లాల్సి వస్తే వాటర్ బాటిల్, గ్లూకోజ్‌ను అందుబాటులో ఉంచుకోండి. కళ్లను యూవీ కిరణాల నుంచి కాపాడుకునేందుకు సన్‌గ్లాసెస్‌ను తప్పకుండా ఉపయోగిం చండి. తలకు ఎక్కువ వేడి తగలకుండా స్కార్ఫ్‌ని కట్టుకోండి. ఎస్‌పీఎఫ్ ఉన్న క్రీముల్ని రాసుకున్నాకే బయటకు వెళ్లండి.
- కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీ, టీలు తీసుకోవడం వల్ల నీరంతా పోయి శరీరం డీహైడ్రేట్ అవుతుంది. కాబట్టి వేసవిలో వాటిని చాలా వరకు తగ్గిస్తేనే మంచిది.

ఇల్లు చల్లగా...



వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, ఎండ వేడికి భయపడి చాలామంది ఇంటిపట్టునే ఉండటానికి ఇష్టపడతారు. అయితే ఇంట్లో ఏసీలు, కూలర్లు, ఫాన్లు ఉన్నా ఒక్కోసారి వేసవి తాపాన్ని తట్టుకోవడం కష్టమైపోతుంది. ఇంట్లో ఫర్నీచర్‌ను కొద్దిపాటి మార్పులు చేయడం ద్వారా ఇంట్లో చల్లని వాతావరణాన్ని సృష్టించవచ్చు. అవేంటో తెలుసుకుందాం...

- బెడ్‌రూంలో ఉండే దుప్పట్లు సిల్క్ తరహావి కాకుండా నూలువి ఎంచుకొంటే వేడిని తక్కువగా గ్రహించి గదిని చల్లగా ఉంచుతాయి.
- కిటికీలకు, తలుపులకు కుచ్చులుగా ఉండే కర్టెన్లు మందంగా ఉండటం వల్ల బయటి గాలి లోపలికి ప్రవేశించకుండా అడ్డుకుంటుంది. ఫలితంగా ఇల్లు వేడెక్కే అవకాశం ఉంది. అందుకే వేసవిలో లేత రంగుల్లో ఉండే పలుచటి కర్టెన్లను ఉపయోగిస్తే లోపలికి గాలి ప్రసరించేలా చేస్తాయి.
- వేసవిలో ఇంటిని చల్లగా ఉంచుకోవాలంటే.. ఇంట్లో ఇండోర్ ప్లాంట్లను అక్కడక్కడ పెంచుకోవాలి. ఇవి వేసవి తాపాన్ని తగ్గించడంతో పాటు ఇంటి లోపల ఆక్సిజన్ స్థాయిని పెంచుతాయి. కలబంద, స్నేక్ ప్లాంట్, బేబీ రబ్బర్ ప్లాంట్, గోల్డెన్ పాటోస్ వంటి ఇండోర్‌ప్లాంట్స్‌తోపాటు నీడలో పెరిగే పూల మొక్కలను సైతం ఇంట్లో అక్కడక్కడా అమర్చుకోవడానికి ఉపయోగించవచ్చు.
- ఇంటి గోడలకు పచ్చటి ప్రకృతికి సంబంధించిన వాల్ స్టిక్కర్లు లేదా పెయింటింగ్‌లను అమర్చడం వల్ల అధిక ఉష్ణోగ్రత వల్ల కలిగే చిరాకును తగ్గించడంలో తోడ్పడతాయి.

సమ్మె మరింత ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవాధ్యక్షులు ఎస్వీ.రమ మాట్లాడుతూ..వీఓఏలను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనీ, ఆన్‌లైన్ వర్క్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీఓఏలు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వ అనుకూల సంఘాలు అసత్య ప్రచారాలు చేయడాన్ని ఖండించారు. ఇది సరైన వైఖరి కాదని నొక్కి చెప్పారు. పదేండ్లుగా 18 వేల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఆ సంఘాలకు పట్టవా అని ప్రశ్నించారు. రూ.3,900 వేతనంతో ఎలా బతకాలో చెప్పాలని ప్రశ్నించారు. వీఏఓల మేలు కోసం తాము చేస్తున్న పోరాటంలో కలిసిరావాలని కోరారు. ధర్నాలు, సమ్మెలు, వంటావార్పులు చేస్తే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందనే విషయాన్ని ఏలికలు గుర్తుంచుకోవాలన్నారు. సమ్మెల పట్ల నిర్బంధం విధించడాన్ని తప్పుబట్టారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ మాట్లాడుతూ..గ్రామీణ స్థాయిలో పేదరికం నిర్మూలన కోసం పనిచేస్తున్న వీఓఏలకు రూ.3,900 వేతనం ఇస్తే ఎట్లా అని నిలదీశారు. ఓవైపు తమ హక్కుల కోసం వీఓఏలు సమ్మె చేస్తుంటే.. ధాన్యం కొనుగోళ్లను ఏదో ఒక పద్ధతిలో కొనుగోలు చేస్తామని సెర్ప్ ఉన్నతాధికారులు మాట్లాడటం తగదన్నారు. ఈ విషయంలో సెర్ప్ సీఈఓ సందీప్‌కుమార్ సుల్తానియా జోక్యం చేసుకుని వీఓఏ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేశ్ మాట్లాడుతూ....దశలవారీగా చేయనున్న పోరాటాల కార్యాచరణను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజ్‌కుమార్, కోశాధికారి సుమలత, సహాయ కార్యదర్శులు శరత్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ కార్యాచరణ ఇదే..

- ఈ నెల 21 చెవిలో పువ్వు పెట్టుకుని నిరసన
- 24న ఒంటి కాలుపై నిలబడి నిరసన
- 25న కండ్లకు గంతలు కట్టుకుని ప్లకార్డులతో నిరసన
- 26న రోడ్లను ఊడ్చి నిరసన
- 27న మోకాళ్లపై కూర్చొని నిరసన
- రూ.3900 వేతనం సరిపోవట్లేదని రాష్ట్ర సర్కారుకు తెలిసేలా 28న భిక్షాటన
- తినేందుకు జీతం చాలట్లేదని 29న ఆకులు తింటూ నిరసన
- మేడే సందర్భంగా సమ్మె చేస్తున్న టెంట్ల దగ్గర జెండాల ఎగురవేత
- మే 3న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, వంటావార్పు కార్యక్రమం

మూడు నెలల్లో వలస, అసంఘటిత కార్మికులకు రేషన్ కార్డులు ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

వాయిదా వేసింది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన 28.55 కోట్ల మంది వలస, అసంఘటిత కార్మికులు రేషన్ కార్డులను కలిగి ఉన్నారా? వారందరికీ ఆహార ప్రయోజనాలను అందించారా? లేదా? అనేది తెలియజేయాలని గత విచారణలో సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. జాతీయ ఆహార భద్రతా చట్టం, గ్రామీణ, పట్టణ పేదలకు టార్గెటెడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (టీపీడీఎస్) కింద సబ్సిడీతో కూడిన ఆహార ధాన్యాలను పొందేందుకు కార్మికులు అర్హులేనని, పోర్టల్‌లో నమోదు మాత్రమే సరిపోదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటికు జస్టిస్ ఎం ఆర్ షా సూచిస్తూ "రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం మధ్య డేటాను పంచుకోవడంపై మాకు ఆసక్తి లేదు. నైపుణ్యం ఉన్న, నైపుణ్యం లేని వలస కార్మికుల పథకాల ప్రయోజనం పొందుతున్నారా? అనే దానిపై మాకు ఆసక్తి ఉంది" అని పేర్కొంది.

ఘనంగా మంత్రి కొప్పుల జన్మదిన వేడుకలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలను గురువారం హైదరాబాద్‌లోని మంత్రుల గృహ సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ధర్మపురి నియోజకవర్గ బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులతో పాటు జగిత్యాల, పెద్దపల్లి నియోజకవర్గం నేతలు, పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్ కూడా కొప్పులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్, పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మెన్ పుట్ట మధుకర్, జగిత్యాల జిల్లా పరిషత్ వైస్‌చైర్మెన్ హరినారాయణ్ రావుతో పాటు రాష్ట్రం నుంచి వచ్చిన వివిధ సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

మహీంద్రాలో సీఐటీయూ హ్యాట్రిక్

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వపరంగా కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అయినా.. మహేంద్ర కార్మికులు తమ ఉద్యోగ భద్రత, తమ పిల్లలకు ఉద్యోగాలు, మెరుగైన వేతన ఒప్పందం కోసం మూడోసారి సీఐటీయూ అభ్యర్థి చుక్క రాములను గెలిపించారు. పరిశ్రమలో మొత్తం 585 ఓట్లు ఉండగా అందులో నలుగురు కార్మికులు ఇతర పరిశ్రమల్లో డిప్యూటేషన్‌పై వెళ్లగా ఒక కార్మికుడు అనారోగ్యం కారణంగా వైద్యశాలలో చేరాడు. గురువారం జరిగిన ఎన్నికల్లో 580 ఓట్లు పోలవ్వగా సీఐటీయూ అభ్యర్థి చుక్క రాములకు 296 ఓట్లు రాగా ప్రత్యర్థి ఐఎన్టీయూసీ అభ్యర్థి రాములు యాదవ్‌కు 285 ఓట్లు వచ్చాయి. దాంతో 11 ఓట్ల మెజారిటీతో చుక్క రాములు మూడోసారి ఘనవిజయం సాధించారు. ఈ సందర్భంగా పరిశ్రమ గేటు ముందు భారీ సంఖ్యలో బాణాసంచా పేల్చి జూనియర్, సీనియర్ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులు నృత్యాలు చేశారు. అనంతరం ప్రధాన గేటు నుంచి టెక్నీషియన్స్ కాలనీ వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు.

యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన విజయోత్సవ ర్యాలీలో చుక్క రాములు మాట్లాడుతూ.. ఈ విజయం కార్మికులకే చెందుతుందన్నారు. తమ ప్రత్యర్థులు రకరకాల ప్రలోభాలకు గురి చేసినా లొంగకుండా సీఐటీయూని గెలిపించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. కార్మికులు ఏ నమ్మకంతోనైతే గెలిపించారో వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి బంగారు భవిష్యత్తుకు మరెన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. గతంలో సుదీర్ఘంగా పాలించిన ఆయా యూనియన్లు తాకట్టు పెట్టిన వివిధ కార్మిక సంక్షేమ ఫలాలన్నింటినీ రెండు పర్యాయాలుగా దశలవారీగా సాధించి కార్మికులకు శాయశక్తులా లాభం చేకూర్చామని తెలిపారు. పరిశ్రమలో ఇదివరకే ఉద్యోగం పొంది విధులు నిర్వహిస్తున్నటువంటి సీనియర్ కార్మికుల పిల్లలు పదవ తరగతి పాస్ అయితే వారికి ట్రెనింగ్ ఇప్పించి మహేంద్ర పరిశ్రమలో నేరుగా ఉద్యోగం ఇప్పించిన ఘనత కూడా తమకే దక్కుతుందని అన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం మాట్లాడుతూ సీఐటీయూని భారీ మెజారిటీతో గెలిపించినందుకు కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. విజయోత్సవ ర్యాలీలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామచందర్ సీఐటీయూ నాయకులు మహిపాల్, పిరమిల్ పరిశ్రమ నాయకులు నరసయ్య, ప్రభు, మహేంద్ర పరిశ్రమ నాయకులు కనకారెడ్డి, వీరయ్య గౌడ్, యూసుఫ్, బీపీసీ శేఖర్, అంజయ్య, రాములు, కిషన్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులదే గెలుపు : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహీంద్రా అండ్ మహీంద్రా పరిశ్రమలో సీఐటీయూ గెలుపు ముమ్మాటికీ కార్మికులదేనని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. సీఐటీయూని గెలిపించిన కార్మికులందరికీ ధన్యవాదాలు తెలిపారు. గురువారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. టీఆర్‌ఎస్‌కేవీకి ప్రభుత్వం అండదండలు అందించినా, లక్షల రూపాయలు ఖర్చుపెట్టినా కార్మికులు సీఐటీయూ పక్షాన నిలబడటం మంచి పరిణామమని పేర్కొన్నారు. కంపెనీలో తమ హక్కుల కోసం సీఐటీయూ నికరంగా పోరాడుతున్నది కాబట్టే సీఐటీయూకి వరుసగా మూడోసారి కార్మికులు పట్టం కట్టారని తెలిపారు. భవిష్యత్ పోరాటాలకు ఈ విజయం ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు కార్మిక కోడ్‌లతో కార్మికుల హక్కులను హరిస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏమో కనీస వేతనాలకు గెజిట్ విడుదల చేయకుండా కంపెనీ యాజమాన్యాల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న తీరును ఎండగట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికులు ఐక్య పోరాటాల్లో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

నలుగురు సైనికుల సజీవదహనం

(మొదటిపేజీ తరువాయి)

అందుకున్న పోలీసులు, భద్రతా దళాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. మంటలధాటికి ట్రక్కు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనపై విచారణకు ఆదేశించినట్టు ఉన్నతాధికారులు తెలిపారు. పిడుగుపాటు కారణంగా వాహనంలో మంటలు చెలరేగినట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లోనూ ఇండియన్ ఆర్మీ ట్రక్‌కు ఇలాంటి ప్రమాదమే జరిగింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కి 60 కిలోమీటర్ల దూరంలో ఆర్మీ వెహికిల్‌లో టెక్నికల్ ఫెయిల్యూర్ తలెత్తింది. ఉదయ్‌పూర్‌లోని మిలిటరీ స్టేషన్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం తలెత్తింది. అంతకు ముందు 2021లో ఆర్మీ వెహికిల్‌లో ఉన్నట్టుండి మంటలు చెలరేగి ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.

కొలీజియం సిఫార్సు బుట్టదాఖలు!

న్యూఢిల్లీ : ఒరిస్సా హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ ఎస్. మురళీధర్‌ను మద్రాస్ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలంటూ ఆరు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వానికి తాను చేసిన సిఫార్సును సుప్రీంకోర్టు కొలీజియం వెనక్కి తీసుకుంది. తన సిఫార్సును కేంద్రం ఆమోదించకపోవడం, జస్టిస్ మురళీధర్ మరో నాలుగు నెలలలోనే పదవీవిరమణ సమీపిస్తుండటంతో కొలీజియం ఈ నిర్ణయానికి వచ్చింది. జస్టిస్ మురళీధర్ ఆగస్ట్ 4వ తేదీన పదవీవిరమణ చేయాల్సి ఉంది. గత సంవత్సరం సెప్టెంబర్ 28వ తేదీ నుండి కేంద్ర ప్రభుత్వం తను సిఫార్సును పెండింగ్‌లో ఉంచిందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ ఎస్‌కె కౌల్, కేఎం జోసఫ్, ఎంఆర్ షా, అజయ్ రస్తోగీతో కూడిన సుప్రీం కొలీజియం గుర్తించింది. ఒకవేళ ఇప్పటికిప్పుడు జస్టిస్ మురళీధర్‌ను మద్రాస్ హైకోర్టుకు పంపినా ఆయన ఆరు నెలల పాటు కూడా అక్కడ పదవిలో ఉండే అవకాశం లేదని అభిప్రాయపడింది. దీంతో ప్రస్తుతం బాంబే హైకోర్ట్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ ఎస్‌వీ గంగాపుర్వాలాను మద్రాస్ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. హైకోర్ట్ న్యాయమూర్తులను బదిలీ చేయాలన్న సిఫార్సును కేంద్రం 10 రోజులలో ఆమోదించని పక్షంలో కొలీజియం తన సిఫార్సును వెనక్కి తీసుకుంటుందని ఫిబ్రవరి 3న జస్టిస్ కౌల్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా జస్టిస్ మురళీధర్ నియామకానికి కేంద్రం మోకాలడ్డడానికి బలమైన కారణమే ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. జస్టిస్ మురళీధర్ ఢిల్లీ హైకోర్ట్ న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఆయన నేతృత్వంలోని బెంచ్ 2020 ఫిబ్రవరి 26న ఢిల్లీ పోలీసులపై మండిపడింది. ఢిల్లీ అల్లర్లకు దారితీసేలా విద్వేషపూరిత ప్రసంగాలు చేసిన బీజేపీ నేతలు కపిల్ మిశ్రా, అనురాగ్ ఠాకూర్ (ప్రస్తుత కేంద్ర మంత్రి), ఎంపీ పర్వేష్ సాహెబ్ సింగ్ వర్మలపై ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ప్రశ్నించింది. రెచ్చగొట్టే ప్రసంగాలతో కూడిన వీడియో క్లిప్పింగులను చూసి, ఎఫ్ఐఆర్ నమోదుపై నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. అయితే అదే రోజు రాత్రి జస్టిస్ మురళీధర్‌ను కేంద్రం పంజాబ్ హర్యానా కోర్టుకు బదిలీ చేసింది. కోర్టు ఆదేశించినప్పటికీ బీజేపీ నేతలపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదు.

కష్టాల్లో కంటి పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకునేందుకు ఒసీటీ స్కాన్ చేయాల్సిందే. సరోజినీ దేవి ఆస్పత్రిలో ఈ పరికరం పాడై పోయి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ మరమ్మతులు చేయకపోవడం గమనార్హం. దీంతో పాటు డయాబెటిక్ రెటీనోపతిని గుర్తించేందుకు వాడే గ్రీన్ లేజర్ అనే పరికరం పరిస్థితి కూడా అలాగే తయారైంది. రెటీనా సంబంధిత అనుమానిత లక్షణాలతో ప్రతి రోజు దాదాపు 30 నుంచి 50 మంది వరకు రోగులు ఈ ఆస్పత్రికి వస్తున్నారు. వీరికి చేయాల్సిన పరీక్షల పరికరాలు పాడై పోవడంతో అనివార్యంగా బయటికి రాస్తున్నారు. ప్రయివేటులో పరీక్షలు చేయించుకుందామనుకున్నా ఆ సమీపంలోని ప్రయివేటు డయాగ్నస్టిక్ సెంటర్లలో ఈ పరీక్షలు లేకపోవడం, నగరంలోనే కొన్ని చోట్ల మాత్రమే ఉండటంతో రోగులు ఆర్థిక ఇబ్బందులతో పాటు ఇతర సమస్యలను ఎదుర్కొంటున్నారు. సాధారణంగా సంబంధిత సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగికి తోడు మరొక సహాయకుడు కూడా రావాల్సి ఉంటుంది. పరీక్షల కోసం వారిని తీసుకుని నగరంలోని కొన్ని చోట్ల మాత్రమే ఉండే పరీక్షల కోసం వెళ్లడం, అక్కడ్నుంచి రిపోర్టు వచ్చేంత వరకు వేచి ఉండి, తిరిగి ఆస్పత్రికి వచ్చే సరికి సమయం దాటిపోతున్నదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులకు ఆలస్యమెందుకు?

ఏదేనీ ఆస్పత్రిలో పరికరాలు పాడైపోతే బాగు చేసేందుకు గతంలో చాలా కాలం పట్టేది. దీంతో రోగులు ప్రయివేటుకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను తప్పించేందుకు వైద్యారోగ్యశాఖ టీఎస్‌ఎంఐడీసీ పరిధిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఆన్‌లైన్ ద్వారా సంబంధిత ఆస్పత్రి నుంచి సమాచారం వచ్చిన వెంటనే స్పందించి మరమ్మతులు చేసేలా వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఆ మేరకు సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో పరికరాలు పాడైన విషయాన్ని ఆ ఆస్పత్రి వర్గాలు వెంటనే సదరు కమిటీకి నివేదించాయి. ఈ విషయాన్ని గత ఐదారు నెలల్లో పలుమార్లు గుర్తుచేశాయి. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు.ప్రభుత్వాస్పత్రుల్లో పరికరాల మరమ్మతు ఆలస్యం కావద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ యూనిట్ పేరుతో రూ.17.47 కోట్లతో టీఎస్‌ఎంఐడీసీ పరిధిలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ పరిస్థితిలో పూర్తిస్థాయి మార్పు రాకపోవడం గమనార్హం.

కిలో కాప్సికమ్ ఒక రూపాయే !

(మొదటిపేజీ తరువాయి)

రోడ్డు పైనే పారబోసి నిరసన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సూచన మేరకు తాము కాప్సికమ్ పంట వేశామని, ఇప్పుడేమో కనీస ధర కూడా లభించక నిండా మునిగిపోయామని రైతులు తెలిపారు. ముఖ్యమంత్రి మాటలు విని ఐదు ఎకరాలలో పంట వేశానని, ఇప్పుడేం చేయాలో తోచడం లేదని గోరాసింగ్ అనే రైతు వాపోయారు. సీజన్ ప్రారంభంలోనే ఇంత తక్కువ ధర పలుకుతోందని, 15-17 కిలోల సంచీని 15 రూపాయలకు కొంటున్నారని చెప్పారు. పంజాబ్‌లో ఏడున్నర లక్షల ఎకరాలలో కూరగాయలు పండిస్తున్నారు. వీటిలో సుమారు నాలుగు వేల ఎకరాలలో కాప్సికమ్ వేశారు. ఈ సంవత్సరం ఇతర రాష్ట్రాల నుండి కూడా పంట పెద్ద ఎత్తున పంజాబ్‌కు రావడంతో ధర ఒక్కసారిగా పడిపోయింది. కోవిడ్ సమయంలో సైతం కిలో 10-15 రూపాయల ధర పలికిందని రైతులు గుర్తు చేశారు. ఆ తర్వాత 2020, 2021 సంవత్సరాలలో కూడా కిలో 20 రూపాయల వరకూ పలికింది. తమను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని రైతులు విమర్శించారు. పంటను కొల్‌కతా తీసికెళ్లి అమ్ముకునేందుకు సాయపడాలని వారు కోరుతున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం పెదవి విప్పడం లేదు.

యెమెన్‌లో ఘోర విషాదం..

(మొదటిపేజీ తరువాయి)

రాజధాని సనాలోని ఓ పాఠశాలలో ఛారిటీ కార్యక్రమం ఏర్పాటుచేశారు. కొందరు వ్యాపారులు నగదు పంపిణీ చేస్తుండగా ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 85 మందికి పైగా మరణించగా, 322 మంది గాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు అంతర్గత మంత్రి ఓ ప్రకటనలో తెలిపారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించినట్టు పేర్కొన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అన్నారు. తొక్కిసలాటకు సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై విచారణకు కమిటీని ఏర్పాటు చేసినట్టు హుతీ రాజకీయ చీఫ్ మహదీ అల్-మషత్ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ లో 21 మంది అరెస్టు

నవతెలంగాణ వనస్థలిపురం



వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 21 మందిని అదుపులోకి తీసుకున్నట్టు వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ ఎల్ బాలు చౌహాన్ తెలియజేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వారిని గురువారం హయత్‌నగర్ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ సుజాత ముందు హాజరుపరచగా ఒకరికి తప్ప మిగిలిన 20 మందికి రూ. 58,500 జరిమానా విధించారు. అతిగా మద్యం సేవించిన బాలాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఎం సునీల్ కుమార్‌కు రెండు రోజులు ట్రాఫిక్ డ్యూటీతో పాటు రూ. 3,500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ బాలు చౌహాన్ మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ వ్యక్తులకు ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తున్నామని, మద్యం సేవించి వాహనాలు నడపటం వల్ల కలిగే దుష్ఫలితాలను తెలియజేస్తున్నట్టు తెలిపారు.

తెలంగాణలో అన్ని మతాల ప్రజలకు తగిన న్యాయం

నవతెలంగాణ-ఘట్కేసర్



తెలంగాణ ప్రభుత్వంలోనే హిందూ ముస్లిం క్రిస్టియన్లకు తగిన న్యాయం జరుగుతుందని చౌదరిగుడా గ్రామ సర్పంచ్ బైరు రమాదేవి రాములు గౌడ్ అన్నారు మండలంలోని చౌదరిగుడా గ్రామపంచాయతీలో గురువారం రంజాన్ పండుగకు ముస్లిం సోదరులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత హిందూ ముస్లిం క్రిస్టియన్ పండుగలకు దుస్తులు పంపిణీ చేసే ఘనత ఒక్క కేసీఆర్‌కే దక్కిందని అన్నారు. మాజీ సర్పంచ్ బైరు రాములు గౌడ్, ఎంపీటీసీ పులకంటి భాస్కర్ రెడ్డి, కార్యదర్శి గౌతమి, వార్డు సభ్యులు బైరు లక్ష్మణ్ గౌడ్, భోజిరెడ్డి, కొంగరి శంకర్, సుధాకర్, స్వామి, దాస్, సంయుక్త నాయకులు బండ్లగూడ నాగేష్ గౌడ్, వేగ పాలడుగు సందీప్ రెడ్డి, దావీదు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నోరూరించే మామిడిపండ్లకు భలే గిరాకీ

- తాజా మామిడి పండ్లపై కొనుగోలుదారుల ఆసక్తి
- పండ్ల ధరలకు రెక్కలు

నవతెలంగాణ -మేడ్చల్ కలెక్టరేట్



నోరూరించే మామిడి పండ్ల అంటే ఎవరికి ఇష్టం ఉండదు. అసలే ఎండకాలం కావడంతో తాజా మామిడిపండ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. చూస్తేనే కోనాలని పించే విధంగా చూపరులను ఆకట్టుకుంటున్న మామిడిపండ్లకు భలే గిరాకీలు పెరిగాయి. మామిడిపండ్లు కోనాలంటే కుషాయి గూడా మార్కెట్‌కు వెళ్లి కోనాల్సి వచ్చేది. వ్యాపారులు పచ్చని చెట్ల క్రింద చూపరులను ఆకట్టుకునేలా పండ్లను పేర్చగా అటుగా వెళ్లేవారు పండ్లు ఎంతకు ఇస్తావు అంటూ పలుకరించి కోనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం కీసర మండలంలోని కీసర ,నాగారం, దమ్మయిగూడా,రాంపల్లి గ్రామాలల్లో మామిడి పండ్ల అమ్మకాలు రోజురోజుకు పెరుగుతున్నాయి.

మామిడి పండ్ల ధరలకు రెక్కలోస్తున్నాయి..

తింటే స్వీటుగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగం ఉండటంతో మామిడిపండ్ల కోనుగోలుదారులు పెరుగుతున్నారు.కిలో రూ 90 లకు వినియోగదారులు అమ్మకాలు సాగిస్తు న్నారు. యాద్రాద్రి జిల్లాలోని భువనగిరి ,చీకటిమామిడి ప్రాంతాలలోని మామిడి తోటల నుండి పలు ప్రాంతా లకు మామిడిపండ్లను క్వింటాళ్ల కొద్ది తీసుకుని వెళ్తుంటారు. అక్కడ నుంచి తీసుకువచ్చిన మామిడి పండ్ల ను మండలంలో అమ్మకాలు జరుపుతున్నారు. ఎండకాలంలోనే కోనుగోలు ఎక్కు వగా ఉంటా యని కాలం మారితే వేరే పండ్ల అమ్మకాలు చేయాల్సిం దేనం టున్నారు వ్యాపారు లు. ఎండకాలం వేడిమి ఎక్కువగా ఉండటంతో కార్లలో పోయేవారు, వాహనాలలో పోయే వారు ఆపి మరి తీసు కుని వెళ్లా రని తెలిపారు.అన్ని ఖర్చులు పోను బతకడానికి సరిపో యే డబ్బులు వస్తున్నా యని పండ్లు అమ్మేవారు చెబుతున్నారు.

ఉప్పల్ భగాయత్ లేఅవుట్ బాధ్యతలు జలమండలికి..



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉప్పల్ భగాయత్ లే అవుట్‌కు తాగు నీటి సరఫరా, మురుగు నీటి వ్యవస్థ నిర్వహణను జలమండలి త్వరలో చేపట్టనుంది. రాబోయే మూడేండ్ల వరకు ఈ ప్రాంతంలో మంచినీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ పర్యవేక్ష నుంది. అయితే దీనికయ్యే నిర్వహణ వ్యయాన్ని హెచ్‌ఎం డీఏ భరించేలాగా ప్రతిపాదనలు రూపొంది స్తున్నారు. నగరంలోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో ఫేజ్-1లో 413 ఎకరాలు, ఫేజ్ -2 లో 72 ఎకరాల విస్తీర్ణంలో రెసిడెన్షియల్, మల్టీ పర్పస్ లే అవుట్లను హెచ్‌ఎండీఏ గతంలో అభివృద్ధి చేసిన విషయం తెలిసిం దే. వీటికి అవసరమైన మౌలిక సదుపాలయాలు తాగునీటి సరఫరా, మురుగు నీటి పారుదల కోసం పైపు లైన్లతో పాటు భూగర్భ డ్రయినేజీ వ్యవస్థను సైతం నిర్మించింది. తాగునీటి అవసరాలు తీర్చేందుకు రెండు ఫేజుల్లో 3 ఓవర్ హెడ్ ట్యాంకులు, 3 సంపులను నిర్మించింది. అంతే కాకుండా పంప్ రూములను సైతం ఏర్పాటు చేసింది.

క్షేత్ర స్థాయిలో పరిశీలన

ఉప్పల్ భగాయత్‌లో ఇప్పటికే ఎంతో మంది నివా సాలు ఏర్పాటు చేసుకున్నారు. నివాసానికి యోగ్యంగా ఉండటానికి ఈ ప్రాంతంలో తాగు నీటి, మురుగు నీటి పారుదల డిస్ట్రిబ్యూషన్ లైన్లు తదితర వాటిని ఉపయో గంలోకి తీసుకురావాల్సిన అవసరముంది. ఈ క్రమంలో క్షేత్ర స్థాయిలో పరిస్థితుల అవగాహన కోసం జలమండలి ఎండీ దానకిశోర్, హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి గురువారం ఉప్పల్ భగాయత్ ప్రాంతాన్ని సందర్శించారు. హెచ్‌ఎండీఏ, వాటర్‌బోర్డు ఇరు శాఖల ఇంజినీర్లు మంచి నీటి సరఫరా కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర రిపోర్టు తయారు చేసి నివేదిక సమర్పించాలని ఎండీ ఆదేశించారు. పంపింగ్‌కి సంబంధించిన ఏర్పాట్లను సైతం త్వరగా పూర్తి చేయాలన్నారు. సీవరేజి నిర్వహణ కోసం ఇప్పటికే నిర్మించిన భూగర్భ డ్రయినేజీని ఉపయోగంలోకి తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో నివాసాల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నం దున. ఈ లేఅవుట్ల కోసం ప్రత్యేకంగా వేరు వేరుగా మురు గు నీటి శుద్ధి కేంద్రాలను నిర్మించడానికి అనువైన ప్రదేశా న్ని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఆపరేషన్స్ డైరెక్టర్ -2 స్వామి, సీజీఎం సుజాత, హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఎస్ఈ యూసుఫ్ హుస్సేన్‌తోపాటు ఇరు శాఖల ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫ్లవర్ పార్క్ పనులపై దృష్టి సారిస్తాం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



నవతెలంగాణ-హయత్‌నగర్

డంపింగ్ యార్డు స్థలంలో నిర్మించదలచిన ఫ్లవర్ పార్క్ పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని డంపింగ్ యార్డు పరిసరాలను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సత్యనారాయణతో గురువారం కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2007లో బయో మైనింగ్‌లో భాగంగా శ్రీభవాని ఎంటర్ ప్రైజెస్ సంస్థ డంపింగ్ యార్డ్ ఎత్తివేసే విధంగా ఒక ఒప్పందం కుదుర్చుకుందన్నారు. అయితే ఒప్పందం ప్రకారం ఆ పనులు చేయలేకపోవడంతో ఆ సంస్థను సస్పెండ్ చేయగా, ఆ విషయంలో కాంట్రాక్టర్లు కోర్టుకు వెళ్లారన్నారు. ప్రస్తుతం కోర్టు కేసులో ఉండటం వల్ల డంపింగ్ యార్డు స్థలంలో నిర్మించదలచిన ఫ్లవర్ పార్క్ పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఆ విషయాన్ని తాము మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. కేటీఆర్ బయో మైనింగ్ సంస్థ అయిన శ్రీ భవాని ఎంటర్ ప్రైజెస్ సంస్థ సభ్యులతో మాట్లాడి కోర్టులో ఉన్న వివాదం సెటిల్మెంట్ చేసుకోవాలని సూచించారని చెప్పారు. అదనంగా మరో మూడు, నాలుగు కంపెనీలతో ఒప్పందం చేసుకొని వచ్చే ఆరు నెలల్లో డంపింగ్ యార్డు ఎత్తేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారన్నారు. దానిలో భాగంగా ఎంతో అనుభవం ఉన్న కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సత్యనారాయణని ప్రత్యేకంగా నియమించారని తెలిపారు. అలాగే, ఆటోనగర్ డంపింగ్ యార్డు ప్రాంతంలో అధికారులు, సంస్థ సభ్యులు పర్యటించారు. కోర్టులో ఉన్న వివాదం వారం రోజుల్లో పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ వివాదం పూర్తి కాగానే ముందుగా కంపౌండ్ వాల్ నిర్మిస్తామని కమిషనర్ తెలిపారు. ప్రతిరోజూ అధికారులు, సంస్థ సభ్యుల మీద ఒత్తిడి తేవడం వల్లే ఇప్పుడు ఒక పరిష్కారం దిశగా సాగుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో డంపింగ్ యార్డు స్థలంలో ఒక అద్భుతమైన పూల వనం నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు నరేష్, మాన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, రాకేశ్, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను జయప్రదం చేయండి

- సీఐటీయూ మండల కన్వీనర్ పెంటయ్య

నవతెలంగాణ - మీర్‌పేట్



అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మేడే ఉత్సవాలలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ బాలాపూర్ మండల కన్వీనర్ జి.పెంటయ్య అన్నారు. బాలాపూర్ చౌరస్తాలో బీసీడబ్ల్యూ కార్మికులతో మేడే ఉత్స వాల జయప్రదం కోసం గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసిన వీరులను స్మరిస్తూ మేడే ఉత్సవాలలో అసంఘటిత, సంఘటిత రంగాలలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడూ పాల్గొనాలని సూచించారు. బాలాపూర్ చౌరస్తా బీసీడబ్ల్యూ సంఘం అధ్యక్షులు సురేష్, ప్రధాన కార్యదర్శి స్వామి, సీఐటీయూ నాయకులు దాసరి బాబు, సత్యం, శ్యామ్, వీరయ్య, జగన్, పుల్లయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ, చైతన్య కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి'

నవతెలంగాణ-సంతోష్‌నగర్



ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న నారాయణ, శ్రీ చైతన్య, రీసోనేన్స్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఇంటర్మీడియట్ కళాశాలల ఉన్నత అధికారి(ఆర్జేడీ) మరియు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి.జయప్రద భాయ్‌కి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు మేట్టల చైతన్య యాదవ్, పి.శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షల ఫలితాలు రాకముందే ముందస్తు అడ్మిషన్ల పేరుతో మార్కెటింగ్ సిబ్బంది ద్వారా పెద్ద సంఖ్యలో అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. నిరుపేదల రక్తాన్ని పీల్చుతున్న నారాయణ, శ్రీ చైతన్య, భాష్యం కళాశాలల గుర్తిం గుర్తింపు రద్దు చేయాలని కోరారు. ఇంటర్ బోర్డు నోటిఫికేషన్ అనుగుణంగా అడ్మిషన్ ప్రక్రియ రాక ముందే పలు కార్పొరేట్, ప్రయివేటు కళాశాలల్లో మొదటి సంవత్సరం క్లాసుల పేరుతో 50% ఫీజులు కట్టించుకుని వేసవి తరగతులు నడిపిస్తున్నారని చెప్పారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలు రాకముందే రెండవ సంవత్సరం సిలబస్ బోధిస్తూ విద్యార్థులను మానసిక వేధనకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భూగర్భ డ్రయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ-హయత్ నగర్



మాన్సూరాబాద్ డివిజన్, సెంట్రల్ బ్యాంక్ కాలనీ రోడ్ నెం.5ఏ లో నూతన భూగర్భ డ్రైయినేజీ పనుల కోసం రూ.16.80 లక్షలు మంజూరయ్యాయని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. దాని కోసం డ్రయినేజీ పైపులు కాలనీకి వచ్చిన నేపథ్యంలో కాలనీ వాసులతో కలిసి ఆ ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మావతి నగర్, బాలాజీ నగర్, చంద్రపురి కాలనీ, చిత్రసీమ కాలనీల్లో నిత్యం డ్రయినేజీ పొంగుతున్నందున సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నుంచి మొత్తం రూ.53.40 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. త్వరలోనే ఆయా కాలనీల్లో పనులు మొదలవుతాయని, అందులో భాగంగా సెంట్రల్ బ్యాంక్ కాలనీ కూడా ఉందని తెలిపారు. ఆయన వెంట మునగాల హరీష్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సాయికాంత్, ధనంజయ్, రవీందర్, ప్రకాశ్, సురేందర్ తదితరులు ఉన్నారు.

రంజాన్ చివరి వారం... పసందైన విందుకి సమయం...!

నవతెలంగాణ-సిటీబ్యూరో



రంజాన్ మాసం చివరి వారం వచ్చేసింది. ప్రార్థన, సమాజం కోసం సమయం కేటాయించడానికి ఇది సమయం. అంతేకాదు, ఉపవాసాలు ఆ ఉపవాస ముగింపు వేళ బంధువులు, స్నేహితులతో విందును ఆస్వాదిం చడం... వినూత్నమైన సీజన్‌గా ఇది నిలుస్తుంటుంది. దక్షిణ భారతదేశంలో అత్యంత వైవిధ్యమైన ముస్లిం సమాజం ఉం టుంది. ఇది మహోన్నతమైన కలినరీ సంప్రదా యాలను ఈ సమయంలో చూపుతుంటుంది. దక్షిణ భారతదేశంలో రంజాన్ చివరి మాసంలో ఇఫ్తార్ విందు సంప్రదాయం అధికంగా కనబడుతుంది. సూర్యా స్తమయం ప్రార్థనలు ముగిసిన తరువాత ముస్లింలు ఈ విందు చేసుకుం టుంటారు. ఈ భోజనాలు సాధారణంగా ఖర్జూరం ఆరగించడంతో ప్రారంభమై నీరు లేదా జ్యూస్ తీసుకోవడం చేస్తారు. ఆ తరువాత విస్తృత శ్రేణి రుచులు, స్వీట్లు తింటారు. అత్యంత ప్రాచుర్యం పొందిన అలాంటి డిషెస్‌లో సమోసా ఒకటి. కూరగాయలు లేదా మాంసం వంటి వాటితో నింపబడిన ఈ త్రికోణా కారపు పేస్ట్రీని పుదీనా చట్నీ లేదా చింత పండు సాస్‌తో కలిపి సర్వ్ చేస్తుంటారు. ఇక ఇఫ్తార్ విందులో కనిపించే మరో అంశం బిర్యానీ. సాధా రణంగా మటన్ లేదా చికెన్, వెజిటేబుల్స్‌తో తయారుచేసే ఈ బిర్యానీని రైతాతో కలిపి సర్వ్ చేస్తారు. తియ్యందనాలను కోరుకునే వారికి ఫిర్నీ, షీర్మాల్ వంటివి ఉంటాయి.

"దక్షిణ భారతదేశంలో రంజాన్ చివరి మాసంలో ఆహారం అత్యంత ముఖ్యమైన భాగంగా ఉంటుంది. ఈ కమ్యూనిటీ అంతా ఏకం కావడంతో పాటుగా సంయుక్తంగా ప్రార్థనలు చేయడం, పవిత్ర మాసపు స్ఫూర్తిని అణువ ణువునా ప్రదర్శించడం, ఉపవాసాన్ని ముగించే సంతోషాన్ని అందరితో పంచుకోవడం కనిపిస్తుంది" అని గోల్డ్ డ్రాప్, సేల్స్ అండ్ మార్కెటింగ్, డైరెక్టర్ మితేష్ లోహియా అన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్



కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం పట్ల అధికారులు దృష్టి సారించాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటెన్సివ్ శానిటేషన్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇంటరాక్షన్ కార్యక్ర మంలో భాగంగా గురువారం రాఘవేంద్ర కాలనీలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా ప్రస్తుతం ఉన్న భూగర్భ డ్రయినేజీ నిర్మించి చాలా కాలం అయినందున ప్రస్తుత జనాభాకు సరిపోవడం లేదని, మురుగు రోడ్లపై పారుతోందని కాలనీవాసులు చెప్పారు. కాలనీలోని ప్రధాన రోడ్డు మార్గాలు కూడా సరిగ్గా లేకపోవడంతో వర్షాలు పడిన ప్రతిసారీ ఇబ్బంది మారుతోందన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో కాలనీవాసులు తెలుపుతున్న సమస్యలన్నీటినీ పరిశీలించి ప్రణాళిక బద్ధంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నరసయ్య, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కైలాస్నాథ్, కోట రవీందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, చిన్నానరహరి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా

నవతెలంగాణ-పోచారం



పోచారం మున్సిపల్ పరిధిలోని ఇస్మాయిల్ ఖాన్ గుడా, యంనంపేటలలో ముస్లిం సోదరులకు రంజాన్ కానుకలను చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తోనే అన్ని వర్గాల ప్రజలకు తగిన న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వాటిని అర్హులం దరూ సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. మంత్రి మల్లారెడ్డి ఆదేశాల మేరకు రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్నామని, పోచారం మున్సిపాల్టీకి 300 కిట్లు వచ్చాయని తెలిపారు వైస్ చైర్మెన్ రేద్య నాయక్, కమిషనర్ సురేష్,కౌన్సిలర్ గోంగళ్ళ మహేష్, బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ వర్కింగ్ ప్రెసడెంట్ గోంగల్ల బలేష్, ప్రధాన కార్యదర్శి నల్ల వెల్లి శేఖర్, నాయకులు నర్రి కశయ్య, రాజేష్ గౌడ్,మీసాల రాజేష్, బొక్క బుచ్చి రెడ్డి, సగ్గు రవి,గండి పాల్లి శేఖర్, ముస్లిం సోదర సోదరీ మణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

ఘట్కేసర్ : బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొన్నాల కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా అవుషాపూర్ గ్రామంలోని మైనారిటీ కాలనీలో మంత్రి మల్లారెడ్డి, ప్రభుత్వం అందజేస్తున్న బట్టల పంపిణీ కార్యక్రమం జరిపారు. అనంతరం అవుషాపూర్ గ్రామంలోని షానూర్ బాబా దర్గాలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ పార్టీ నిర్వహించారు. ఉపసర్పంచ్ ఐలయ్య యాదవ్,జిల్లా రైతుబంధు సభ్యులు డొంకని బిక్షపతి గౌడ్,పన్నాల ప్రతాప్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి,మాజీ సర్పంచ్ రమేష్,వార్డు సభ్యులు బొడిగే శ్రీనివాస్ గౌడ్, కె.వీరేశం, కె.దయాకర్ రెడ్డి, కె.వెంకట్ రెడ్డి, కొట్టి మోహన్ రెడ్డి,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



యోగా శిక్షణ తరగతుల బ్రోచర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-చైతన్యపురి



షిరిడి సాయి అష్టాంగ యోగ శిక్షణ కార్యక్రమాల బ్రోచర్ ఆవిష్కరణను స్వధర్మయోగి శ్రీయోగిరత్న అవార్డు గ్రహీత శ్రీ ఇస్మాయిల్ గురుజీ, యోగ సాధకులు యోగా సెంటర్ నందు ఆవిష్కరించారు. ఈనెల 23న కర్మన్‌ఘాట్‌లోని లోటస్ ల్యాబ్ పాఠశాలలో ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. శరీరంలో వ్యాధి నిరోధక వ్యవస్థను పెంచుకోవడానికి ఈ యోగ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6-30 నుంచి 8-30 గంటల వరకు నడిచే ఈ శిక్షణలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యోగ శిక్షణలో వ్యాయామాలు, ప్రాణాయామాలు, ధ్యానము, సూర్యనమస్కారాలు, ఆసనాలు నేర్పిస్తామన్నారు.

టీడీపీ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి

- టీడీపీ గ్రేటర్ హైదరాబాద్ ఇన్‌చార్జ్ ఎం.అరవింద్ కుమార్
- ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీడీపీ హయాంలోనే హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని, దేశవిదేశాలల్లో మరింత ప్రతిష్టపెరిగిందని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, గ్రేటర్ హైదరాబాద్ ఇన్ చార్జ్ ఎం.అరవింద్ కుమార్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకను తెలుగుదేశం పార్టీ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొలిట్ బ్యూరో సభ్యులు, గ్రేటర్ హైదరాబాద్ ఇన్ చార్జ్ ఎం.అరవింద్ కుమార్ పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని జిల్లా పార్టీ శ్రేణుల మధ్య భారీ కేక్ కట్ చేశారు. అనంతరం అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ఎన్టీఆర్ సిద్ధాంతాలను, ఆశయాలను చంద్రబాబు నాయుడు కొనసాగిస్తూ విద్యా, వైద్య, రవాణా, వ్యవసాయం, సంక్షేమ, అభివద్ధి రంగాలలో పలు కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. పారిశ్రామికీకరణకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు దేశవిదేశాల నుంచి పెట్టుబడులను రాబట్టి, లక్షలాది యువత ఉపాధికి దోహదపడ్డారని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు విద్యను ఒక యజ్ఞంలా నిర్వహించారన్నారు. ఐటీని అభివద్ధి చేయడంలో, హైదరాబాద్ రూపురేఖలు మార్చడానికి చంద్రబాబు చేసిన కృషి ఎనలేనిదన్నారు. 1998లో మాదాపూర్‌లో హైటెక్ సిటీ (సైబరాబాద్) నిర్మాణం పూర్తిచేసిన చంద్రాబు దాని ప్రారంభోత్సవాన్ని అమెరికా అధ్యక్షులు బిల్‌క్లింటన్‌తో చేయించారని గుర్తు చేశారు. చంద్రబాబు హయాంలోనే ఐటీ పార్క్, సైబర్ టవర్, సేబర్ గేట్ వేతోపాటు బడా కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చాయన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. అనంతరం సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సాయిబాబా మాట్లాడారు. జాతీయ స్థాయిలో యునైటెడ్ ఫ్రంట్లను ఏర్పాటు చేసిన చంద్రబాబు జాతీయ స్థాయిలో కేంద్రప్రభుత్వానికి అనేక కీలక సూచనలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడేంట్ నల్లెల్ల కిషోర్, ప్రధానకార్యదర్శులు బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దోజు రవీంద్రాచారి, అన్నపూర్ణ, ఆర్.భాస్కర్, అశోక్‌తోపాటు రాహుల్ యాదవ్, మధు సూధన్, శశి రేఖ, మాగి యాదగిరి, వంశీకష్ణ, శైలేష్, రవిగౌడ్, శ్రీకాంత్ చారి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కళాత్మక ఆభరణాల తయారీలో విశిష్ట స్థానం పొందిన మలబార్ గోల్డ్

- ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త

నవతెలంగాణ -నాగోల్



మలబార్ గోల్డ్ లో ఆర్ట్ ష్టీ బ్రాండెడ్ జ్యువెలరీ షో ను గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారం భించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాత్మక ఆభరణాల తయారు లో మలబార్ గోల్డ్ విశిష్ట స్థానం ఉందని, ఈ షోలో మైన్ ధ్రువీకరించిన వజ్రాభర ణాలు,వివాహం, పార్టీ సంబరాల్లో ఎరా అన్కట్ వజ్రాలు, ఎత్నిక్ హస్తకళా నైపుణ్యంతో తయారైన ఆభరణాలు అందిస్తున్నదని అన్నారు.స్టోర్ హెడ్ రదీష్ కుమార్ మాట్లాడుతూ మలబార్ గోల్డ్ 30 ఏండ్ల వేడుకల్లో భాగంగా ప్రతీ ముప్పై వేల రూపాయలు కొనుగోలుతో వంద మిల్లీ గ్రాముల బంగారు నాణేనికి సమానమైన విలువను పొందవచ్చని అన్నారు. డైమండ్స్,జెమ్స్టోన్,పోల్కీ డిజైన్ ఆభరణాల కొనుగోలుపై 250 మిల్లీ గ్రాముల బంగారు నాణేనికి సమానమైన విలువ ను పొందవచ్చని, ఈ ఆఫర్ ఏప్రిల్ 30వరకు అందుబాటులో ఉంటుం దని తెలిపారు.మలబార్ గ్రూపు తమ వార్షిక ఆదాయంలో కొంత భాగం సామాజిక బాధ్యత గా ఆరోగ్యం, ఉచిత విద్య, నిరుపేదలకు గృహ నిర్మాణం, మహిళా సాధికారత, పర్యావరణ,రక్షణ విభాగంలో తమ వంతు సహాయం అందిస్తుందని, సింగపూర్, జీసీసీ, యుఎస్ఏ లాంటి దేశాల్లో 300కిపైగా షోరూమ్ లతో విస్తరించి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నాగరాజుల తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నూతన పరిశోధనలు చేయాలి

నవతెలంగాణ - ఘట్కేసర్



సామజిక అభివృద్ధికి దోహదపడే విధంగా పీహెచ్‌డీ విద్యార్థులు నూతన పరిశోధనలు చేయాలని అనురాగ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎస్. రామచంద్రం అన్నారు ఈ సందర్భంగా. ఘట్కేసర్ మండలం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం పీహెచ్‌డీ విద్యార్థుల ఓరియంటేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు వైస్ చాన్సలర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నూతన పీహెచ్‌డీ విద్యార్థులు విజయ అవకాశాలు అందిపుచ్చుకోడానికి అవసరమైన వనరులు, సహకారం అందిస్తూ మార్గదర్శకంగా యాజమాన్యం నిలు స్తుందని అన్నారు. విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపు చ్చుకోవాలన్నారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల పరిష్కారానికి మీ పరిశోధనలు మార్గనిర్దేశంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ మహిపతి శ్రీనివాస్ రావు, డీన్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డాక్టర్ ఎస్. సతీష్ కుమారన్, పీహెచ్‌డీ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేష్ తుమ్మ ఇతర డీన్స్, హెచ్ఓడిలు, రీసెర్చ్ స్కాలర్లు, తదితరులు పాల్గొన్నారు.



బిలాల్ మసీదులో ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-చైతన్యపురి

ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లోని బిలాల్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అరవింద శర్మ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రామాచారి, వెంకట్ రెడ్డి, సాజిద్, కొండ శ్రీనివాస్, గొడుగు శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్ ,దుబ్బాక శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మతాల పేరిట బీజేపీ రాజకీయం

- సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రాత్లావత్ శంకర్ నాయక్

నవతెలంగాణ- సంతోష్ నగర్



బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే మతాల పేరిట రాజకీయ తీవ్రమవుతుందని సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రాత్లావత్ శంకర్ నాయక్ అన్నారు. బీజేపీకి హటావో ..దేశ్ కో బచావో అంటూ 2వ రోజు సీపీఐ ఇంటింటి కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా రాత్లావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే మరింత పేదరికం పెరుగుతుందని, మతాల పేరిట రాజకీయం చేస్తుందని నిరుపేదల పరిస్థితి దారుణంగా ఉంటుందని అన్నారు. దేశంలో బీజేపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. మతాల పేరిట, కులాల పేరిట దళితులపై, మైనారిటీలపై అనేక దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ మహమూద్, సీపిఐ ఐ.ఎస్.సదన్ డివి జన్ కార్యదర్శి అమీన, రాజు, దశరథ్ నాయక్, సుజాత, రేష్మ, అంజి, ఫిరోజ్, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రయినేజీ అవుట్‌లెట్ సమస్య పరిష్కారానికి చర్యలు

- కార్పొరేటర్ జితేంద్రనాథ్



నవతెలంగాణ-నేరేడ్ మెట్

133 మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని లప్పం ఫ్యాక్టరీ సమీపంలోని ఎంఈఎస్ కాలనీలో నెలకొన్న డ్రయినేజీ అవుట్‌లెట్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ జితేంద్ర నాథ్ అన్నారు. గురువారం కాలనీ వాసులు, కార్పొరేటర్‌ను కలిసి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ కాలనీకి ఆనుకుని డిఫెన్స్ ల్యాండ్ ఉండటం వల్ల అవుట్‌లెట్‌ను మూసివేసి డ్రయినేజీ నీటిని విడుదల చేసేందుకు అనుమతించడం లేదన్నారు. ఈ సమస్యలను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ మహేశ్ , స్థానికులు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో గౌతంనగర్ ప్రజలు

- నందికంటి శ్రీధర్



నవతెలంగాణ-మల్కాజిగిరి

గౌతమ్‌నగార్ డివిజన్‌లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అయినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ఆరోపించారు. గురువారం హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా 141 (గౌతమ్ నగర్) డివిజన్‌లోని సత్యనారాయణ కాలనీలో గడప గడప తిరిగిన అనంతరం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవన్ రెడ్డి, ప్రవీణ్, యాదగిరి, మోహన్ యాదవ్, భరత్, షేక్, సాయి, దశరథ్, పూస శేఖర్, రామ్, శ్రీనివాస్, సతీష్, సీనియర్ నాయకులు పోల్కం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు ఆర్‌ఎక్స్‌పర్ట్ ఈ-క్లినిక్స్ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

- జనరల్ ఫీజీషియన్స్, రోగులను పట్టణాల్లో ఉన్న సూపర్ స్పెషాలిటీ వైద్యులతో అనుసంధానం
- సూపర్ స్పెషాలిటీ ఈ-క్లినిక్స్‌ను మరింత చేరువ చేస్తాం : లక్ష్మోజీ తేజోమూర్తులు



నవతెలంగాణ- బేగంపేట్

గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల్లో నివాసముండే ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవల కోసం కిలోమీటర్ల దూరం ప్రయా ణం, వ్యయ్య ప్రయాసలతో పాటు ఆర్థిక భారం వారికి పెను నవాలుగా మారుతోంది. ఈ పరిస్థితులను మార్చాలనే గొప్ప సంకల్పంతో ఆర్‌ఎక్స్‌పర్ట్ సూపర్ స్పెషాలిటీ ఈ-క్లినిక్స్ అనే ఆలో చనకు 2018లో బీజం వేసి ప్రస్తుతం తెలంగాణ, కర్నాటక రాష్ట్రా లలో ఈ సేవలను అందిస్తున్నట్టు మెడిబింట్ లైఫ్‌సైన్సెస్ ఫౌండర్ డైరెక్టర్ లక్ష్మోజీ తేజోమూర్తులు తెలిపారు.

చిన్న పట్టణాల్లో ఉన్న జనరల్ ఫీజీషియన్స్, వారి పేషెంట్లను వట్టణాల్లో ఉన్న సూపర్ స్పెషాలిటీ డాక్టర్స్‌తో అనుసంధానం చేసీ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవల్ని అందించడమే ముఖ్య ఉద్దేశ్యంగా "హబ్ అండ్ స్పోక్" మోడల్‌ను రూపొందించారు. హబ్ అంటే సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, స్పోక్ అంటే జనరల్ పీజీషియన్ ఇలా వీరిద్దర్ని ఒకే ప్లాట్‌ఫాం మీదకు తీసుకువచ్చి జనరల్ పీజీషియన్ వద్ద ఉన్న రోగికి పట్టణ ప్రయాణం అవసరం లేకుండా వైద్య సేవలను అందించే సాఫ్ట్‌వేర్ ను అభివద్ధి చేశారు. సాధారణంగా గ్రామాలలో చిన్న వట్టణాల్లో లభ్యమయ్యే వైద్య సౌకర్యాలకి ఒక పరిమితి ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులు లేదా ముదిరిన వ్యాధుల నివారణ కోసం ఆ పేషెంట్లకు సూవర్ స్పెషాలిటీ వైద్య సేవలు అవసరమవుతాయి. అటువంటి వరిస్థితుల్లో గ్రామాల్లో ఉన్న జనరల్ ఫీజీషియన్స్ ఆ రోగులను పట్టణంలో ఉన్న సూవర్ స్పెషాలిటీ డాక్టర్ల వద్దకు వంవుతారు. అయితే ఈ ప్రక్రియ శ్రమ, వ్యయంతో కూడుకున్నది. అటువంటి రోగులకి ఈ ఆర్‌ఎక్స్‌పర్ట్ సూపర్ స్పెషాలిటీ ఈ-క్లినిక్స్ ఎంతో నహాయ వడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న జనరల్ పేజీషియన్ క్లినిక్‌లలో ఆర్‌ఎక్స్‌పర్ట్ ఏర్పాటుపేసిన డిజిటల్ టెక్నాలజీ ద్వారా ఆ జనరల్ పిజీషియన్‌లు వట్టణాల్లో ఉన్న స్పెషలిస్ట్ డాక్టర్‌తో నేరుగా సంప్రదించటంతో తమ వద్ద ఉన్న రోగులకు ఎటువంటి ఉన్నత వైద్యం అవసరమౌతుందో తెలుసుకొని, ఆ స్పెషలిస్ట్ డాక్టర్ సలహా మేరకు తగిన వైద్యం అందిస్తారు. ఆర్‌ఎక్స్‌పర్ట్ సాఫ్ట్‌వేర్‌లో రోగికి సంబంధించిన మెడికల్ రికార్డ్స్ పొందుపరిచే సౌకర్యం, జనరల్ పిజీషియన్ కూడా స్వయంగా అంతవరకూ తాను చేసిన వైద్య వివరాలను స్వయంగా స్పెషలిస్ట్ డాక్టర్‌తో చెప్పగలిగే వెసులు బాటు ఉంటంది. దీని వల్ల స్పెషలిస్ట్ డాక్టర్ కు వ్యాధి పూర్వాపరాల అవగాహన కలగటంతో ఉన్నత చికిత్సకు దోహదపడుతుంది. పైగా స్పెషలిస్ట్ డాక్టర్ రోగిపై ఫీజికల్‌గా ఎగ్జామిన్ చేయవలసిన పరిస్థితులలో జనరల్ ఫిజీషియన్ ద్వారా చేయిస్తారు. ఇలా రోగిని సూపర్ స్పెషాలిటీ డాక్టరే స్వయంగా తనను ఎగ్జామిన్ చేసినట్లు భావన కలగడమే కాకుండా ఫ్యామిలీ డాక్టర్ సమక్షంలో తన ఊరినుంచే పొందే అవకాశం ఈ ఆర్‌ఎక్స్‌పర్ట్ సూపర్ స్పెషాలిటీ ఈ-క్లినిక్స్ ద్వారా దొరుకుతుంది.

ఈ ఆర్‌ఎక్స్‌పర్ట్ సూపర్ స్పెషాలిటీ ఈ-క్లినిక్స్ ఎలా పనిచేస్తాయి?

సూపర్ స్పెషాలిటీ వైద్యసేవల అవసరాన్ని గుర్తించిన జనరల్ ఫిజీషియన్ తన పేషంట్లను ఆర్‌ఎక్స్‌పర్ట్ సాఫ్ట్‌వేర్‌లో రిజిస్టర్ చేసుకొని అ పేషెంట్లకు తయారైన వ్యక్తిగత ఎలక్రానిక్ మెడికల్ రికార్డులో ప్రస్తుతం రోగి దగ్గర ఉన్న అన్ని మెడికల్ రికార్డులను పొందుపరుస్తారు. ఆ తరువాత ఏ స్పెషాలిటీ డాక్టర్ అవసరమో వారి అపాయింట్ మెంట్ కోసం రిక్వెస్ట్ పెడతారు. ఈ విధంగా అపాయింట్‌మెంట్ నమయానికి సూవర్ స్పెషాలిటీ డాక్టర్ ఒక వైవు నుంచి, జనరల్ ఫీజీషియన్, రోగి వేరొక వైవు నుంచి ఆర్‌ఎక్స్‌పర్ట్ సాఫ్ట్‌వేర్ ద్వారా అనునంధానమై వీడియో కాల్ ద్వారా నంభాషణ జరుపుతారు. ఈ మేరకు రోగికి అవనరమైన వైద్య నలహాలను నిర్ణయిస్తారు. ఒక వేళ ఏ విధమైన అపరేషన్ అవనం మైనచో రోగిని సూవర్ స్పెషలిస్ట్ డాక్టర్ తన వద్దకు రప్పించుకొని సరైన చికిత్సను అందజేస్తారు. ఆపరేషన్ అవనరం లేని వరిస్థితుల్లో రోగికి సరైన మందులను వైద్య సూచనలను ప్రెస్క్రిప్షన్ ద్వారా ఆర్‌ఎక్స్‌పర్ట్ సాఫ్ట్‌వేర్‌లో ఉన్న ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డులో ప్రవేశపెడతారు. రోగి వద్ద ఉన్న జనరల్ ఫిజీషియన్ ఈ ప్రెస్క్రిప్షన్ ప్రింట్ తీసి సరైన నలహాలతో రోగికి అందిస్తారు. ఈ రకంగా రోగికి నరైన సూవర్ స్పెషలిస్ట్‌వైద్య నలహాలు అందటమే కాక జనరల్ ఫీజీషియన్ సహాయం కూడా దొరుకుతుంది. ఈ రకంగా ఇవ్వటికే అనేక వేలమంది ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకొని శారీరక శ్రమ లేకుండా ఆరోగ్యాన్ని సకాలంలో కాపాడుకోగలిగారని లక్ష్మోజీ తేజోమూర్తులు తెలిపారు.

ఆర్‌ఎక్స్‌పర్ట్ సూపర్ స్పెషాలిటీ ఈ-క్లినిక్స్ కన్సల్టేషన్ వల్ల ప్రయోజనాలు..

గ్రామీణ ప్రాంతాల్లోని వారు వందల కిలోమీటర్లు ప్రయాణించి వట్టణాలకు వచ్చి చికిత్స చేయించుకుంటున్నారు. ఈ రకంగా వారు చేస్తున్న ఖర్చులో ఇంచు మించు 75 శాతం నాన్ మెడికల్ ఎక్స్‌పెన్సెస్‌గా అంటే ప్రయాణ, భోజన వనతి సౌకర్యాలపై వెచ్చిస్తున్నారు. ఇందులో కేవలం 25 శాతం మాత్రమే నిజమైన వైద్య అవసరాలకు ఖర్చుపెడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆర్ ఎక్స్‌పర్ట్ ఈ- క్లినిక్స్ ద్వారా అదనంగా అయ్యే అనవనరపు 75 శాతం ఖర్చును తగ్గించవచ్చని బిజినెస్ మేనేజర్ రవిచంద్ర తెలిపారు.

ఈ-కన్సల్టేషన్ అద్భుత అవకాశం - రాబోయే రోజుల్లో మరింత విస్తరిస్తాం..

ఈ-కన్సల్టేషన్లో ఉన్న సౌలభ్యంతో ఆర్‌ఎక్స్‌పర్ట్ సేవలను రాబోయే రోజుల్లో తెలంగాణలో 100 సెంటర్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నామని, ఇప్పటికే తెలంగాణలో, కర్నాటకలో ఆర్‌ఎక్స్‌పర్ట్ ఈ-క్లినిక్‌లను విజయవంతంగా నిర్వహిస్తున్నామని బిజినెస్ మేనేజర్ రవిచంద్ర తెలిపారు. రాబోయే డిజిటల్ ప్రపంచానికి తగ్గట్లుగా హబ్ అండ స్పోక్ సూవర్ స్పెషాలిటీ మోడల్ క్లినిక్‌ల సేవలను మారుమూల గ్రామీణ వట్టణాలకు సైతం విస్తరించాలన్నదమే తమ లక్ష్యమన్నారు. తెలంగాణలో ఇబ్రహింవట్నం, మంతన్, గౌరల్లి, చింతబట్ల,, ఎగ్రగండ్ల, రాంరెడ్డి వల్లి, నాంవపల్లి, మహేశ్వరం, గజ్వేల్, తూప్రాన్ వంటి ప్రాంతాల్లో, కర్నాటకాలో పది ప్రాంతాల్లో ఇప్పటికే ఆర్‌ఎక్స్‌పర్ట్ సూపర్ స్పెషాలిటీ ఈ-క్లినిక్స్ విజయవంతంగా నడపడం జరుగతోందన్నారు. దీని వల్ల అక్కడి ప్రజలు, జనరల్ పిజీషియన్స్ తమను అభినందించటమే కాకుండా పూర్తి సహకారాన్ని అందిస్తున్నారని ఆర్‌ఎక్స్‌పర్ట్ ఎక్సెకూటీవ్స్ శ్రీహర్ష, దిలీప్, కష్ణకాంత్ తెలిపారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో ఈ ఆర్‌ఎక్స్‌పర్ట్ సేవలను ప్రారంభిస్తామని, రాబోయే 2-3 నంవత్సరాల్లో దేశవ్యాప్తంగా ఈ సేవలను వ్యాప్తి చేయడమే తమ లక్ష్యమని వారు చెప్పారు. ఈ ఆర్‌ఎక్స్‌పర్ట్ నర్వీసులను వారి ఊళ్లలో ప్రారంభించాలనుకునే జనరల్ ఫీజీషియన్‌లు 7993328841/42 నెంబర్‌లలో నంప్రదించవచ్చని సంస్థ డైరెక్టర్ లక్ష్మోజీ తేజోమూర్తులు తెలిపారు.

సర్వమత సామరస్యానికి ప్రతీక తెలంగాణ

- హెూం మంత్రి మహమ్మద్ అలీ



నవతెలంగాణ-కాప్రా

సర్వమత సామరస్యానికి ప్రతీక తెలంగాణ అని హెూం శాఖ మంత్రి మహమ్మద్ అలీ అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలోని మసీదుల ప్రెసిడెంట్స్, ప్రధాన కార్యదర్శిలకు, మసీదు ఇమాం, మౌసమ్‌లకు మినిస్టర్స్ క్వార్టర్స్‌లో తోఫా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాలు అన్ని వర్గాల వారికి ప్రాధాన్యతలను కల్పిస్తూ.... మునుపెన్నడు ఎరగని విధంగా అన్ని పండుగలకు కానుకలు పంపిణీ చేయడం జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాయి జేన్ శేఖర్, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ ఉప్పల్ నియోజకవర్గ ప్రెసిడెంట్ బద్రుద్దీన్, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు కాటర్ల భాస్కర్, నేమూరి మహేష్ గౌడ్, ఇంద్రయ్య, గోలి శ్రీనివాస్, బేతాళ బాల్ రాజు, శేంకర్, మాస శేఖర్, జంగీర్,పాషా, పవన్, అంజీ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- మంత్రి కేటీఆర్‌కు బీఆర్ఎస్‌కేవీ కాప్రా సర్కిల్ అధ్యక్షులు జీ కురుమన్న వినతి

నవతెలంగాణ-నాచారం

జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్‌కేవీ కాప్రా సర్కిల్ అధ్యక్షులు జి కురుమన్న మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని పారిశుధ్య విభాగంలో అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులకు రూ.26000 వేతనాలు పెంచాలని వినతి పత్రం ద్వారా మంత్రి కేటీఆర్‌ను కోరారు. అలాగే కార్మికుల దినోత్సవం మే డే రోజున సెలవు దినంగా ప్రకటించాలని, కామన్ పండుగ సెలవులుతోపాటు మహాశివరాత్రి, జనవరి 26, అంబేద్కర్ జయంతి, గాంధీ జయంతిలకు సెలవులు ఇవ్వాలని, ఎమర్జెన్సీ సర్వీస్ అయినా పండగ సమయంలో ప్రధాన రోడ్లు, ఆలయాలు, మసీదులు, చర్చిల ముందు శుభ్రం చేసుకొని ఉదయం 9 గంటల వరకు ఇంటికి వెళ్లేందుకు బయోమెట్రిక్‌తో సంబంధం లేకుండా మధ్యాహ్నం హాజరు కల్పించాలన్నారు.

మతతత్వ పార్టీ నుంచి దేశాన్ని రక్షించుకుందాం...

- ఏఐసీటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర రాజేష్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ప్రజావ్యతిరేక నిరంకుశ మతోన్మాద బీజేపీ సాగనుంపి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఏఐసీటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర రాజేష్ అన్నారు. ఏఐసీటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కమిటీ జనరల్ బాడీ సమావేశం నాగారం మున్సిపాల్టీలోని ఏఐసీటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు తుడుం అనిల్ కుమార్ , ఉపాధ్యక్షులు బొద్ర మౌని పురుషోత్తం పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు ప్రజల జీవితాలతో చెలగాటమాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెంచుకుంటూ పోతూ పేద మధ్యతరగతి జీవితాలను దుర్భరం చేస్తున్నాయన్నారు. వేల కోట్ల ప్రజాధనాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా దోచిపెడుతున్నాయని, రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేయలేని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు రుణమాఫీ చేస్తున్నదని విమర్శించారు. పేదలకు సామాన్యులకు అండగా ఉండటం పోయి కంపెనీలను ధార దత్తం చేస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజలు మోడీ మద్దతు ప్రభుత్వాలను గద్దె దించడానికి కంకణం కట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏఐసీటీయూ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఈ బాలయ్య ఉపాధ్యక్షులుగా ఆర్ రామ్ చందర్ ,బీ వెంకటేశ్వర్లు, ఏ వరదరాజ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నాగరాజ్, సహాయ కార్యదర్శి ముద్దరి గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి, క్యాషియర్ టీ కష్ణ ,పీ రాజు, సలహాదారులు ,ఎస్ జైపాల్, రాజు యాదవ్, ఎం బాలయ్య సభ్యులుగా విశ్వనాథ్, కష్ణ ,ప్రకాష్, మాలాద్రి ,పెద్దకోటయ్య, శివలను నియమించారు

ఇంటి నుంచి బయటకు వెళ్ళిన తల్లి, కుమార్తె అదృశ్యం



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

ఇంటి నుంచి బయటకు వెళ్ళిన తల్లి, కుమార్తె ఇద్దరు అదృశ్యమైన సంఘటన నేరేడ్ మెట్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సాయినాథా పురం కు చెందిన పి. శ్రీవల్లి, మురళి భార్య భర్తలు. శ్రీవల్లి ప్రయివేటు ఉద్యోగిని. గత 8 నెలల నుంచి ఆమెకు భర్త మరళితో విభేదాలు ఉన్నప్పటికీ అతనితోనే ఉంటోంది. కాగా ఈ నెల 19వ తేదీన సాయంత్రం సుమా రు 6.50 గంటల సమయంలో ఆమె తన కూతురు వేదశ్రీ (11 నెలలు)తో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. తన భర్తతో అక్కడ ఉండటానికి ఆసక్తి లేదని చెప్పి వెళ్లిన ఆమె ఇంతవరకు ఇంటికి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వీలైన అన్ని చోట్లా వెతికినా ఫలితం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.నేరేడ్ మెట్ పోలీ సులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో యువతి..



జవహర్‌నగర్ : మరో ఘటనలో పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన యువతి అదశ్యమైంది. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం... దమ్మాయిగూడ పరిధిలోని న్యూ భవానీనగర్‌కు చెందిన బొంత రేణుక కుటుంబసభ్యులతో కలిసి నివసి స్తుంది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు కాగా 20 ఏండ్ల రెండో కుమార్తె బొంత శిరీష కుషాయిగూడలోని ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నది. బుధవారం పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్ళిన శిరీష తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకి కోసం చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు ఆమె తల్లి రేణుక పోలీస్టేషన్ లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రిని కలిసిన బొంతు రామ్మోహన్

నవతెలంగాణ-కాప్రా



సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదినం సందర్భంగా వారిని మినిస్టర్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గంధం నాగేశ్వరరావు , బోడ దిన్న పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు నిలయంగా తెలంగాణ

- మంత్రి కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్

నవతెలంగాణ-జవహర్‌నగర్

సంక్షేమ పథకాలకు నిలయంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు పోతుందని బీఆర్ఎస్‌తోనే పేద ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం లభించిందని కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ అన్నారు. గురువారం కార్పొరేషన్‌లోని 21వ డివిజన్ లో జీవో 58 ద్వారా మంజురైన పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వ రా ట్నా డ ఎ అ రా కార్పొరేషన్‌లోని ప్రభుత్వ స్థలాల్లో పేద ప్రజలు ఇండ్లు నిర్మించుకుని ఎలాంటి ఆధారం లేకుండా నివసిస్తుండేవారని, తెలంగాణ ప్రభుత్వం జీవో 58, 59 తీసుకువచ్చి పేదలకు శాశ్వతంగా పరిష్కా రం చూపిందన్నారు. 21వ డివిజన్‌లో సుమారు 350 పట్టాలు పంపిణీ చేశామ న్నారు. డివిజన్ ప్రజలు సీఎం కేసీఆర్, మంత్రి మల్లారెడ్డికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్, బీఆర్ఎస్ జవహర్ నగర్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగన్న బాలరాజ్, డివిజన్ అధ్యక్షుడు జక్కుల భాస్కర్, ఉపాధ్యక్షుడు నగేష్, నాయకులు చందు, కృష్ణ, గణేష్, వాహెబ్, రుక్కుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్ బోయిన్‌పల్లిని నెంబర్ వన్ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

- కార్పొరేటర్ నరసింహ యాదవ్



నవతెలంగాణ-కంటోన్మెంట్

పాదయాత్ర ద్వారా అనేక సమస్యలు పరిష్కారం పడుతున్నట్టు ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. గురువారం వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో కలిసి డివిజన్‌లోని వల్లభ నగర్‌లో ఆయన అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధే తన లక్ష్యమని, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఓల్డ్ బోయిన్ పల్లిని రాష్ట్రంలో నెంబర్ వన్ డివిజన్ గా తీర్చిదిద్దుతానని తెలిపారు. వివిధ కాలనీలలో స్థానికులు డ్రయినేజీ, కరెంటు పోల్స్, రోడ్లు, ట్రాన్స్ఫార్మర్ తదితర సమస్యలను కార్పొరేటర్ దష్టికి తీసుకువచ్చారు. వీటన్నిటిని అతి త్వరలో పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఏఈ అరవింద్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, జీహెచ్ఎంసీ సూపర్వైజర్ నవీన్, వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ తేజ, ప్రకాష్, సి.ఓ మైపాల్ రెడ్డి, ఏ.ఎస్పై, టి.పి.ఎస్. డిపార్ట్మెంట్ జస్వంత్, అర్బన్ డిపార్ట్మెంట్ నాగరాజు, స్వామి, శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కర్రే జంగయ్య, మన్నే ఉదయ్ యాదవ్, మల్లేష్ యాదవ్, బుర్రి యాదగిరి, చందు యాదవ్, మేకల ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన కార్మికుడికి సీఐటీయూ చొరవతో న్యాయం



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ పారిశ్రామిక వాడలోని ఏకశిలా కెమికల్ పరిశ్రమలు అమోనియా గ్యాస్ లీకై అస్వస్థకు గురైన కార్మికులకు సీఐటీయూ చొరవతో తక్షణ మెడికల్ సహాయం.. చట్ట ప్రకారం బెనిఫిట్స్ అందించేందుకు యాజమాన్యం అంగీకరించిట్టు సంఘం నాచారం ఏరియా కార్యదర్శి పీ గణేష్ తెలిపారు. కంపెనీలో పని చేస్తున్న క్రమంలో 400 కేజీల అమోనియా గ్యాస్ సిలిండర్ లీకేజీ అవుతున్నట్టు గమనించిన కార్మికుడు నాగభూషణ్ వెంటనే అప్రమత్తమై నియంత్రించే ప్రయత్నం చేయగా సాధ్యం కాలేదని సదరు కార్మికుడు అంజిరెడ్డి తెలిపాడు. వీరిద్దరూ కార్మికులు వయసు రిత్యా 60 ఏండ్లు పైనే ఉంటారు. అప్పటికే లీకైన అమోనియా గ్యాస్ కంపెనీ మొత్తం వ్యాపించడంతో కండ్ల మంటలు శ్వాస ఆడక ఇబ్బంది పడుతున్న క్రమంలో డ్రైవర్ శివప్రసాద్ చాకచక్యంగా వ్యవహరించి గ్యాస్ లీక్‌ను నియంత్రించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో 62 ఏండ్ల అంజిరెడ్డి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ కార్మిక సంఘం నాయకులు కంపెనీ యాజమాన్యంతో చర్చించి అస్వస్థకు గురైన కార్మికుడికి న్యాయం చేయాలని కోరగా ఏకశిలా కంపెనీ యజమాని రామారావు మానవతా దృక్పథంతో తక్షణం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50,000, చట్ట ప్రకారం కార్మికులకు రావలసిన బెనిఫిట్స్ ను ఈ నెల 30న రూ.5.5 లక్షల ఇచ్చేందుకు అంగీకరించారు. మల్లాపూర్ పారిశ్రామికవేత్తల అసోసియేషన్ సంఘటన స్థలానికి వచ్చి కార్మిక సంఘాల డిమాండ్ ను ఒప్పుకోవద్దని కంపెనీ యజమాన్యం పై ఒత్తిడి తెచ్చారు. ప్రస్తుతం పారిశ్రామికవేత్తల అసోసియేషన్ బాధిత కార్మికుడికి న్యాయం జరగకుండా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అనేక ఒత్తిళ్లు వచ్చినా ఏకశిలా కంపెనీ యాజమాన్యం మానవతా దృక్పథంతో కార్మికుడు పక్షాన నిలబడినందుకు సీఐటీయూ కార్మిక సంఘం తరవున కృతజ్ఞతలు తెలిపారు.

వేయి వత్సరాల క్రితం చారిత్రక కవి నన్నెచోడుడు



నవతెలంగాణ-కల్చరల్

వేయి వత్సరాల క్రితం చారిత్రక ప్రబంధ కవి నన్నెచోడుడును స్మరించుకోవటం తెలుగు భాషా ఔన్నత్యాన్ని గుర్తు చేసుకోవటమే నని రాష్ట్ర ఎస్.సి. కార్పొరేషన్ చైర్మెన్ బండ శ్రీనివాస్ అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణ లో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా నన్నెచోడుడు సంస్మరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ పాల్గొని సాహితీ ప్రియులైన ముఖ్యమంత్రి కే.సి.ఆర్ కు ఇటువంటి కవి పండితులను స్మరించుకోవటం ఇష్టమని ఆ దిశ గా గాన సభ చేస్తున్న కార్యక్రమాలు అభినంద నీయమన్నారు. ప్రముఖ గీత రచయిత డాక్టర్ వడ్డేపలి కృష్ణ కీలక ప్రసంగం చేస్తూ నన్నెచోడుడు పదకొండవ శతాబ్దికి చెందిన చోళ వంశం కు చెందిన వారని అన్నారు. రాజ రాజ శిఖామణి గా ఖ్యాతి చెందిన ఆయన కాళిదాసు కుమార సంభవం సంస్కృత కావ్యాన్ని తెలుగు లోకి అచ్చ తెలుగు పదాలతో అనువదించారని వివారించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై కవి తంగిరాల చక్రవర్తి, సూరి భగవంతం ట్రస్ట్ ఎస్.బి.రాం, గాయకుడు రామ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు

ఆరోగ్య సంరక్షణను విప్లవాత్మకరించనున్న ఇంటర్నేషనల్ పేషంట్స్ యూనియన్

నవతెలంగాణ-హైదరాబాద్

ఇంటర్నేషనల్ పేషంట్స్ యూనియన్ (ఐపీయూ) విజయవంతంగా భారతదేశంలో ఆరోగ్య సంరక్షణరంగాన్ని మార్చడంతో పాటుగా రోగులకు అత్యంత అందుబాటు ధరల్లో, నాణ్యమైన ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తుంది. ఐపీయూ వ్యవస్థాపకులు డాక్టర్ రాజేంద్ర ప్రతాప్ గుప్తా మాట్లాడుతూ... డాక్టర్లు, పరిశ్రమలు వ్యవస్థీకృతం అయినప్పటికీ, రోగులు మాత్రం ఇంకా అసంఘటితంగానే ఉన్నారన్నారు. ఐపీయూ సమాన అవకాశాలు కలిగిన క్షేత్రంగా నిలపడంతో పాటుగా ప్రొవైడర్ సెంట్రిక్ నుంచి ప్రొసీజర్ డ్రివెన్ హెల్త్కేర్ మార్చనున్నామన్నారు. నారాయణ హెల్త్ ఛైర్మన్ అండ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ దేవిశెట్టి మాట్లాడుతూ... ఇండియాతో పాటుగా ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అతిపెద్ద సమస్య ఏమిటంటే పన్ను చెల్లింపుదారుల సొమ్మును ప్రజలకు ఉచితంగా ఆరోగ్య సంరక్షణ పేరిట పంచడమన్నారు. ఈ విధానం కారణంగా నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ పరిమితంగా లభిస్తుందన్నారు. ఆరోగ్య భీమాలో సంస్కరణలు, ఐఆర్డీఏ ఐలో నిబంధనలు కారణంగా రాబోయే ఐదేళ్లలో నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ పరంగా మార్పులు వచ్చే అవకాశాలున్నాయన్నారు.

భారత్ లో సరికొత్త లెక్సస్ ఆర్ఎక్స్ ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్

లెక్సస్ ఇండియా భారతీయ మార్కెట్ కోసం సరికొత్త 5వ తరం లెక్సస్ ఆర్ఎక్స్ ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఆటో ఎక్స్ పో 2023లో తొలిసారిగా ఆవిష్కరించబడిన, సరికొత్త లెక్సస్ ఆర్ ఎక్స్ అనేక మొదటి సెగ్మెంట్ ఫీచర్లను కలిగి ఉంది. సరికొత్త లెక్సాస్ ఆర్ ఎక్స్ ప్రారంభ ధర రూ. 95.8 లక్షలు. ఈ సందర్భంగా లెక్సస్ ఇండియా ప్రెసిడెంట్ నవీన్ సోనీ మాట్లాడుతూ... లెక్సస్ ఇండియాలో తాము సరికొత్త లెక్సస్ ఆర్ఎక్స్ ధరలను ప్రకటించడం పట్ల థ్రిల్లా ఉన్నామన్నారు. దాని సెగ్మెంట్లో ఇది అత్యంత పోటీతత్వ ఎస్ యూవీగా నిలిచిందన్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో జరిగిన ఆటో ఎక్స్ పో లో తాము కొత్త ఆర్ ఎక్స్ ని ఆవిష్కరించినప్పటి నుండి, లగ్జరీ ఎస్ యూవీకి అద్భుతమైన స్పందన లభించిందన్నారు. బుకింగ్ ఆర్డర్లు తమ అంచనాలను మించిపోయాయన్నారు.

ఎయిర్‌పోర్ట్ మెట్రోకు ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌ల ఎంపిక

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎయిర్‌పోర్ట్ మెట్రోకు జనరల్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌గా సీస్ట్రా, రైట్స్, డీబీ ఇంజనీరింగ్ సంస్థల కన్సార్షియంను ఎంపిక చేసినట్టు హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీస్ట్రా కన్సార్షియం నేతృత్వంలోని ఈ ఇంజనీరింగ్ సలహా సంస్థ వెంటనే తన పనిని ప్రారంభిస్తుందని, త్వరలోనే ఎయిర్ పోర్ట్ మెట్రో నిర్మాణానికి అవసరమైన ఈపీసీ (ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) టెండర్ డాక్యుమెంట్లను తయారు చేస్తుందని చెప్పారు. కాగా ఈ కన్సార్షియంలోని మూడు సంస్థలు ప్రజా రవాణారంగంలో ముఖ్యంగా మెట్రో రైళ్ల నిర్వహణలో విశేష అనుభవం గల సంస్థలుగా సీస్ట్రా సంస్థ-ఫ్రాన్స్, ఆర్ఐటీఈఎస్-భారతీయ రైల్వేలు, డీబీ-జర్మనీ దేశాలలకు చెందిన ఇంజనీరింగ్ దిగ్గజాలుగా ప్రఖ్యాతిగాంచాయి.

సీస్ట్రా నేతృత్వంలోని కన్సార్షియం.. రూ. 98 కోట్ల కోట్

జనరల్ కన్సల్టెంట్ ఎంపిక కోసం మొత్తం అయిదు అంతర్జాతీయ కన్సార్షియంలు పోటీపడగా.. సీస్ట్రా నేతృత్వంలోని కన్సార్టియం విజేతగా నిలిచింది. ఈ కన్సార్టియం సాంకేతికంగా అత్యధిక మార్కులు పొందడంతో పాటు, ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ సేవలను అందించేందుకుగాను రూ.98.54 కోట్లు కోట్ చేసినట్టు హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీ ఎస్ రెడ్డి వివరించారు. మెట్రో రైల్వేలోని పలు విభాగాలలో నిష్ణాతులైన 18మంది ఇంజనీరింగ్ నిపుణులతో పాటు క్షేత్ర స్థాయిలో మరో 70 మంది సీనియర్ ఇంజనీర్లు, తదితర సిబ్బందిని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో నిర్మాణంలో ఈ కన్సార్టియం సమకూర్చుతుందని, తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఆర్థిక శాఖ ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి కె.రామకృష్ణా రావు, మెట్రో పాలిటన్, హెచ్ఎండీఏ కమిషనర్ అరవింద్ కుమార్, హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు.

ఎండల ఎఫెక్ట్.. మెట్రోకు జనం క్యూ..



నగరంలో ఎండలు మండిపోతుండడంతో అనేకమంది మెట్రో బాట పడుతున్నారు. ఫలితంగా మెట్రో రైళ్లు, మెట్రో రైల్వే స్టేషన్లలో ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పీక్‌అవర్స్ ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 10గంటల సమయంలో దాదాపు లక్షన్నర మంది మెట్రోలో ప్రయాణిస్తున్నట్టు అధికారుల అంచనా వేస్తున్నట్టు తెలిసింది. మిగతా సమయాల్లో 6 నిమిషాలకు ఒక ట్రెన్ నడుపుతుండగా.. పీక్ అవర్స్‌లో ప్రతీ 3 నిమిషాలకు ఓ ట్రెన్ నడుపుతున్నట్టు చెప్తున్నారు. గురువారం అన్ని మెట్రో స్టేషన్లలో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు. ముఖ్యంగా నాగోలు, రాయదుర్గం మార్గంలోని రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో నిండిపో యాయి. నాగోలు మెట్రో స్టేషన్‌కు ప్రయాణికులు భారీగా తరలిరావడంతో స్టేషన్ మొత్తం ప్రయాణికులతో నిండిపోం యింది. మంత్రి కేటీఆర్ గారూ ఓసారి మా కష్టాలు చూడండని ప్రయాణికులు వేడుకుంటున్నారు. అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో నెలకొన్న పరిస్థితిని లోకేంద్ర సింగ్ అనే ఓ ప్రయాణికుడు మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా వివరిం చారు. కనీసం అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్ స్క్రీన్ డోర్స్ ఏర్పాటు చేయాలని ఆయన మంత్రిని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి ఎలా స్పందిస్తారో వేచిచూడాలి. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో ప్రయాణించే వారి సంఖ్య 4లక్షలకు పైగా దాటినట్టు తెలుస్తోంది.

మైనార్టీ వర్గాల సంక్షేమానికి కృషి



నవతెలంగాణ-అంబర్‌పేట

మైనార్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గురువారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఎమ్మెలే ఆధ్వర్యంలో క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-అంబర్‌పేట

పార్కుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత అన్నారు. గురువారం నల్లకుంట డివిజన్ పరిధిలోని శివం రోడ్డు లింగాలగడ్డ పరిసర ప్రాంతాల్లో ఎలిమినేషన్ ఆఫ్ జీవీపీ ప్రోగ్రాం ఇన్ 100 డేస్ కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ స్థానిక నాయకులతో కలిసి లింగాల గడ్డ పరిసర ప్రాంతాలు లింగాలగడ్డ పార్క్ పరిసర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాలగడ్డ పార్కులోని చెత్తాచెదారాన్ని తొలగించి, స్థానికుల సూచనల ప్రకారం టెక్నికల్ అసిస్టెంట్ అధికారులకు వెంటనే చెట్టు కొమ్మలను తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ రమణ నాయుడు, స్థానిక నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

జుమాత్-ఉల్-విద (శుక్రవారం) ప్రార్థనల నేపథ్యంలో నేడు హైదరాబాద్ నగరంలోని మక్కా మసీదు, సికింద్రాబాద్ పరిధిలోని జామియా మసీదు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు ట్రాఫిక్ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. రాజేశ్ మెడికల్ హాల్, శాలిబండ మధ్య వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్టు తెలిపారు.

ట్రాఫిక్ ఇలా..

- నయాపూల్ నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలను మదీనా జంక్షన్ నుంచి సిటీ కాలేజీ వైపునకు మళ్లిస్తారు. శాలిబండ నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలను హిమ్మత్‌పురా జంక్షన్ వద్ద హరి బౌలి, వోల్గా హెటల్ టీ జంక్షన్ మీదుగా మళ్లించనున్నారు.



- కోట్ల అలిజా నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలను చౌక్ మైదాన్ ఖాన్ వద్ద హఫీజ్ డంకా మసీదు, అమన్ హెటల్ వైపు మళ్లించనున్నారు. మూసాబౌలి నుంచి చార్మినార్ వచ్చే వాహనాలను మోతిగల్లి వద్ద ఖిల్వాత్ గ్రౌండ్, రాజేశ్ మెడికల్ హాల్, ఫతే మైదాన్ రోడ్డు మీదుగా మళ్లించనున్నారు.

సికింద్రాబాద్ పరిధిలో..

సుభాష్ రోడ్, మహంకాళి పీఎస్, రామ్‌గోపాల్ పేట్ రోడ్ జంక్షన్ ఎంజీ రోడ్డును ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మూసివేయనున్నారు. రోచా బజార్ నుంచి రాణిగంజ్ వైపు ట్రాఫిక్‌కు అనుమతిస్తారు. బాటా క్రాస్ రోడ్స్ నుంచి సుభాష్ రోడ్డు వైపు వచ్చే వాహనాలను మహంకాళి పీఎస్ వద్ద లాలా టెంపుల్ వైపు మళ్లిస్తారు.

అవగాహనతోపాటు ఆచరణ ముఖ్యం



నవతెలంగాణ-బంజారాహిల్స్

అవగాహనతో పాటు ఆచరణ అతి ముఖ్యమైనదనీ, ఆచరణతో చేస్తేనే నివారణ సాధ్యమవుతుందని అగ్నిమాపక రాష్ట్ర ఫైర్ సేఫ్టీ డీజీ నాగిరెడ్డి అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణ హెటల్‌లో ఈనెల 14 నుంచి 20 వరకు జరిగే అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని, ప్రత్యేకంగా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంభవించిన తర్వాత కాపాడే విధానం, ఎలాంటి అగ్ని ప్రమాదానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే విషయాల గురించి వివరించారు. హెంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగే సమయంలో వెంటనే అక్కడ ఉన్న అగ్గిమాపక పరికరాలతో మంటలను అదుపులోకి తీసుకరావడానికి ప్రయ త్నం చేయాలన్నారు. ప్రతి దుకాణదారు డూ అగ్ని నియంత్రణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలలని సూచించారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇచ్చి వారి సహాయంతో ఘటనా స్థలానికి వెళ్ళాలని తెలిపారు. అగ్నిమాపక డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లా డుతూ హెటల్స్‌లో అగ్గిమాపక అవగాహనా సదస్సు ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం ఇటీవల కాలంలో అత్యధికంగా హెటల్స్, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎలా స్పందించాలి అనే విష యాలపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. అగ్నిమాపక అధికారి పాపయ్య మాట్లాడుతూ ప్రమాదం జరిగిన సమ యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 900 అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో, జీవీ నారాయణ, పంజాగుట్ట ఫైర్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సికింద్రాబాద్ సైడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



నవతెలంగాణ-బంజారాహిల్స్

నిమ్స్‌లో నాలుగో రోజు కాంట్రాక్ట్ కార్మికుల నిరసన కొనసాగింది. గురువారం నిరసన కార్యక్రమానికి సీఐటీయూ హైదరాబాద్ సిటీ నగర కోశాధికారి ఆర్ వాణి మద్దతు తెలిపారు. కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. మీరు ఇచ్చిన వాగ్దానాన్ని మీరే ఎలా విస్మరిస్తారని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. గతంలో జరిగిన చర్చల్లో నిమ్స్ కాంటాక్ట్ కార్మికులకు రూ.2100 వేతనం పెంచుతూ నిర్ణయం తీసుకున్న మేనేజ్‌మెంట్ అండ్ కాంట్రాక్టర్ ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే పెంచిన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎం.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఈ నరసింహ, నాయకులు మహిళలు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : నగర డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-ఓయూ



జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. 6-16 వయసు గల పిల్లలను తల్లిదండ్రులు వేసవి శిబిరాలలో చేర్పించి ఆటలలో శిక్షణ ఇప్పించాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని జోన్లలో కలిపి మొత్తం 915 శిబిరాలు, ప్లేగ్రౌండ్స్‌లో నైపుణ్యం కలిగిన కోచ్‌లు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ శిక్షణ శిబిరాలు ఈ నెల 25వ తేదీ నుంచీ మే 31వ తేదీ వరకు 37 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు ఆరోగ్యం చేకూరుతుందని, అందువల్ల తల్లిదండ్రులు పిల్లలను వేసవి శిబిరాల్లో చేర్చాలని సూచించారు. జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ విభాగ అధికారులు స్పోర్ట్స్ మెటీరియల్‌ను సంబంధిత డివిజన్ కార్పొరేటర్ల చేతుల మీదుగా వేసవి క్రీడా శిబిరం నిర్వాహకులు, కోచ్‌లకు అందజేయాలని సూచించారు. అలాగే కార్పొరేటర్లు అందరూ తమతమ డివిజన్లో శిక్షణ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.

దిశా సంకేతాలనిచ్చే సిగ్నల్ లైట్స్ చాలా ముఖ్యం

- బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

దిశా సంకేతాలనిచ్చే వాహన దీపాలు (సిగ్నల్ లైట్స్) చాలా ముఖ్యమని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు విద్యార్థులకు సూచించారు. బేగంపేట్ టీటీఐ స్టాఫ్, ఎస్ఐలు సీహెచ్.జ్యోతి, చక్రధర్, వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్‌లోని రిషి పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, మైనర్ డ్రైవింగ్, స్టాప్ లైన్, రాంగ్ రూట్, ట్రిబల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ లైట్స్ వంటి తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలనీ, రోడ్డుపై నడిచేటప్పుడు దృష్టి, మనస్సు పూర్తిగా రోడ్డుపైనే కేంద్రీకరించాలని సూచించారు. రహదారులపై క్రమశిక్షణగా వ్యవహరించి, వాహనాలు నడిపేవారు ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలనీ, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలనీ, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలనీ, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం చాలా ప్రమాదకరమని సూచించారు. ఈ కార్యక్రమంలో 100 మంది స్కూల్ విద్యార్థులు, సిబ్బంది, స్కూల్ ఫౌండర్ సుబ్రమణ్యం, సెక్రెటరీ పద్మ చందర్, ప్రిన్సిపాల్ కవిత, నారాయణ్, తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ ఆర్టీఏ ఆఫీస్‌కు హీరో రవితేజ

నవతెలంగాణ-సిటీబ్యూరో



టాలీవుడ్ హీరో రవితేజ గురువారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో సందడి చేశారు. తన వ్యక్తిగత నూతన వాహనం బీవైడీ అట్టో-3 ఎలక్ట్రిక్ కారు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఆయనను ఖైరతాబాద్ ఆర్టీవో ఎల్.రాంచందర్ స్వాగతం పలికారు. అనంతరం హీరో రవితేజ కొత్త వాహనం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆర్టీవో రాంచందర్ నిబంధనలకు మేరకు పూర్తి చేశారు. రూ.34.49లక్షల విలువైన ఈ ఎలక్ట్రిక్ కారు కోసం హీరో రవితేజ టీఎస్09జీబీ 2628 అనే ఫ్యాన్సీ నంబర్‌ను రూ.17,628 కు ఈ వేలంలో సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ శ్రీనుబాబు, సీనియర్ అసిస్టెంట్ కార్తీక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు మెదక్ లోకసభ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి తన డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ కోసం రావడంతో ఆ మేరకు ఆర్టీవో రాంచందర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయన అక్కడి నిర్దేశిత ఫార్మాట్‌లో దరఖాస్తును నింపి అధికారులకు అందజేశారు.

బర్కేడియ దిశా-ఖార్డ్ పాఠశాల భవన నిర్మాణం పూర్తి

నవతెలంగాణ-అంబర్‌పేట



ఖార్డ్ సోషల్ ఇంపాక్ట్ ఆర్గనైజేషన్ పేద పిల్లల కోసం విద్యావకాశాలను మరింత చేరువ చేసేందుకు దిశా-ఖార్డ్ పాఠశాల శాశ్వత భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. అత్యాధునిక వసతులతో నిర్మించిన ఈ పాఠశాల భవనాన్ని ముఖ్య అతిథిగా హాజరైన బర్కేడియ, సీఈఓ శ్రీ జస్టిన్ వీలర్ ప్రారంభించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బర్కేడియ సీఆర్ఈ సర్వీసెస్, ప్రెసిడెంట్, మార్క్ మెక్‌కూల్ బర్కేడియ ఇండియా, మేనేజింగ్ డైరెక్టర్, సుదీప్తో ముఖర్జీ, కేపీహెచ్‌బీ కాలనీ, వార్డు నెం. 114, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, ఖార్డ్ ఫౌండర్, ప్రెసిడెంట్ సుమన్ సి.మల్లాది, ఖార్డ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మంజులత మల్లాది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బర్కేడియ, సీఈఓ జస్టిన్ వీలర్ మాట్లాడుతూ కూకట్‌పల్లిలో పట్టణ పేద పిల్లలకు విద్యను అందించాలనే లక్ష్యంతో దిశా-ఖార్డ్ స్కూల్ ప్రాజెక్ట్ 2015లో ప్రారంభించినట్టు తెలిపారు. కూకట్‌పల్లిలోని గోపాల్ నగర్‌లో పట్టణ నిరుపేద పిల్లల కోసం బర్కేడియ శాశ్వత పాఠశాల భవనాన్ని నిర్మాణాన్ని నిర్మించింది. పట్టణ పేదలకు చెందిన పిల్లలకు నాణ్యతతో కూడిన ఉన్నతమైన విద్యను అందించడానికి, డిజిటల్ విద్య నూతన శకానికి నాంది పలికేందుకు ఈ పాఠశాల కట్టుబడి ఉందని ఆయన అన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ దీని పక్కనే ఉన్న నాలాకు రూ.12 కోట్లు మంజూరు చేయించామనీ, ఆ పనులు మరో నెల లోపల ప్రారంభం అవుతాయని తెలిపారు. సుమన్ దంపతులు శేర్ లింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గంలో 7400 మంది మహిళా కుటుంబాలకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించారని తెలిపారు. చదివించలేని తల్లితండ్రుల కోసం, చదువుకోలేని పిల్లల కోసం ఖార్డ్ సంస్థ ద్వారా 500 మంది విద్యార్థులకు స్కూల్‌ను కట్టించారు. పిల్లలందరూ బాగా చదుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. మరిన్ని మంచి కార్యక్రమాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసే ప్రదర్శనలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్, జి.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మహిళల కోసం) స్టూడెంట్ క్లబ్ (యువ)యంగ్ ఇన్నోవేషన్ ఛాలెంజ్, ఐడియాథాన్ పోటీ" కార్యక్రమాన్ని నిర్వహించింది. క్లబ్‌లో ఆరుగురు ఫ్యాకల్టీ కోఆర్డినేటర్‌లతోపాటు 20 మంది విద్యార్థులు సహా మొత్తం 125 మంది భాగస్వాములుగా ఉన్నారు. ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లోని సృజనాత్మకను వెలికి తీసేందుకు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం, సీఎంఆర్ఈటీ, వాలసీ, వీఎన్ఆర్ వీజేఐఈటీ వంటి వివిధ కళాశాలల విద్యార్థులు వారి సలహాదారులతో కలిసి పాల్గొన్నారు. మొత్తం 20 జట్లలో 10 జట్లు షార్ట్ లిస్ట్ చేయగా, విజేతలకు 20 వేలు, 10వేల నగదు బహుమతిగా అందజేశారు.

సైనికుల మరణాలపై బీజేపీ నీచ రాజకీయాలు



- ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్

నవతెలంగాణ-అడిక్‌మెట్

సైనికుల వీరమరణాలు, త్యాగాలను బీజేపీ నీచ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం దుర్మార్గం అని ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. జమ్మూ కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ వ్యాఖ్యల ఆధారంగా పుల్వామా ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ జరపాలని విజ్ఞప్తి చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్, మిలిటరీ యుద్ధ ట్యాంక్ వద్ద గురువారం ప్లకార్డులు చేతబూని ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. మాలిక్ ఆరోపణలను పునరుద్ఘాటిస్తూ, 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు తన వ్యక్తిగత ఇమేజ్‌ను కాపాడుకునేందుకు ప్రధాని మోడీ ఈ ఘటనను అణచివేసినట్టు స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. ఉగ్రవాదుల ప్రాభల్యమున్న పుల్వామాలో సి.ఆర్ పి.ఎఫ్ దళాలు రోడ్డు మార్గంలో వెళ్లే పరిస్థితి లేదని, విమానాలు పంపమని సి.ఆర్ పి.ఎఫ్ కమాండెంట్లు, రాష్ట్ర గవర్నర్ కేంద్ర హెంమ్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరినా కేంద్ర ప్రభుత్వం స్పందించక మౌనంగా ఉండిపోవడం వల్లే 40 మంది సైనికులు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మన వీర సైనికుల రక్తం, త్యాగం మోడీ ప్రభుత్వానికి, బీజేపీకి రాజకీయంగా ఓట్లు సంపాదించే సాధనంగా మారిందన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలో విధి నిర్వహణలో అమరులైన జవాన్ల సంఖ్య వంద శాతం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేసారు. బీజేపీ కుళ్ళ రాజకీయాలు, కుట్రలు, కుతంత్రాలు ఆమ్ ఆద్మీ పార్టీ పసిగట్టి, దేశాన్ని రక్షించుకోవడానికి "మోడీ హటావ్-దేశ్ బచావ్" పిలుపునిచ్చిందని, వచ్చే లోక్ సభ ఎన్నికల్లో నిరంకుశ మోడీ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాములు గౌడ్ మాట్లాడుతూ.. పుల్వామా దాడిపై బీజేపీ ప్రభుత్వం బాధ్యత వహించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. బీజేపీ అనైతిక రాజకీయ క్రీడల వల్ల భరతమాత శోకిస్తున్నదని, న్యాయ దేవత ఘోషిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ ప్రదర్శనలో ఆప్ నేతలు జావేద్ షరీఫ్, పరీక్షణ్ రాజ్, కొడంగల్ శ్రీనివాస్, దర్శనం రమేష్, జానీ, దుర్గయ్య, పవర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలో అగ్ని ప్రమాదం

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ మండల పరిధిలోని ఎల్లం పేట గ్రామంలోని ఆర్కే డిష్టలరీస్ పరిశ్ర మలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ప్రాణ నష్టం, పరిశ్రమలో పని చేసే కార్మికులు, సిబ్బందికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఘటనా స్థలాన్ని మేడ్చల్ జోన్ ఏసీపీ వెంకటరెడ్డి, సీఐ రాజశేఖర్ రెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించారు. సమాచారం అందుకున్న అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ సత్తిష్ ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి జిల్లా అగ్నిమాపక శాఖ ఫైర్ సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

ఇంటింటికీ సీపీఐ ప్రచారానికి విశేష స్పందన

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్


నవతెలంగాణ-ఓయూ



"మోడీ హటావో దేశ్ బచావో" నినాదంతో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని ఆ పార్టీ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్ అన్నారు. మోడీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గురువారం బౌద్ధ నగర్ డివిజన్ పరిధిలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. ఈసారి మోడీ పతనం తప్పదని ప్రజలంతా హెచ్చరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ.. 'అచ్చేదిన్ ఆగయా' అంటూ అధికారంలోకి వచ్చిన మోడీ నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలు ఆకాశానికి ఎత్తి సామాన్య ప్రజలకు సచ్చేదిన్ రోజులు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరలు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజా ఆగ్రహనికి మోడీ గురిగాక తప్పదని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తూట్లు పొడుస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో దేశాన్ని రక్షించటం కోసమే సీపీఐ ప్రచార ఆందోళన కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి , బౌద్ధ నగర్ డివిజన్ కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్, తార్నాక డివిజన్ కార్యదర్శి లతీఫ్, లక్ష్మణ్, సయ్యద్ షకిల్, కళ్యాణ్, మాధవులు, తదితరులు పాల్గొన్నారు.

'మెడికవర్ హాస్పిటల్స్ ఈ-కన్సల్ట్' ప్రారంభం

నవతెలంగాణ-అంబర్‌పేట



మెడికవర్ హాస్పిటల్స్ ఈ-హెల్త్, ఈ-కన్సల్టేషన్, డీజీ హెల్త్ సర్వీసెస్‌ను ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించటం కోసం ఈ సర్వీసెస్‌ను ప్రారంభించింది. ఈ సేవలను మెడికవర్ హాస్పిటల్స్ డైరెక్టర్ అఫ్ క్లినికల్ సర్వీసెస్ అండ్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. 'మెడికవర్ హాస్పిటల్స్ ఆరోగ్య సంరక్షణ సాంకేతికత శక్తిని ఉపయోగించుకోవడం ద్వారా రోగులు ఇప్పుడు వారి ఇళ్లలో లేదా ఎక్కడి నుండైనా ఇ-ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా మెరుగైన చికిత్సను పొందవచ్చు. తద్వారా వారికీ ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, అనుభవజ్ఞులైన డాక్టర్స్ సేవలను సౌకర్యవంతంగా ఉపయోగించుకోవచ్చు. మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు, వత్తిడి వల్ల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. సరైన సమయంలో సరైన వైద్యం అందక చాలా మరణాలు సంభవిస్తున్నాయి. తక్కువ ఖర్చుత్వరగా కోలుకునేవాళ్ళు కూడా సరైన వైద్యం, సరైన స్పెషాలిటీ డాక్టర్స్‌కి చూపించుకోలేకపోవడం, చెప్పేవాళ్ళు లేకపోవడం వల్ల సరైన సమయంలో వైద్యం అందలేకపోతున్నారు. ఈ అవాంతరాలు అన్నింటిని అధిగమించి మెరుగైన సేవలను వారి వద్దకే అందించటానికి మెడికవర్ హాస్పిటల్స్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రత్యేక సంరక్షణను పొందడంలో గతంలో సవాళ్లను ఎదుర్కొన్న మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు సత్వర వైద్య సేవలను అందించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది' అని తెలిపారు. చీఫ్ అఫ్ బిజినెస్ మహేష్ దెగ్లూర్కర్ మాట్లాడుతూ 'ఈ-కన్సల్టేషన్ నెట్‌వర్క్ కింద హాస్పిటల్స్, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, మెడికల్ రూమ్‌లు, గేటెడ్ కమ్యూనిటీల ప్రాంగణాల్లో స్పోక్ సెంటర్లు ఉంటాయి. శిక్షణ పొందిన వైద్య/పారామెడికల్ సిబ్బందితో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలి అనే లక్ష్యంతో ప్రాంభించినట్టు' తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సతీష్ కైలాసం, డాక్టర్ శ్రీనివాస్ జూలూరి, డాక్టర్ కమల్ కిరణ్, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ బాలాజీ, డాక్టర్ కృష్ణ కిరణ్, డాక్టర్ ప్రతాప్ వర్మ, సెంటర్ హెడ్ మాత ప్రసాద్ పాల్గొన్నారు.

న్యూజిలాండ్, భారత్ విద్యా సంబంధాలు మరింత బలోపేతం

నవతెలంగాణ-హైదరాబాద్

ఈ ఏడాది జరిగిన ఇండియా-న్యూజిలాండ్ ఎడ్యుకేషన్ వీక్ అనంతరం రెండు దేశాల మధ్య విద్యా సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. వారం పాటు జరిగే కార్యక్రమాల్లో న్యూజిలాండ్, భారతీయ సంస్థలు, విద్యావేత్తల మధ్య వరుస ఎంగేజ్మెంట్లు కొనసాగనున్నాయి. ఈ సందర్భంలో ఎడ్యుకేషన్ న్యూజిలాండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్, గ్రాంట్ మెక్ఫెర్సన్ మాట్లాడుతూ... న్యూజిలాండ్ విద్యా విధానం భవిష్యత్తును దృష్టి ఉంచుకుని రూపొందించగా, బహుళ సాంస్కృతికంతో, విద్యార్థులు డిగ్రీలు అందుకున్న వెంటనే ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకునేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. సహకారం, మార్పిడి, విద్యార్థుల చలనశీలతకు న్యూజిలాండ్ కు ప్రాధాన్యత కలిగిన భాగస్వామి దేశాలలో భారతదేశం ఒకటన్నారు. న్యూజిలాండ్ ఎక్సలెన్స్ అవార్డు స్కాలర్షిప్ ప్రారంభం విద్యా భాగస్వామిగా భారతదేశం పట్ల తమ నిబద్ధతను ప్రదర్శిస్తున్నందుకు తాము సంతోషిస్తున్నామని పేర్కొన్నారు. ఐఐటి ఢిల్లీ ప్రతినిధి, ప్రొఫెసర్ జేమ్స్ గోమ్స్, డీన్ ఇంటర్నేషనల్ దీని గురించి మరింత వివరిస్తూ... న్యూజిలాండ్ సెంటర్ అంతర్జాతీయాకరణను స్వీకరించేందుకు ఐఐటి ఢిల్లీ ప్రయత్నాలను కలిగి ఉందన్నారు. కొత్త పరిశోధనలకు సహకారాన్ని, తమ విద్యార్థులు ప్రపంచంలో చక్కని అవకాశాలను దక్కించుకునేందుకు మార్గదర్శనం చేస్తుందన్నారు.

బీసీల అభివృద్ధికి బడ్జెట్ పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య
- కేంద్ర మంత్రితో బీసీ సంక్షేమ సంఘం నేతల చర్చలు



నవతెలంగాణ-అడిక్‌మెట్

కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రెండు లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.1400 కోట్లే కేటాయించి తీవ్రంగా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన మండల్ కమిషన్ బీసీ అభివృద్ధికి 40 సిఫార్సులు చేస్తే అందులో ఆర్థికాభివృద్ధికి 16 సిఫార్సులు చేశారన్నారు. కానీ ఇంతవరకు ఒక్క సిఫార్సు కూడా అమలు చేయలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు విద్యా ఉద్యోగ రంగాలలో 27 శాతం రిజర్వేషన్లు పెట్టారు వీటికి అనుబంధంగా ఆర్థికపరమైన రాయితీలు స్కాలర్ షిప్‌లు, ఫీజు మంజూరు, హాస్టల్స్, గురుకుల పాఠశాలలు, నవోదయ పాఠశాలలు, మంజూరుకు బడ్జెట్ కేటాయించడం లేదన్నారు. ప్రత్యేక హాస్టళ్ళు, విద్యా సంస్థలు లేకపోతే బీసీలు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. పరిశ్రమలు రావడం, యాంత్రీకరణ చెందడం మూలంగా కులవృత్తులు - చేతి వృత్తులు దెబ్బతిన్నాయన్నారు. వీరికి ఆర్థికంగా చేయూతనిచ్చి ప్రతి కుటుంబానికీ 10 లక్షల నుంచి 50 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ చర్చలలో బీసీ సంక్షేమ సంఘ కతీయ కన్వీనర్ గుజ్జు కృష్ణ, భూపేష్ సాగర్, మల్లేష్ యాదవ్, కె.రాము, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏరియల్ తాజా ప్రచారం సీ ద సైన్స్, షేర్ ద లోడ్

నవతెలంగాణ-హైదరాబాద్

ఇంటి పనులు సమానంగా పంచుకోవా లంటూ ఇటీవలనే సీ ద సైన్స్, షేర్ ద లోడ్ అంటూ ప్రచార చిత్రాలను వెలుగులోకి తీసుకువచ్చింది ఏరియల్. ఈ ప్రచార చిత్రం గురించి పీ అండ్ ఇండియన్ సబ్ కాంటినెంట్, వైస్ ప్రెసిడెంట్ ఫ్యాబ్రిక్ కేర్, పీ అండ్ జీ ఇండియా ఆఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శరత్ వర్మ మాట్లాడుతూ... ఈ ఏడాది ప్రచారాన్ని తమ అధ్యయనాల ఆధారంగా తీర్చిదిద్దామన్నారు. దాదాపు 81 శాతం మంది మహిళలు ఇంటి పనుల భారం తమ బంధంపై ప్రభావం చూపుతుందని భావిస్తున్నారన్నారు. అంతేకాకుండా తమ బంధం దూరం కావడానికీ అది ఒక కారణంగా వెల్లడిస్తున్నారన్నారు. బీబీడీఓ ఇండియా ఆఫ్ క్రియేటివ్ ఆఫీసర్, ఛైర్మన్ జోసీపాల్ మాట్లాడుతూ... ఈ తాజా ఎడిషన్ షేర్ ద లోడ్ ప్రచారం ద్వారా కుటుంబంలో కలహాలు తగ్గుతాయని తెలిపారు. ఇంటి పనుల విభజన సమానంగా జరగకపోవడం వల్ల మానసికంగా బంధానికి చాలా జంటలు దూరమవుతున్నాయన్నారు.

29న ఇన్నర్ పీస్ కు ఆతిథ్యమివ్వనున్న ఆర్ఎస్ఎం

నవతెలంగాణ-హైదరాబాద్

విజయవంతమైన ఇన్నర్ పీస్ కు దగ్గరలో, ఒక మార్గదర్శక ధ్యాన సదస్సును ఈ నెలారంభంలో నిర్వహించిన రామాశ్రమ్ సత్సంగ్ మథుర ఇంక్ (ఆర్ఎస్ఎం ఇంక్) ఇప్పుడు హైదరాబాద్ లో ఈనెల 29న ఇన్నర్ పీస్, గైడెడ్ మెడిటేషన్ సదస్సును నిర్వహించనుంది.

ముస్లింలకు నిత్యావసర వస్తువులు పంపిణీ

నవతెలంగాణ-మేడ్చల్



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మత సామరస్యం వెల్లివిరిసిందని మాజీ ఎంపీపీ పద్మాజగన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో గురువారం రంజాన్ పండుగను పురస్కరించుకుని మాజీ ఎంపీపీ దంపతులను 53 మంది ముస్లిం కుటుంబాలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. బియ్యం, పప్పు, చక్కెర తదితర నిత్యావసరాలతో కూడి కిట్లను అందజేశారు. వాటితోపాటు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని మతాలకు సమాన ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ప్రభుత్వ హయాంలో దసరాతోపాటు రంజాన్, క్రిస్మస్ పండుగలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటమ్మ, వార్డు సభ్యులు గణేష్ యాదవ్, సుదర్శన్ రెడ్డి, మీనారాము, జ్యోతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాబు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫాలు పంపిణీ

నవతెలంగాణ-మేడ్చల్



ముస్లింలను రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన రంజాన్ తోఫాను గురువారం మేడ్చల్ మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ తుడుం గణేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో కుల, మత అనే బేధాల్లేకుండా పాలలన కొనసాగిస్తున్నారని తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా వారికి ప్రభుత్వం తరపున రంజాన్ గిఫ్ట్ లను అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల ఐక్యతను చాటి చెప్పే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగలను నిర్వహిస్తున్న విషయం విదితమే అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అవగాహనా సదస్సులో బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి



సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం సైబరాబాద్ కమిషనరేట్ బాలానగర్ జోన్ పరిధి, కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో సైబర్ నేరాలపై అవినాష్ కాలేజ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీప శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. అతి తక్కువ ధరకు వస్తువులు ఆన్‌లైన్‌లో విక్రయిస్తామని, డబ్బులు గుంజి మోసాలకు పాల్పడే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితిల్లోనూ బ్యాంకులకు సంబంధించిన వివరాలను ఇతరులకు తెలియజేయవద్దన్నారు. సోషల్ మీడియాలో ఉన్న వారితో, ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి ఆప్‌లలో యువతీ, యువకులు, మహిళలు ఎవ్వరైనా సరే వ్యక్తిగత వివరాలు ఇతరులకు తెలిసేలా పోస్ట్ చేయొద్దని సూచించారు. అపరిచితులు చేసే మేసేజ్‌లకు దూరం ఉండాలని, మనకు సంబంధం లేని వారు పంపే లింక్‌లను ఓపెన్ చేసి మోసపోవద్దు అని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సీనియర్ మేనేజర్ భానుమూర్తి, కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, సిఐ నర్సింగ్‌రావు, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్ఐలు శంకర్, రామకృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజల దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. హమాలీ కార్మికుల ఆధ్వర్యంలో జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం లోడింగ్, అన్‌లోడింగ్ (బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ జీడిమెట్ల) వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పారిశ్రామిక వాడలో హమాలీ కార్మికులుగా పనిచేస్తూ చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. పనితోపాటు సేవా కార్యక్రమాలు చేయాలని, సమాజంలో జరుగుతున్న నేరాల నియంత్రణకు ప్రతి పౌరుడూ పాటుపడాలని సూచించారు. రోడ్డు మీద వెళ్లేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలని, మద్యం తాగి వాహనాలను నడపకూడదన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా హెల్మెట్ ధరించి, లైసెన్స్ దగ్గర పెట్టుకోవాలని చెప్పారు. ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఐ(ఎం) మండల కార్యదర్శులు ఉమామహేష్, కీలుకాని లక్ష్మణ్, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు స్వామి, దేవదానం, హరినాథ్, అంజయ్య సుంకిరెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు జీవో 58 అమలు చేయొద్దు



- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ మండలంలోని సర్వే నంబర్ 329, 326, 342, 307, 181, 79 & 348/1లోని ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలకు జీవో 58 అమలు చేయొద్దని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు. ఆ నిర్మాణాలను గత కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగిస్తామని చెప్పి, తొలగించకపోవడం వల్ల కబ్జాదారులు మరింత రెచ్చిపోయి ఉన్న భూమిని మాయం చేస్తున్నారని, వెంటనే ఆక్రమాలను తొలగించాలని గురువారం సీపీఐ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవ్‌రావుకి వినతిపత్రం అందజేశారు. కబ్జాదారులు తప్పుడు పత్రాలను సృష్టించి జీవో నెంబర్ 58 కింద దరఖాస్తు చేసుకుంటున్నారని, పై సర్వే నెంబర్లలో చేసుకున్న వారికి పట్టాలు ఇవ్వొద్దని కోరారు. అదేవిధంగా పరికి చెరువు, పాక్‌సాగర్‌తో పాటు పలు కుంటలను మట్టితో పూడ్చి నిర్మాణాలు చేస్తున్నారని, ఆ చెరువులను రక్షించి భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్, మండల నాయకులు హరినాథ్‌రావు, సదానంద్ పాల్గొన్నారు.

ఇంట్లో మృతదేహం

నవతెలంగాణ-బాలానగర్

ఒంటరిగా ఉంటున్న ఓ వ్యక్తి ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనపై సీఐ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. వినాయకనగర్‌కు చెందిన షేక్ ఖాజా సులేమాన్(45) ఎనిమిదేండ్ల కిందట భార్యతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటున్నాడు. ఐదేండ్ల కిందట బ్రెయిన్ ట్యూమర్ రావడంతో అప్పట్లో శస్త్ర చికిత్స కూడా చేయించుకున్నాడు. అప్పటి నుంచి అనారోగ్య సమస్యతో బాధపడుతున్న అతను ఏ పనీ చేయలేక ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు సమీపంలో ఉండే సులేమాన్ అన్నకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే వచ్చి ఇంటి తలుపులు తీసి లోపలికెళ్లారు. సులేమాన్ మృతదేహం దుర్వాసన వస్తోంది. మృతిచెంది మూడు రోజులై ఉంటుందని పోలీసులు గుర్తించారు. శరీరంపై ఎలాంటి దుస్తులు లేవు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట/కుత్బుల్లాపూర్



రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 41 మందికి గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద రూ.18,63,000/- చెక్కులను చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పేదలకు కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా సహాయం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు

నవతెలంగాణ-దుండిగల్



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు గురువారం శంభీపూర్‌లోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పబ్లిక్ కాంటాక్ట్

నవతెలంగాణ-బాలానగర్



ప్రజలు, ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయంతో కాలనీలలో ఉన్న సమస్యలకు తక్షణ పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రారంభించిన పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమం ఉపయోగపడుతుందని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. గురువారం గౌతంనగర్ కాలనీలో పబ్లిక్ కాంటాక్ట్ ఏర్పాటు చేశారు. కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారులు కాలనీవాసులతో ముఖాముఖి చర్చించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సిల్ట్ సరిగా తీయకపోయడంతో వర్షపు నీరు ఇండ్లల్లోకి వస్తోందని చెప్పారు. కుక్కల వల్ల కాలనీలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని, రోడ్డుపై వాహనాల పార్కింగ్ వల్ల రాకపోకలకు ఇబ్బందులెదురవుతున్నాయని, వీధిదీపాలు వెలగడం లేదని, భూగర్భ డ్రైనేజీ లైన్స్ వేయాలని స్థానికులు కోరారు. ఈ కర్యక్రమంలో ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఏఈ పవన్ రెడ్డి, జలమండలి అధికారి అనిల్ కుమార్, ఎలక్ట్రీషియన్ ఖాజా, ట్రాఫిక్ ఎస్ఐ రాజేష్, బాలానగర్ జోన్ ఎస్ఐ మక్బూల్ పాషా, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులు కంచి బిక్షపతి, దత్తారావు, నసీర్, ఎల్లయ్య గౌడ్, విశ్వనాథం, జావేద్, భాగయ్య, సలావుద్దీన్, నాషు, శశి, ఈశ్వర్, బస్వరాజు, నర్సింగ్‌రావు, రాములు, బాలయ్య, బాలమణి, రహీమ, సుగుణమ్మ, మల్లిక్, సాయినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పటేల్‌కుంట అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా కృషి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని పటేల్‌కుంట పార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తామని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, హెచ్ఎండీఏ అధికారులతో మాట్లాడతామన్నారు. పటేల్‌కుంట పార్క్‌లో కోటి 80 లక్షల రూపాయలతో జరుగుతున్న పనులను గురువారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, శాసనసభ్యులు అరికెపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లి.. వారిని హెచ్ఎండిఏ అధికారులతో మాట్లాడించి వీలైనంత తొందరగా నాణ్యతతో కూడిన పనులను పూర్తి చేసే విధంగా కృషి చేస్తానన్నారు.



చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

టీఎస్ఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సీనియర్ నాయకుడు, కూకట్‌పల్లి డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి శ్రీరామోజు శివకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు 73వ జన్మదినం సందర్భంగా కూకట్‌పల్లి దీనబంధు కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు టీడీపీ కూకట్‌పల్లి, వివేకానందనగర్ డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించామని శివకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలు మళ్లీ తెలుగుదేశం వైపు చూస్తున్నారని, పార్టీ అధికారం చేజిక్కించుకోవడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వివేకానందానగర్ అధ్యక్షుడు పాతూరి వెంకట్రావు, కూకట్‌పల్లి అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, చేవెళ్ల పార్లమెంట్ నాయకుడు ఎస్.ఎస్ రాజు, రాంబాబు, యాదగిరి, రాము, భీమ్, టీఎస్ఎస్ఎఫ్ చేవెళ్ల పార్లమెంట్ నాయకులు సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి యాత్రలో 49వ రోజు ఎమ్మెల్యే కేపీ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ 130 డివిజన్ పరిధిలో "ప్రగతి యాత్ర"లో భాగంగా 49వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పర్యటించారు. వెంకటాద్రి నగర్ శ్రీరామ లేఔట్, వాసు లే ఔట్, కృష్ణారావు లే ఔట్, సుభాష్ నగర్ లాస్ట్ బస్ స్టాప్‌లలో పాదయాత్ర చేస్తూ ప్రజలతో మాట్లాడారు. భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, ఎస్ఎన్‌డిపి నాలా నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. హిందూ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ కృష్ణ చైతన్య, డీఈఈ పాపమ్మ, నరేందర్, ఏఈలు రామారావు, సురేందర్ నాయక్, మేనేజర్ రాజు, మాజీ కౌన్సిలర్ రంగారావు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు కడప శేషు, భాస్కర్ రెడ్డి, సాయి, ఇస్మాయిల్, మహిళా నాయకులు పద్మజారెడ్డి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సుంకే రామన్‌కు దళితరత్న అవార్డు



- అవార్డును అందజేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ-బాలానగర్

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రతిష్టాత్మక దళితరత్న అవార్డుకు బాలానగర్ డివిజన్ పరిధిలోని సుంకే రామన్ కుమార్ ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో దళితరత్న పురస్కారాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ భారతి, ఉత్సవ కమిటీ చైర్మెన్ జంగా శ్రీనివాస్, తెలంగాణ స్టేట్ మాల మహానాడు ఫౌండర్ ప్రెసిడెంట్ కె.గిరేందర్ మాల, దుబ్బాక నవీన్ మాల, తెలంగాణ స్టేట్ మాల మహానాడు స్టేట్ జనరల్ సెక్రటరీ చేతుల మీదుగా రమాన్ అందుకున్నారు. ఈ సందర్భంగా రామన్ కుమార్ మాట్లాడుతూ.. దళితరత్న అవార్డు తమ బాధ్యతను మరింతగా పెంచిందన్నారు. సేవా కార్యక్రమాల్లో భవిష్యత్తులో మరింత ముందడుగు వేసి ప్రజలకు వీలైనంత సేవలను అందిస్తానని అన్నారు. తనకు అవార్డు ఇచ్చన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేతన్, శ్రీకాంత్, కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

శ్రీభవాని భవన నిర్మాణ సంఘం నూతన కమిటీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి డివిజన్ ఏఐటీయూసీ అనుసంధానం, శ్రీభవాని భవన నిర్మాణ సంఘం నూతన కమిటీని గురువారం ఆస్బెస్టాస్ కాలనీలోని కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. వీర నాగప్ప, బుల్లెట్ రాజు, ఎం.డి.యూసుఫ్ ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కమిటీ ముందుంటుందని తెలిపారు. అధ్యక్షుడిగా పి.బాలాజీ, ఉపాధ్యక్షులుగా వీరబోయిన నర్సింహ, ఎస్.మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎమ్.డి.యూసుఫ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కె.కాశిం, ఎస్.శ్రీనుమేస్త్రీ, కోశాధికారిగా యు.ఆరోగ్యం, సహాయ కార్యదర్శిగా ఆగంరెడ్డి నియమితులయ్యారు.

సాకీర్, శ్రీనులకు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి పరామర్శ

నవతెలంగాణ-దుండిగల్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రాజీవ్ గృహకల్ప 33 వ వార్డులో నివాసముంటున్న సాకీర్ ఆరోగ్య పరిస్థితి బాగోలేక బాధపడుతున్న విషయం తెలుసుకుని గురువారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించిన రాష్ట్ర సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి. అదే కాలనీలోని మరొక అభిమాని శ్రీను ఆరోగ్యం కూడా బాగాలేదని తెలుసుకుని వారిని కూడా పరామర్శించారు. ఈ సందర్భంగా ఇరువురికి తనవంతు సహాయ సహకారాలు అంద చేస్తానని తెలిపారు. ఆర్జీకేలో ప్రజలు పలు సమస్యలను విన్నవిస్తూ కాలనీవాసులు ఇది వరకు సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాన్ని సమర్పించారు. అందుకు గాను కాలనీ మొత్తం పర్యటించారు. రోడ్లు, డ్రైనేజీ, కరెంట్ స్థంబాలు, నీళ్ల సమస్యల పరిష్కారం కోసం అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సూపర్వైజర్ లిమెందర్‌కి తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కెఎస్ఆర్ టోపీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో 33వ వార్డు పెసిడెంట్ అరిగే ముత్యాలు, లిమెందర్, నర్సింహ,చంద్రయ్య సుదర్శన్, సుధాకర్ పలువురు మహిళలు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీయూ మేడే పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మేడ్చల్



రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి చేతుల మీదుగా బీఆర్‌టీయూ మే డే పోస్టర్‌ను మంత్రి నివాసంలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు వేముల మారయ్య, మేడ్చల్ మున్సిపల్ ఆటో యూనియన్ అధ్యక్షులు ఎర్ర విజయ్ రావు, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, బీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం : మాజీ ఎమ్మెల్యే



- దుర్గామాత ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ- జగద్గిరిగుట్ట

పేదల ఆకలి తీర్చడం కోసం దాతలు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం అన్నారు. జగద్గిరి గుట్ట డివిజన్ జగద్గిరి నగర్‌లోని శ్రీ దుర్గామాత ఆలయ ప్రాంగణంలో శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కూన శ్రీశైలం గౌడ్ హాజరై అమ్మ వారిని దర్శించుకొని, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసవి సేవా సమితి సభ్యులు శ్రీశైలం గౌడ్‌ని ఘనంగా సత్కరించారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని, అమ్మ వారి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి సేవా సమితి చైర్మెన్ ఉప్పల రమేష్ గుప్త, బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు జేకే శేఖర్ యాదవ్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు పున్నా రెడ్డి, బీజేపీ నేతలు మేకల సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని కార్పొరేటర్ రావుల శేషగిరి అధికారులకు తెలిపారు. ఈ మేరకు గురువారం చంద్రగిరినగర్ ప్రాంతంలో మంచినీటి సమస్యపై జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. వేసవి కాలంలో ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడకుండా చూస్తామని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి నవాబ్ పాషా, గీత, ముస్తఫా, జునేద్ తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం



మాళవిక నాయర్, సంతోష్ శోభన్

గల గల ఏరులా..

నందిని రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'అన్నీ మంచి శకునములే'. 'సినిమాలోని మొదటి రెండు పాటలకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. గురువారం 'గల గల ఏరులా..' అంటూ సాగే మూడవ పాటని విడుదల చేశారు. మిక్కీ జే మేయర్ తనదైన శైలిలో శ్రోతలని మెస్మరైజ్ చేసే నెంబర్‌ని కంపోజ్ చేశారు. విభిన్న వాయిద్యాలతో పాటని చాలా రిచ్‌గా ఆర్కెస్ట్రేషన్ చేశారు. రెహ్మాన్ లిరిక్స్ రాశారు. నకుల్ అభ్యంకర్, రమ్య భట్ అభ్యంకర్ గానం మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. ఇటలీలోని కొన్ని అందమైన లొకేషన్లలో ఈ పాటను చాలా ప్లజెంట్‌గా చిత్రీకరించారు. సంతోష్ శోభన్, మాళవిక నాయర్ జంట కెమిస్ట్రీ చూడముచ్చటగా ఉంది. కొరియోగ్రఫీ చక్కగా ఉంది' అని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రం మే 18న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



సంపత్ రాజ్, హెబ్బా పటేల్, కార్తీక్ రత్నం

థ్రిల్ చేసే వ్యవస్థ

థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో కట్టి పడేసే కోర్టు రూమ్ డ్రామాతో రూపొందిన సిరీస్ 'వ్యవస్థ'. జీ 5లో ఈనెల 28 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్న ఈ సిరీస్‌ను 'ఓయ్' ఫేమ్ ఆనంద్ రంగ తెరకెక్కించారు. ఇంతకు ముందు ఆయన జీ 5లో వచ్చిన 'షూట్ ఔట్ ఎట్ అలేర్' సిరీస్‌ను తెరకెక్కించారు. కార్తీక్ రత్నం, సంపత్ రాజ్, హెబ్బా పటేల్, కామ్నా జెఠ్మలానీ ఇందులో ప్రధాన పాత్రధారులు. ఈ వెబ్ సిరీస్ ట్రైలర్‌ను హీరో సిద్ధు జొన్నలగడ్డ చేతుల మీదుగా జీ 5 గురువారం విడుదల చేసింది.

అందులో ఈ రోజు న్యాయం రేపటి క్రైమ్ అయితే నేటి క్రైమ్ రేపటి చట్టం అవుతుంది అని ఓ లా కోర్సు ట్రైనర్ తన స్టూడెంట్స్‌కు చెప్పటంతో ట్రైలర్ స్టార్ట్ అవుతుంది. సంపత్ రాజ్ ఇందులో చక్రవర్తి అనే చాలా పవర్‌ఫుల్ పాత్రధారిగా, యువ నటుడు కార్తీక్ రత్నం ఇందులో కొన్ని నియమ నిబంధనలకు లోబడి పని చేసే మంచి మనసున్న జూనియర్ లాయర్ వంశీగా, యామినిగా హెబ్బా పటేల్, గాయత్రి అనే పాత్రలో కామ్నా జెఠ్మలానీ కనిపించనున్నారు.



ప్రియాంక మోహన్

తొలిసారి పవర్ స్టార్ సరసన..

యువ కథానాయిక ప్రియాంక మోహన్ అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. అగ్ర కథానాయకుడు పవన్‌కళ్యాణ్‌తో స్క్రీన్ షేర్ చేసుకోనుంది. ఈ లక్కీ ఛాన్స్ ఆమెకు దర్శకుడు సుజీత్‌తో డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్న 'ఓజీ' సినిమా ద్వారా లభించింది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమా మొదటి షెడ్యూల్ ఈనెల 15న ముంబైలో ప్రారంభమైంది. పవన్ కళ్యాణ్ ఈ వారం ప్రారంభంలోనే ఈ సినిమా సెట్స్‌లో అడుగుపెట్టి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. అభిమానుల ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ, తాజాగా మేకర్స్ ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. 'డాక్టర్', 'డాన్', 'గ్యాంగ్ లీడర్', 'శ్రీకారం' వంటి చిత్రాల్లో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రియాంక మోహన్ ఈ సినిమాలో కథానాయికగా ఎంపికైంది. ఈ నటి సోషల్ మీడియాలో విపరీతమైన అభిమానుల ఫాలోయింగ్‌ను కలిగి ఉంది.

ఆమె తన రూపం, శైలితో ప్రేక్షకులకు ఎంతగానో దగ్గరైంది. పవన్ కళ్యాణ్, ప్రియాంక మోహన్ జంటను తెరపై చూడాలని సినీ ప్రియులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూసున్నారు.ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ సినిమా మొదటి షెడ్యూల్ ముంబై, పరిసర ప్రాంతాలలో జరుగుతోంది. ఈ నెలాఖరు వరకు జరగనున్న ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై యాక్షన్ సన్నివేశాలతో పాటు పలు కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దర్శకుడు సుజీత్ ఎక్కడా రాజీపడకుండా అద్భుతమైన యాక్షన్ చిత్రాన్ని అందించడానికి కృషి చేస్తున్నారు.

కలియుగ భగవాన్



'కలియుగ భగవాన్' చిత్రంలోని ఒక దృశ్యం

అటు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను, ఇటు మానవీయ విలువలను ప్రతిబింబించే విధంగా రూపొందించిన సినిమా 'కలియుగ భగవాన్'. అల్లు ప్రొడక్షన్ బ్యానర్ పై అల్లు శ్రీరాములు నాయుడు నిర్మించిన ఈ సినిమాకు కథ, మాటలు, దర్శకత్వం డా.కోరుకొండ గోపీకృష్ణ. 'అద్భుతమైన కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా అన్నివర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది. ఐ.బ్రహ్మానంద రెడ్డి, సత్యప్రకాశ్, సామ్ దీరా, పావని, పెంటారావు అద్భుతంగా నటించారు. పాటలన్ని అద్భుతమైన సంగీతం, సాహిత్యంతో మెప్పిస్తాయి' అని దర్శకులు గోపీకృష్ణ చెప్పారు. నేడు (శుక్రవారం) ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాకు సంగీతం: ఎం.ఎల్.రాజా, పాటలు: డా. తిరునగరి శరత్ చంద్ర, డా.కోరుకొండ గోపీకృష్ణ, మాటలు: డా.కోరుకొండ గోపీకృష్ణ, విల్లురి జగ్గ అప్పారావు, కో ప్రొడ్యూసర్స్ : మేడిది ఈశ్వర్ రావు, రాంబాబు ముక్కి, ఎడిటింగ్ :శ్యామ్ కుమార్.పి, డి.ఓ.పి. సంతోష్, కొరియోగ్రఫీ:కిరణ్ వారియర్.



యశ్‌చోప్రా సతీమణి కన్నుమూత



యశ్ చోప్రా, పమేలా చోప్రా

ప్రముఖ దర్శక, నిర్మాత దివంగత యశ్ చోప్రా భార్య నిర్మాత, గాయని పమేలా చోప్రా (74) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను 15 రోజుల క్రితం ముంబై లీలావతి ఆస్పత్రిలో చేర్చారు. న్యూమోనియాతో బాధపడుతున్న పమేలా చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. పమేలా భర్త, ప్రముఖ నిర్మాత యశ్‌చోప్రా 2012లో మరణించిన సంగతి తెలిసిందే. ఆమె పెద్ద కుమారుడు ఆదిత్య చోప్రా దర్శక, నిర్మాతగా, మరో కుమారుడు ఉదయ్ చోప్రా నటుడిగా బాలీవుడ్‌లో రాణిస్తున్నారు. పమేలా చోప్రా 1970లో యశ్ చోప్రాను వివాహం చేసుకున్నారు. ఎన్నో హిట్ సినిమాల్లో పాటలు పాడి గాయనిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కథా రచయితగా, గాయనిగా, కాస్ట్యూమ్స్ డిజైనర్‌గానే కాకుండా యశ్ రాజ్ సంస్థలో పలు చిత్రాలకు సహ నిర్మాతగా వ్యవహరించారు. అలాగే నిర్మాతగా కొన్ని సినిమాలనూ నిర్మించారు. యశ్ చోప్రా దర్శక, నిర్మాతగా రూపొందిన 'దిల్ తో పాగల్ హై', 'కబీ కబీ' చిత్రాలకు పమేలా రచయితగా పనిచేశారు. పమేలా మృతి పట్ల పలువురు బాలీవుడ్ సినీ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ఆటలు



మహ్మద్ సిరాజ్ (4/21) నిప్పులు చెరగటంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ముచ్చటగా మూడో విజయం నమోదు చేసింది. ఛేదనలో పంజాబ్ కింగ్స్ ఎదురుదాడి మంత్ర రివర్స్ పంచ్ ఇవ్వగా.. ఆ జట్టు 24 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. కెప్టెన్ డుప్లెసిస్ (84), విరాట్ కోహ్లి (59) అర్థ సెంచరీల మోత మోగించటంతో తొలుత రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 174 పరుగులు చేసింది. పంజాబ్ కింగ్స్‌కు సీజన్లో ఇది మూడో పరాజయం.

సిరాజ్ సూపర్

- 4 వికెట్లతో చెలరేగిన సిరాజ్
- డుప్లెసిస్, కోహ్లి అర్థ సెంచరీలు

పంజాబ్‌పై బెంగళూర్ విజయం

నవతెలంగాణ-మొహాలి

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మురిసింది. సీజన్ తొలి మ్యాచ్‌లో విజయం అనంతరం గాడి తప్పిన బెంగళూర్.. పంజాబ్ కింగ్స్‌పై సాధికారిక విజయం నమోదు చేసింది. పేసర్ మహ్మద్ సిరాజ్ (4/21), స్పిన్నర్ వానిందు హసరంగ (2/39) మాయతో బెంగళూర్ 24 పరుగుల తేడాతో గెలుపొందింది. ఛేదనలో ఓపెనర్, ఇంపాక్ట్ ఆటగాడు ప్రభుసిమ్రన్ సింగ్ (46, 30 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), లోయర్ ఆర్డర్ బ్యాటర్ జితేశ్ శర్మ (41, 27 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ దూకుడుతో చెలరేగినా.. వరుస వికెట్ల పతనం పంజాబ్ కింగ్స్ ఓటమిని శాసించింది. 18.2 ఓవర్లలో 150 పరుగులకే పంజాబ్ కింగ్స్ కుప్పకూలింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 174 పరుగులు చేసింది. ఓపెనర్లు డుప్లెసిస్ (84, 56 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (59, 47 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీలు నమోదు చేశారు. బెంగళూర్ పేసర్ మహ్మద్ సిరాజ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. ఐపీఎల్16లో బెంగళూర్‌కు ఆరు మ్యాచుల్లో ఇది మూడో విజయం కాగా.. పంజాబ్‌కు సైతం ఆరు మ్యాచుల్లో ఇది మూడో ఓటమి.

వికటించిన ఎదురుదాడి!

175 పరుగుల ఛేదనలో పంజాబ్ కింగ్స్ దూకుడుగా ఆడింది. పవర్‌ప్లేలో 49/4తో నిలిచినా.. జట్టు ఎక్కడా వెనుకడుగు వేయలేదు. అథర్వ (4), లివింగ్‌స్టోన్ (2)లను సిరాజ్ అవుట్ చేయగా.. మాథ్యూ షార్ట్ (8)ను హసరంగ సాగనంపాడు. హర్‌ప్రీత్ భాటియాను రనౌట్ రూపంలో సిరాజ్ వెనక్కి పంపించాడు. ఆల్‌రౌండర్ శామ్ కరణ్‌ను హసరంగ రనౌట్ చేశాడు. ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ (46) ఓ ఎండ్‌లో నిలబడగా.. లోయర్ ఆర్డర్ బ్యాటర్ జితేశ్ శర్మ (41) అండగా నిలిచాడు. టాప్‌లో ప్రభుసిమ్రన్, చివర్లో జితేశ్ కదం తొక్కగా.. పంజాబ్ కింగ్స్ రన్‌రేట్ దూసుకెళ్లింది. రన్‌రేట్ నిలకడగా ఉంచుకున్న పంజాబ్.. వికెట్లను కాపాడుకోలేదు. చివర్లోనూ చెలరేగిన సిరాజ్ హర్‌ప్రీత్ బరార్ (13), నాథన్ ఎలిస్ (1)లను అవుట్ చేశాడు. దీంతో పంజాబ్ కింగ్స్ 150 పరుగులకే కుప్పకూలింది. పరుగుల పరంగా పంజాబ్ కింగ్స్‌కు ఇది భారీ ఓటమి. కానీ నిజానికి ఆ జట్టు ఓడినా.. ఎదురుదాడికే కట్టుబడింది. వికెట్లు నిలుపుకుంటే పంజాబ్ కింగ్స్ పైచేయి సాధించేందుకు అవకాశం ఉండేది.

ఓపెనర్ల అర్థ సెంచరీలు



టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు ఓపెనర్లు శతక భాగస్వామ్యం అందించారు. విరాట్ కోహ్లి (59), డుప్లెసిస్ (84) తొలి వికెట్‌కు 137 పరుగులు జోడించారు. పవర్‌ప్లేలో 59 పరుగులు పిండుకున్న కోహ్లి, డుప్లెసిస్ బెంగళూర్‌ను భారీ స్కోరు దిశగా నడిపించారు. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 31 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన డుప్లెసిస్.. ఆ తర్వాత జోరు కొనసాగించాడు. ఐదు ఫోర్ల సాయంతో విరాట్ కోహ్లి 40 బంతుల్లో 50 పరుగులు సాధించాడు. ఓ సిక్సర్‌తో జోరందుకున్న కోహ్లి.. వికెట్ చేజార్చుకున్నాడు. గ్లెన్ మాక్స్‌వెల్ (0), దినేశ్ కార్తీక్ (7), మహిపాల్ (7 నాటౌట్), షాబాజ్ అహ్మద్ (5 నాటౌట్) ధనాధన్ దూకుడు చూపించలేదు. ఓపెనర్ల అర్థ సెంచరీలతో బెంగళూర్ 174 పరుగులు చేసింది. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో హర్‌ప్రీత్ బరార్ (2/31) రెండు వికెట్లు పడగొట్టగా.. అర్షదీప్ సింగ్, నాథన్ ఎలిస్ చెరో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. ఇటు పంజాబ్ కింగ్స్, అటు రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ సారథులు మ్యాచ్‌కు దూరంగా ఉన్నారు!. బెంగళూర్ కెప్టెన్ డుప్లె సిస్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్ చేయగా.. విరాట్ కోహ్లి సారథ్యం చేశాడు. పంజాబ్ కింగ్స్ శిఖర్ ధావన్ పూర్తిగా బెంచ్‌కు పరిమితం కాగా.. శామ్ కరణ్ సారథ్యం వహించాడు.

స్కోరు వివరాలు :

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ : విరాట్ కోహ్లి (సి) జితేశ్ (బి) 59, డుప్లెసిస్ (సి) శామ్ కరణ్ (బి) ఎలిస్ 84, మాక్స్‌వెల్ (సి) అథర్వ (బి) బరార్ 0, దినేశ్ కార్తీక్ (సి) అథర్వ (బి) అర్షదీప్ 7, మహిపాల్ నాటౌట్ 7, షాబాజ్ నాటౌట్ 5, ఎక్స్‌ట్రాలు : 12, మొత్తం : (20 ఓవర్లలో 4 వికెట్లకు) 174.

వికెట్ల పతనం : 1-137, 2-137, 3-151, 4-163.

బౌలింగ్ : అర్షదీప్ సింగ్ 4-0-34-1, హర్‌ప్రీత్ బరార్ 3-0-31-2, నాథన్ ఎలిస్ 4-0-41-1, శామ్ కరణ్ 4-0-27-0, రాహుల్ చాహర్ 4-0-24-0, లివింగ్‌స్టోన్ 1-0-9-0.

పంజాబ్ కింగ్స్ : అథర్వ (ఎల్బీ) సిరాజ్ 4, ప్రభుసిమ్రన్ (బి) పార్నెల్ 46, మాథ్యూ షార్ట్ (బి) హసరంగ 8, లివింగ్‌స్టోన్ (ఎల్బీ) సిరాజ్ 2, హర్‌ప్రీత్ భాటియా (రనౌట్) సిరాజ్ 13, శామ్ కరణ్ (రనౌట్) హసరంగ 10, జితేశ్ శర్మ (సి) షాబాజ్ (బి) హర్షల్ 41, షారుక్ ఖాన్ (స్టంప్డ్) కార్తీక్ (బి) హసరంగ 7, హర్‌ప్రీత్ బరార్ (బి) సిరాజ్ 13, నాథన్ ఎలిస్ (బి) సిరాజ్ 1, అర్షదీప్ సింగ్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 5, మొత్తం : (18.2 ఓవర్లలో ఆలౌట్) 150.

వికెట్ల పతనం : 1-4, 2-20, 3-27, 4-43, 5-76, 6-97, 7-106, 8-147, 9-149, 10-150.

బౌలింగ్ : మహ్మద్ సిరాజ్ 4-0-21-4, వేనీ పార్నెల్ 3-0-32-1, వానిందు హసరంగ 4-0-39-2, విజయ్ కుమార్ 3-0-29-0, గ్లెన్ మాక్స్‌వెల్ 1-0-5-0, హర్షల్ పటేల్ 3.2-0-22-1.





సన్‌రైజర్స్‌కు స్పిన్ పరీక్ష!

- చెపాక్‌లో తొలి విజయంపై హైదరాబాద్ గురి
- నేడు చెన్నై సూపర్‌కింగ్స్‌తో సన్‌రైజర్స్ పోరు

నవతెలంగాణ-చెన్నై

సన్‌రైజర్స్ హైదరాబాద్ నిలకడలేని ప్రదర్శన ఆ జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. వరుస విజయాలతో ఊపందుకున్న ఆరెంజ్ ఆర్మీ.. సొంతగడ్డపై మరో ఓటమితో నిరాశపరిచింది. ఐదు మ్యాచుల్లో రెండు విజయాలే సాధించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నేడు కీలక పరీక్షకు సిద్ధమైంది. చెన్నై చెపాక్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ కోసం స్పిన్ సవాల్ ఎదురు చూస్తుంది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చెపాక్‌లో మూడు మ్యాచులు ఆడింది. ఆ మూడు మ్యాచుల్లో హైదరాబాద్‌కు పరాజయమే ఎదురైంది. దీంతో ఎం.ఎ చిదంబరం స్టేడియంలో అగ్ర జట్టు చెన్నై సూపర్‌కింగ్స్‌పై తొలి విజయంపై కన్నేసి సన్‌రైజర్స్ హైదరాబాద్ బరిలోకి దిగుతోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్‌కింగ్స్ నేడు ముఖాముఖి తలపడనున్నాయి.

స్పిన్ వర్సెస్ స్పిన్

చెపాక్ పిచ్ స్పిన్ స్వర్గధామం. ఇక్కడ చెన్నై సూపర్‌కింగ్స్‌కు తిరుగులేని రికార్డుంది. ఈ సీజన్లో ధోనీసేన చెపాక్‌లో రెండు మ్యాచులే ఆడింది. అందులో ఓ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ విజయం సాధించింది. స్పిన్ పోరులో రాయల్స్ ముగ్గురు ప్రపంచ శ్రేణి స్పిన్నర్లను ప్రయోగించింది. అశ్విన్, చాహల్, ఆడం జంపాలు సూపర్‌కింగ్స్‌ను మాయ చేసేందుకు చూశారు. ముగ్గురు నాణ్యమైన స్పిన్నర్లను ఆడించినా చివరి బంతి ఉత్కంఠకు దారితీసిన మ్యాచ్‌లో రాయల్స్ కేవలం 3 పరుగుల తేడాతోనే విజయం సాధించింది. హైదరాబాద్ తరఫున వాషింగ్టన్ సుందర్, మయాంక్ మార్కండె, ఆదిల్ రషీద్, అకీల్ హోసేన్ స్పిన్నర్లు. వాషింగ్టన్ సుందర్ ఈ సీజన్లో 11 ఓవర్లు వేసినా ఒక్క వికెట్ పడగొట్టలేదు. మయాంక్ మార్కండె ఆకట్టుకుంటున్నాడు. ఆదిల్ రషీద్ జట్టు కూర్పులో భాగంగా బెంచ్‌కు పరిమితం అయ్యాడు. స్పిన్ టెస్టు కోసం హైదరాబాద్ వరల్డ్ క్లాస్ స్పిన్నర్‌ను జట్టులోకి తీసుకుంటుందా? లేదా అనేది ఆసక్తికరం. ఈ సీజనోల చెపాక్‌లో స్పిన్నర్లు 8.13 ఎకానమీతో 16 వికెట్లు పడగొట్టగా.. 10.66 ఎకానమీతో పేసర్లు 11 వికెట్లే తీసుకున్నారు.

ఇక సన్‌రైజర్స్ స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ స్పిన్ కష్టాలు సూపర్‌కింగ్స్‌కు బాగా తెలుసు. కోల్‌కతపై శతకం సాధించినా.. స్పిన్నర్లపై బ్రూక్ ఆధిపత్యం చూపించలేదు. దీంతో బ్రూక్ కోసం పవర్‌ప్లేలోనే స్పిన్నర్లను బరిలోకి దింపేందుకు సూపర్‌కింగ్స్ సిద్ధమవుతోంది. రవీంద్ర జడేజా, మోయిన్ అలీలకు తోడు మహీశ్ తీక్షణ.. అవసరమైతే మిచెల్ శాంట్నర్ మాయ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. పవర్‌ప్లే ప్రదర్శన సైతం ఈ మ్యాచ్‌లో కీలకం కానుంది. పవర్‌ప్లేలో 7.13 రన్‌రేట్‌తో సన్‌రైజర్స్ చెత్త గణాంకాలు నమోదు చేయగా.. 9.86 రన్‌రేట్‌తో సూపర్‌కింగ్స్ టాప్‌లో నిలిచింది. రుతురాజ్ గైక్వాడ్, డెవాన్ కాన్వే అజింక్య రహానెలు చెన్నైకి కీలకం కానుండగా.. కెప్టెన్ ఎడెన్ మార్క్‌రామ్, హ్యారీ బ్రూక్, హెన్రిచ్ క్లాసెన్‌లు సన్‌రైజర్స్‌కు కీలకం.



'బ్రాండ్' బ్రెండన్ సరైనదే!

- బ్రెండన్ మెక్‌కలమ్‌పై ఈసీబీ స్పష్టత

లండన్ : ఓ ఆన్‌లైన్ బెట్టింగ్ కంపెనీకి ప్రచారకర్తగా ఒప్పందం కుదుర్చుకున్న ఇంగ్లాండ్ టెస్టు జట్టు చీఫ్ కోచ్, న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెక్‌కలమ్‌పై ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. '22బెట్' ఆన్‌లైన్ బెట్టింగ్ కంపెనీ యూట్యూబ్ సహా ఇతర సోషల్ మీడియా ప్రకటనల్లో బ్రెండన్ మెక్‌కలమ్ ప్రచారకర్తగా కనిపించాడు. దీనిపై న్యూజిలాండ్‌కు చెందిన ఓ సంస్థ ఈసీబీకి ఫిర్యాదు చేసింది. ఆటగాళ్లు, సహాయక సిబ్బంది నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని గత వారం ఈసీబీ వెల్లడించింది. బెట్టింగ్ కంపెనీతో మెక్‌కలమ్ ఒప్పందంపై ఈసీబీ ఉన్నతాధికారులు విచారణ జరిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కంపెనీలతో ప్రచారకర్తగా ఒప్పందం చేసుకోకుండా.. ఎటువంటి నిబంధనలు లేవని ఈసీబీ అధికారులు



నిర్ధారించారు. ' బ్రెండన్ మెక్‌కలమ్ విషయంలో గత కొన్ని రోజులుగా చర్చలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని ఈసీబీ కోణంలో మాత్రమే పరిగణించి విచారించాం.

ఈ అంశంలో బ్రెండన్ మెక్‌కలమ్‌పై బోర్డు నుంచి ఎటువంటి చర్యలు ఉండవని' ఈసీబీ అధికార ప్రతినిధి తెలిపారు. ఇదిలా ఉండగా, వివాదాస్పదంగా మారిన ఆన్‌లైన్ బెట్టింగ్ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసుకునేందుకు మెక్‌కలమ్ సిద్ధమవుతున్నారు. ఈ విషయంలో మెక్‌కలమ్ త్వరలోనే ఓ ప్రకటన చేసే అవకాశం ఉంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

కోసింది కోసినట్టే..

కల్లాల్లోనే కాంటా వేస్తున్న దళారులు

- వడగండ్ల భయం.. జాడలేని కొనుగోలు కేంద్రాలు
- 353 కేంద్రాలకుగాను షురు చేసింది రెండే!
- పంటను ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకునేందుకు రైతుల సుముఖం..
- ఈసారి పంట కొనుగోలు లక్ష్యాన్నీ తగ్గించుకున్న ప్రభుత్వం
- ఇదే అదనుగా పచ్చివడ్ల పేరుతో రూ.1600 నుంచి రూ.1700లోపే దళారుల చెల్లింపు
- వచ్చినకాడికి చాలన్న భావనతో రైతులూ ప్రయివేటుకే మొగ్గు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

యాసంగి ధాన్యం కొనుగోళ్లలో వరి కోసింది కోసినట్టుగా దళారులు దండుకుంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు రూ.200కోత పెట్టి ముందుగానే డబ్బులు చేతికందిస్తూ కల్లాల్లోనే కాంటా వేస్తున్నారు. ప్రభుత్వం వారం కిందటే అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని చెప్పినా ఒకటి రెండుచోట్ల తప్ప ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. ఇదే అదనుగా ప్రయివేటు వ్యాపా రులు క్వింటా ధాన్యానికి పచ్చివడ్లనే పేరుతో రూ.1600 నుంచి రూ.1800 మధ్యన చెల్లిస్తూ ఎక్కడిక్కడ కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోళ్లలో జాప్యం, తూకంలో కోతలు, ఖాతాల్లో డబ్బుల జమకు ఆలస్యం తదితర కారణాలతో రైతులు ప్రయివేటుకు అమ్మేందుకు మొగ్గుచూపుతున్నారు. ఇదే సమయంలో



ప్రభుత్వం కొనుగోలు లక్ష్యాన్ని తగ్గించుకోవడం గమనార్హం.

కరీంనగర్ జిల్లాలో 2022-23 ఈ యాసంగిలో 2,73,112 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ సాగు మొత్తంలో 6.20లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో 40శాతం మేర (లక్షా 68వేల మెట్రిక్‌టన్నుల) ధాన్యం ప్రయివేటు వ్యాపారులు, మిల్లర్లు, దళారులు కొనుగోలు చేస్తారని భావించారు. మిగిలిన 60శాతం (4లక్షలా 52వేలా 885 మెట్రిక్‌టన్నుల) ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించు కున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా 353 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు.

ఇందులో ఐకేపీ నుంచి 56, పీఏసీఎస్ 245, డీసీఎమ్ఎస్ 51 కేంద్రా లను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. తొలుత ఏప్రిల్‌లో 45వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని, మిగిలిన 4.08లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మేలో సేకరిం చాలని నిర్ణయించారు. గతేడాది యాసంగిలో 2,49,780 ఎకరాల్లో వరి సాగుకాగా.. 5.92లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు భావించారు. ఇందులో 3.39లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకోగా చివరికి 3లక్షల మెట్రిక్ టన్నుల వరకు సేకరించింది. ఈ సారి లక్ష్యం భారీగా ఉన్నా.. ఇంకా కొనుగోలు కేంద్రాల ప్రారంభం దగ్గరే ఉండటం గమనార్హం.

ప్రతి ఊళ్లో సగంమేర ప్రయివేటుకు..?

ఈసారి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ప్రతియేటా సేకరిస్తున్న ధాన్యం మిల్లర్లకు అప్పగించడం, వారు తిరిగి సీఎంఆర్ రూపంలో ఎఫ్‌సీఐకి సకాలంలో అందించకపోవడం వంటి కారణాలతో పెద్దఎత్తున రాష్ట్ర సివిల్ సప్లయ్ సంస్థకు నష్టం వస్తోంది. దాంతో ఈసారి రైతుల నుంచి తక్కువ మొత్తంలో దిగుబడిలో 60శాతం మేర ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ నెల మొదటి వారంలోనే ప్రారంభించాల్సిన ప్యాడీ సెంటర్లను ఇంకా ఆలస్యం చేస్తోంది. దీంతో ముందుగా నాట్లు వేసుకున్న రైతుల పొలాల్లో కోతలు సాగుతున్నాయి. ఇదే సమయంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా వరి గొలకమీద ఉండగానే గింజలో తేమశాతం తగ్గుతోంది. మళ్లీ ఆ ధాన్యం ఆరబోయడం, కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లడం వంటి వ్యయప్రయాసాలకంటే ప్రయివేటుకు అమ్ముకునేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు.

అయితే ప్రభుత్వం 'ఏ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2060, సాధారణ రకానికి రూ.2040 మద్దతు ధర ప్రకటించింది. ప్రయివేటు వ్యాపారులు రూ.1800 వరకు చెల్లిస్తున్నారు. క్వింటాపై రూ.200 నష్టం భరించి అయినా కోతలు పూర్తవగానే.. కల్లాల్లోనే ప్రయివేటు వ్యాపారులకు పంటను అమ్ముకునేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు.

వీఓఏల సమస్యల పరిష్కారానికి సీఎం చొరవ చూపాలి

- సమ్మెకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, జూలకంటి మద్దతు
- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె



నవతెలంగాణ- విలేకరులు

ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చొరవ చూపాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సమస్యలను పరిష్కరించాలని ఐకేపీ వీఓఏలు చేపట్టిన సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. సమ్మెకు వారు మద్దతు తెలిపారు. మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడారు. వీఓఏల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చొరవ చుపాలన్నారు. గ్రామాలలో సేవ చేస్తున్న వీఓఏల కృషిని ప్రభుత్వం గుర్తించి, వారి సేవలను క్రమబద్ధీకరించి, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో వారి సేవలు అనిర్వచనీయమని అటువంటి వారికి ప్రభుత్వం తక్షణమే వైద్య సహాయం కింద వైద్య ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. పని భారాన్ని తగ్గించి వారికి సెర్ప్ ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పిల్లుట్ల సైదులు, మండల అధ్యక్షులు కందుకూరి రమేష్, వీఓఏల బాధ్యులు కే. లక్ష్మి, కె.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.చిట్యాల మండల కేంద్రంలో ఐకేపి వివోఏల సమ్మెకు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య మద్దతు తెలిపారు. మర్రిగూడ మండల కేంద్రంలో ఐకేపీ, వీఓఏల నిరవధిక సమ్మె కొనసాగింది. నాంపల్లిలో వీఓఏలకు బీఎస్పీ నాయకులు మద్దతు పలికారు. చండూరు మండలంలో వీఓఏల సమ్మె కొనసాగుతుంది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వీవోఏ దీక్షలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. భద్రాచలంలో ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. చర్లలో దీక్ష శిబిరాన్ని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీవోఏ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. దుమ్ముగూడెంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సంఘీభావం తెలిపారు. ఇల్లందులో సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ నబి దీక్షలను ప్రారంభించారు. ఖమ్మం జిల్లా ముదిగొండలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కూసుమంచిలో బస్టాండ్ సెంటర్ నుంచి ఐకేపీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం ఏపీఎం సత్యవర్ధన్‌కు వినతిపత్రం అందజేశారు.

ఐకేపీ వివోఏల సమస్యలను పరిష్కరించండి : సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ

రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీవోఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు గురువారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో 17,608 గ్రామసంఘాల సహాయకులు (వీఆర్‌ఏ)పనిచేస్తున్నారని తెలిపారు. 19 ఏండ్ల నుంచి గ్రామాల్లో మహిళల అభ్యున్నతి కోసం, మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేయాలి

అన్నదాతల ఆందోళన



నవతెలంగాణ-చింతకాని

రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న పంటకు మద్దతు ధర కల్పించి, మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రైతులు ఆందోళన బాట పట్టారు. రోజురోజుకీ మొక్కజొన్న ధర భారీగా తగ్గుతుండడంతో.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని రైతన్నలు ఖమ్మం - బోనకల్ ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి తోటకూరి వెంకట నరసయ్య మాట్లాడుతూ.. అకాల వర్షాలకు మొక్కజొన్న పంట భారీగా నష్టం వాటిల్లిందని, ప్రారంభంలో క్వింటాకు రూ.2300 పలికిన ధర ఇప్పుడు కేవలం రూ.1750 మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మార్క్ ఫెడ్ ద్వారా మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు రవి, కోలేటి నాగేశ్వరరావు, ఏటుకూరి రవి, అంబటి లచ్చయ్య, బైరు బ్రహ్మం, ఆలస్యం నాగేశ్వరరావు, లింగ బాబు, రామారావు, కోలేటి చిన్న బ్రహ్మయ్య, బైరు స్వామి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుక

నవతెలంగాణ-హైదరాబాద్



తెలుగు రాష్ట్రాల్లో ప్రతి పేదవాడు కోటీశ్వరుడు కావాలన్నదే తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆశయమనీ తెలుగుదేశం అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఆలక్ష్యంతో ఆయన ముందుకు పోతున్నారని చెప్పారు. తెలుగు ప్రజల సంక్షేమం కోసమే చంద్రబాబు నిరంతరం కషి చేస్తున్నారని చెప్పారు. ఇందుకోసం ఆయన పార్టీలో ప్రతిరోజూ అందరితో చర్చిస్తున్నారని చెప్పారు. గురువారం ఎన్టీఆర్‌భవన్‌లో ఆపార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. తదనంతరం కాసాని జ్ఞానేశ్వర్ ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. చంద్రబాబు 73 ఏండ్ల వయస్సులోనూ నిరంతరం యువకునిలా పనిచేస్తున్నారని అన్నారు. ప్రతి రోజూ ఉదయం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రజా సంక్షేమం కోసం ఏమి చేస్తే బాగుంటుందని పార్టీ నాయకులతో టెలికాన్ఫరెన్స్ ను నిర్వహిస్తున్నారని చెప్పారు. పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ మాసంలో ఐదో తేదిన బాబు జగ్జీవన్ రామ్, 11వ తేదిన జ్యోతిరావుపూలె, 14వ తేదిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాల మాదిరిగానే ఈ మాసంలోనే మన నాయకుడు చంద్రబాబు పుట్టిన రోజును 20వ తేదీన జరుపుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఆ మహనీయుల స్ఫూర్తితో చంద్రబాబు పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ నాయకులు కాసాని వీరేష్, తెలుగుదేశం పార్టీ మీడియా కమిటీ చైర్మన్ ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బియ్యని సురేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలంపల్లి అశోక్, టీఎన్‌టీయూసీ అధ్యక్షులు ఎం.కె. బోస్, ఎస్టీ సెల్ అధ్యక్షులు గోపి, లీగల్ సెల్ అధ్యక్షులు రఘు వర్ధన్ ప్రతాప్, సాంస్కతిక విభాగం అధ్యక్షులు చంద్రహాసన్, రాష్ట్రపార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు సాయి తులసి, సంధ్యపోగు రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి మన్నె సంజీవరావు, భువనగిరి పార్లమెంట్ పార్టీ అబ్జర్వర్ కుందారపు కష్టాచారి, అజ్మీరా రాజునాయక్, గడ్డి పద్మావతి, షేక్ ఆరిఫ్, తాళ్లూరి జీవన్ కుమార్, వేజెండ్ల కిశోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మే 1 నుంచి టీటీసీ శిక్షణ కోర్సు ప్రారంభం

- నేటినుంచి దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) 42 రోజులపాటు నిర్వహించే వేసవి శిక్షణ కోర్సు వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానుంది. శుక్రవారం నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఈనెల 30వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. జూన్ 11వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. హైదరాబాద్, హన్మకొండ, నిజామాబాద్, నల్లగొండ, కరీంనగర్‌లో ఈ కోర్సు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన వారు 45 ఏండ్లలోపు వారు దరఖాస్తు చేసేందుకు అర్హులని వివరించారు. సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ (ఎస్ఎస్‌సీ) లేదా తత్సమాన పరీక్షతోపాటు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ)లో లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణత కావాలని తెలిపారు. ఇతర వివరాలకు ఒఒఒ.ఎంవ్.వశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీఐ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నూతన విద్యావిధానంతో మహిళకు విద్య దూరం

దేశంలో ప్రయివేటు, కార్పొరేట్ అనుకూల విద్యావిధానం

- రాజ్యాంగం, దాని విలువలు ధ్వంసం: కొండపల్లి దుర్గాదేవి ప్రథమ వర్ధంతి సందర్భంగా సెమినార్‌లో జేఎన్‌యూ ప్రెసిడెంట్ ఐషీ ఘోష్, ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

నూతన విద్యావిధానంతో మహిళలకు విద్య దూరం అవుతుందని ఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రెసిడెంట్ ఐషీ ఘోష్ ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం మొత్తం మార్కెట్ అయిందన్నారు. ఈ మార్కెట్ వ్యవస్థలో భాగంగా కోచింగ్ సెంటర్స్ పుట్టుకొచ్చాయని, విద్య బాగా కమర్షియల్ అయిందని తెలిపారు. దేశంలో ప్రభుత్వ విద్య అందరికీ అందకుండా పోతుందన్నారు. కొండపల్లి దుర్గాదేవి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు, కోడలు పావన్, వినత నేతృత్వంలో ఐద్వా ఆధ్వర్యంలో ఖమ్మంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన 'నూతన విద్యావిధానం-విద్యార్థినులపై ప్రభావం' సెమినార్‌లో ఆమె మాట్లాడారు. ముందుగా దుర్గాదేవి చిత్రపటానికి ఐషీ ఘోష్, ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పూలమాల వేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు గండ్లూరి కిషన్ రావు సతీమణి నర్సుబాయమ్మను సన్మానించిన అనంతరం ఐషీ ఘోష్ మాట్లాడారు.

భారతదేశంలో విద్యాభివృద్ధికి అనేక వనరులున్నాయని, కాని వాటిని ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన విద్యావిధానం పేరుతో ప్రయివేటు విద్యాసంస్థల్లో రాజ్యాంగ హక్కులు హరించివేస్తున్నారని చెప్పారు. రిజర్వేషన్స్, భావప్రకటన స్వేచ్ఛను హరించే చర్యలు విద్యాసంస్థల్లోకి వస్తున్నాయన్నారు. బీజేపీ విద్యారంగాన్ని పూర్తిగా మతతత్వీకరణ చేస్తుందని, తదనుగుణంగా సిలబస్‌లో మార్పులు, పాఠ్యాంశాల తొలగింపు చేస్తున్నారని తెలిపారు. దాంతో ముఖ్యంగా బాలికలు విద్యకు దూరమవుతున్నారన్నారు. ఉన్నత విద్యను పేద విద్యార్థుల నుంచి దూరం చేసేందుకు ఫారిన్ యూనివర్సిటీలను ఆహ్వానిస్తుందని ఆ విద్యాలయాలకు మన దేశ చరిత్ర, అర్థ శాస్త్రం, రాజకీయ శాస్త్రం తెలుస్తుందా అని ప్రశ్నించారు. ఈ దేశ జాతీయోద్యమ నాయకుల చరిత్ర సిలబస్ నుంచి తొలగించడం అత్యంత దారుణమని తెలిపారు.

సెంట్రల్ యూనివర్సిటీలకు ఫండ్స్ ఇవ్వకపోవడం, ఫెలోషిప్స్ విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేయడం, బడ్జెట్‌లో నిధులు పెంచకుండా ఉండటం లాంటివి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో దేశాన్ని అభివృద్ధి చేస్తామంటూ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతున్నారని చెప్పారు. భారతదేశ భవిష్యత్తుకు స్తంభాలైన విద్యార్థులే ఈ సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కొండపల్లి దుర్గాదేవి, మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో విద్యారంగ పరిరక్షణకు ముందు కెళ్లాలని చెప్పారు.

ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి మాట్లాడుతూ.. మూఢాచారాలు, మహిళా చైతన్య కోసం కొండపల్లి దుర్గాదేవి ఉద్యమించారన్నారు. తన కుటుంబంలో కులాంతర వివాహాలు చేయడమే కాకుండా సమాజంలో కులాంతర వివాహాలను ప్రోత్సహించారని చెప్పారు. విద్యార్థుల్లో రాజకీయ చైతన్యం రావాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి సూచించారు. మహిళలపై జరుగుతున్న దాడులపై పోరాడాలన్నారు. దుర్గాదేవి కుమారుడు పావన్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థినీ ఐషీ ఘోష్ కావాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సదస్సులో రాష్ట్ర నాయకులు బత్తుల హైమావతి, బుగ్గవీటి సరళ, అఫ్రోజ్ సమీనా, జిల్లా నాయకులు మెరుగు రమణ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి స్థూపానికి ఘన నివాళులు

- భారీ సంఖ్యలో తరలివచ్చిన ఆదివాసులు,
- నివాళులర్పించిన వివిధ పార్టీల నాయకులు

నవతెలంగాణ- ఇంద్రవెల్లి



ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన మృతవీరుల స్థూపానికి ఆదివాసీ గిరిజనులు, గిరిజనేతరులు ఘన నివాళులర్పించారు. ఆనాటి నెత్తుటి గాయానికి 42ఏండ్లు పూర్తికావడంతో గురువారం మృతవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. పోలీసుల పహారా మధ్య నిర్వహించిన ఈ సభకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసులు, ఆదివాసీ సంఘాలు స్థూపం వద్ద సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆనాటి ఘటనను స్మరించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి జనం తరలిరావడంతో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. వైఎస్ఆర్‌టీపీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ షర్మిల, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు హాజరై మృతవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన సంస్మరణ సభలో మాట్లాడారు. పోడు భూముల పట్టాల కోసం పోరాడిన ఆదివాసీ మహిళలను ముఖ్యమంత్రి కేసీఆర్ జైల్లో పెట్టారని విమర్శించారు. జులైలోగా పోడు భూములకు పట్టాలు ఇవ్వకపోతే మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మహిళా కమిషన్ సభ్యులు ఈశ్వరీబాయి స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెడ్మ బొజ్జు, నాయకులు బొంత ఆశారెడ్డి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు బుర్సా పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితుడివి.. ప్రభుత్వ పాఠశాలలో చదవాలి

ప్రిన్సిపాల్ బెదిరించారు

- ఫీజు కట్టలేదని బాలుడిని నిర్బంధించారు
- చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులకు విద్యార్థి తండ్రి ఫిర్యాదు
- సిరిసిల్ల జిల్లా శ్రీ చైతన్య పాఠశాలలో ఘటన

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

దళితుడివైనందున ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని, శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ కులం పేరుతో దూషించడమే కాక, ఫీజు కట్టలేదని తన కుమారుడిని పాఠశాలలో నిర్బంధించారని విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాబు

తీసుకోవాలని కట్కూరి బాబు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విద్యార్థి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం. తన పెద్ద కుమారుడు కట్కూరి సుకుమార్ 3వ తరగతి, చిన్న కుమారుడు కట్కూరి 1వ తరగతి శ్రీచైతన్య పాఠశాలలో చదువుతున్నారు. అకాడమిక్ ప్రారంభం కాకముందే నోట్‌బుక్స్ కోసం ఇద్దరికి కలిపి రూ.10వేలు తీసుకున్నారు. కాని సగం బుక్స్ మాత్రమే ఇచ్చారు. దాంతో తాను కూడా సగం ఫీజు కట్టాను. మిగితా బుక్స్ ఇస్తేనే ఫీజు కడుతానని.. లేకుంటే ఆ డబ్బులు ఫీజులో చూసుకోవాలని యాజమాన్యానికి చెప్పారు. కాగా ఈ నెల 18న మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు తన కొడుకు సుకుమార్‌ని శ్రీచైతన్య ప్రిన్సిపాల్ ప్రియాంకరెడ్డి స్కూల్ ఫీజు కట్టలేదని క్లాస్ రూమ్‌లో పెట్టి నిర్బందించినట్టు వాపోయాడు. ఈ విషయంపై వెళ్లి అడిగితే ఏం చేసుకుంటారో చేసుకోండి.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకొండని దురుసుగా మాట్లాడారని.. పైగా టీసీ ఇస్తానని ప్రిన్సిపాల్ బెదిరించారని తెలిపారు.

ఇంతవరకు ఫీజు కట్టలేదు ఏమి అనిపిస్తాలేదా అని అవమానించారన్నారు. ఒక చిన్న బాలుడని చూడకుండా విచక్షణ లేకుండా 4 గంటల పాటు క్లాస్ రూమ్‌లో నిర్బందించడమే కాకుండా, తాము దళితులైనందున ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని ప్రిన్సిపాల్ చులకనగా మాట్లాడినందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వీఆర్వోల కేసులో తీర్పు రిజర్వు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడాన్ని సవాల్ చేసిన పలు పిటిషన్లపై హైకోర్టులో వాదనలు పూర్తి అయ్యాయి. దీంతో తీర్పును రిజర్వులో పెడుతున్నట్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ గురువారం ప్రకటించింది. ప్రభుత్వం ఏకపక్షంగా వీఆర్వో వ్యవస్థను రద్దు చేసిందనీ, వీఆర్వోల అభిప్రాయాలను కూడా తీసుకోలేదని పిటిషనర్ల వాదన. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ డిజిటలైజేషన్, ధరణి ఏర్పాటు వల్ల వీఆర్వోలతో పని లేదని ప్రభుత్వం చెప్పింది. వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

మార్గదర్శి కేసులో వాదనలు పూర్తి

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కంపెనీలో ప్రయివేటు ఆడిటర్‌తో ఆడిట్‌కు ఏపీ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఆ కంపెనీ హైకోర్టులో సవాల్ చేసింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో ఆడిటింగ్ చేసేందుకు వేములపాటి శ్రీధర్‌ను ఏపీ ప్రభుత్వం నియమించడాన్ని సవాల్ చేసిన రిట్‌ను జస్టిస్ ముమ్మినేని సుధీర్ విచారించారు. గురువారం తెలంగాణ హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. అక్రమాల ఆరోపణలు వచ్చినప్పుడు ఆడిట్ చేయించేందుకు చిట్‌ఫండ్ యాక్ట్ నిబంధనలు అనుమతిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్లీడర్ చెప్పారు. పిటిషన్‌లో ఉత్తర్వులు జారీ వద్దని ఆడిటర్ లాయర్, ఆడిటింగ్ చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని మార్గదర్శి న్యాయవాది వాదించారు.

వివేకా హత్య కేసులో వాదనలు

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితుడు షేక్ దస్తగిరిని అప్రూవర్‌గా పరిగణించడాన్ని వైఎస్ భాస్కర్‌రెడ్డి, వివేకా పీఏ కృష్ణారెడ్డి సవాల్ చేసిన కేసులో దస్తగిరికి తెలంగాణ హైకోర్టు నోటీసులిచ్చింది. పిటిషన్‌ను జస్టిస్ సురేందర్ గురువారం విచారించారు. దస్తగిరికి నోటీసులు జారీ చేసిన న్యాయమూర్తి విచారణను జూన్ నెలకు వాయిదా వేశారు.

న్యాయవాదులను అనుమతించాలి

సీబీఐ విచారణలో వేసే ప్రశ్నలు లిఖితపూర్వంగా ఇచ్చేలా ఆదేశాలివ్వాలని వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సురేందర్ గురువారం విచారించారు. ఆ విధమైన ఉత్తర్వుల జారీకి న్యాయమూర్తి నిరాకరించారు. అయితే, వారిద్దరిని సీబీఐ విచారించేటప్పుడు మధ్యాహ్నం 2 గంటల వరకే వాళ్ల లాయర్లను అనుమతించారనీ, ఇది సుప్రీంకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకమని పిటిషనర్ల లాయర్ వాదించారు. విచారణ చేసేప్పుడు న్యాయవాదులను అనుమతించాలన్న అయన అభ్యర్థనను న్యాయమూర్తి ఆమోదించారు. లాయర్లను సీబీఐ విచారణకు అనుమతించాలని ఆదేశించారు. విచారణను ఆడియో, వీడియో తీయాలని కూడా ఆదేశించారు.

గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలి : సీబీఐ

వివేకా హత్య కేసు నిందితుడు ఎర్ర గంగిరెడ్డికి గతంలో కింది కోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని సీబీఐ హైకోర్టును ఆశ్రయించింది. బెయిల్‌ను రద్దు చేయాలని సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సుమలత గురువారం విచారించారు. హత్య కేసులో కీలక వ్యక్తి గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయకపోతే సాక్షులను ప్రభావతం చేస్తారని సీబీఐ వాదించింది. బెయిల్ రద్దుకు ఏపీ హైకోర్టు నిరాకరించేప్పుడు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుందనీ, ఆ ఉత్తర్వుల్లో జోక్యం అవసరం లేదని గంగిరెడ్డి న్యాయవాది చెప్పారు. విచారణ ఈ నెల 25కి వాయిదా పడింది.

మైనారిటీ, సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శులను మార్చాలి

- కుల నిర్మూలన వేదిక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మైనారిటీ, సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శులను మార్చాలని కుల నిర్మూలన వేదిక రాష్ట్ర అధ్యక్షులు పాపని నాగరాజు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వివిధ రకాల సమస్యలతో విద్యార్థులు అల్లాడిపోతుంటే.. ఆయా సొసైటీల కార్యదర్శిలు కార్యాలయాలకే పరిమితమవుతున్నారని పేర్కొన్నారు. హాస్టళ్లలో అనేక సమస్యలున్నాయనీ, వాటిని పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

టీఆర్టీకి అనుమతి ఇవ్వాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ బదిలీలతో సంబంధం లేకుండా ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)కి వెంటనే ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల పేరుతో కాలయాపన చేయడం వల్ల టీఆర్టీ ప్రక్రియ ఇప్పటికే ఆలస్యమైందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఆర్టీపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల నాలుగు లక్షల మంది అభ్యర్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. బదిలీల కేసు హైకోర్టు మళ్లీ జూన్ 13వ తేదీకి వాయిదా వేసిందని తెలిపారు. దీంతో ఇప్పట్లో ఈ ప్రక్రియ ముగియదని, అందుకే టీఆర్టీకి బదిలీల ప్రక్రియను ముడి పెట్టకుండా తక్షణమే 15 వేల ఉపాధ్యాయ ఖాళీలకు ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలని కోరారు. త్వరగా టీఆర్టీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

లాసెట్ దరఖాస్తు గడువు 29 వరకు పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ దరఖాస్తు గడువును ఈనెల 29వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుం లేకుండా ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశముందని తెలిపారు. ఆలస్య రుసుంతో వచ్చేనెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేయొచ్చని సూచించారు. అదేనెల 16 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోచ్చని సూచించారు. మే 25న లాసెట్ రాతపరీక్షలుంటాయని వివరించారు. ఇతర వివరాలకు https://lawcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. లాసెట్‌కు ఇప్పటి వరకు 35,072 దరఖాస్తులొచ్చాయని తెలిపారు.

అంబేద్కర్ బీఎడ్ ఎంట్రెన్స్ టెస్ట్ దరఖాస్తు గడువు మే 22

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్‌ఏఓయూ)లో బీఎడ్, బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) ఎంట్రెన్స్ టెస్ట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు వచ్చేనెల 22 వరకు ఉన్నది. ఈ మేరకు అంబేద్కర్ వర్సిటీ రిజిస్ట్రార్ ఎవిఎన్ రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు విశ్వవిద్యాలయ పోర్టల్ www. braouonline.in ద్వారా దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. ఎంట్రెన్స్ ఫీజు రూ.వెయ్యి, ఎస్సీ,ఎస్టీ, వికలాంగులకు రూ.750 చెల్లించాలని కోరారు. జూన్ ఆరో తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లోని పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు బీఎడ్ ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) పరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్షకు రెండు రోజుల ముందు హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

అప్పులపాలవుతున్న ఆర్టీసీ కార్మికులు

- 49 శాతం పీఆర్సీ ప్రకటించాలి
- సీఎంకు టీజేఎంయూ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీ కార్మికులు అప్పుల పాలవుతున్నారనీ, అందువల్ల పీఆర్‌సీకి సంబంధించి సీఎం వారికిచ్చిన మాట నిలబెట్టుకోవాలని టీజేఎంయూ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె హనుమంతు ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో సీఎంకు విజ్ఞప్తి చేశారు. కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు వేతన సవరణలు ఇవ్వాలని తెలిపారు. 2017 వేతన సవరణకు ముందుగానే 16 శాతం ఐఆర్ ఉన్నందున ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 33శాతం ఫిట్ మెంట్‌తో పీఆర్సీ ప్రకటించి మొత్తం 49 శాతం ప్రకటించి కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. రెండో వేతన సవరణ 2021ను కూడా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. 10 ఏండ్ల నుంచి కార్మికులకు జీతాలు పెంచలేదని, తక్కువ జీతాలతో భారంగా కుటుంబాన్ని పోషిస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతూ అప్పుల బాధతో చనిపోతున్నారని గుర్తుచేశారు.

సీఎం తల తెగ నరుకుతా !..

- బెదిరించినోడికి బీజేపీ టిక్కెట్
- శివమొగ్గ నుంచి చెన్నబసప్ప పోటీ
- మాజీ మంత్రి ఈశ్వరప్ప కుమారుడికి మొండి చేయి



బెంగళూరు: బీజేపీకి ఎలాంటి వ్యక్తులు కావాలో, దాని భావజాలమేంటో మరోమారు ప్రస్ఫుటమైంది. శివమొగ్గ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఎస్ఎన్ చెన్నబసప్పకు బీజేపీ టిక్కెట్ ఇచ్చింది. అయితే చెన్నబసప్ప 8 ఏండ్ల కిందట నాటి కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తలను తెగ నరుకుతా అంటూ బెదిరింపులకు పాల్పడి అప్పట్లో అరెస్టు కూడా అయ్యారు. ఇప్పుడు అదే చెన్నబసప్ప మే 10న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో శివమొగ్గ నుంచి బీజేపీ తరపున బరిలో నిలుస్తుండటంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 59 ఏండ్ల వయస్సున్న చెన్నబసప్ప అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ బుధవారం సాయంత్రం బీజేపీ అధినాయకత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు అయిన గురువారం నాడు ఆయన తన నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కెఎస్ ఈశ్వరప్ప తదితరులతో కలిసి ర్యాలీగా వెళ్లి చెన్నబసప్ప నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.

ఈశ్వరప్ప ఆశలు అడియాసలు

ఎన్నికల రాజకీయాల నుంచి తాను వైదొలుగుతున్నట్టు ఈ నెల 11న ఈశ్వరప్ప ప్రకటించారు. అయితే ఆయన తన స్థానంలో తన కుమారుడు కెఇ కంతేశ్‌కు బీజేపీ టిక్కెట్ ఇస్తుందని ఆశించారు. బీజేపీ అధినాయకత్వం ఆయనకు మొండి చేయి చూపింది. ఆయన ఆశలపై నీళ్లు కుమ్మరించి వివాదస్పదుడైన చెన్నబసప్పకు పచ్చజెండా ఊపింది. టిక్కెట్ కావాలంటే 'తల తెగ నరుకుతా' అని బెదిరించి సమర్థత చాటుకోవాలా? అంటూ స్వపక్షంలోనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే మాజీ ముఖ్య మంత్రి జగదీశ్ శెట్టార్ వంటి సీనియర్ నేతలకు టిక్కెట్ నిరాకరించడంతో వారంతా తిరుగుబాటు జెండా ఎత్తి కాంగ్రెస్, తదితర పార్టీల్లో చేరిన సంగతి తెలిసిందే.

చెన్నబసప్ప నేపథ్యం..

చెన్నబసప్ప శివమొగ్గ సిటీ మున్సిపల్ కౌన్సిల్‌కు, ఆ తర్వాత శివమొగ్గ సిటీ కార్పొరేషన్‌కు అనేక పర్యాయాలు ఎన్నికయ్యారు. విశ్వ హిందూ పరిషత్, భజ్‌రంగ్ దళ్ వంటి హిందూత్వ సంస్థల్లో చెన్నబసప్ప క్రియాశీలకంగా ఉంటూ ఇతర మతాల పట్ల విద్వేషాన్ని వెళ్లగక్కుతూ ఉంటారన్న విమర్శలు ఆయనపై మొదటి నుంచీ ఉన్నాయి. 2015 నవంబరు 2న అప్పటి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గోమాంసం (బీఫ్) వినియోగంపై చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ హిందూత్వ సంఘాలు ఒక నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ కార్యక్రమంలో చెన్నబసప్ప కూడా పాల్గొన్నారు. శివమొగ్గలో బీఫ్ వినియోగిస్తే దానికంటే ముందుగానే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తలను నరికేస్తానని చెన్నబసప్ప తీవ్రమైన హెచ్చరికలు చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ శివమొగ్గ శాఖ అధ్యక్షులు పివి విశ్వనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మత ప్రాతిపదికన వైషమ్యాలు సృష్టించి ప్రజల్లో చీలికలు తెచ్చేందుకు కుట్ర పన్నుతారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో చెన్నబసప్పను అదే ఏడాది నవంబరు 3న పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం బెయిల్‌పై ఆయనను విడుదల చేశారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే తీవ్రమైన బెదిరింపులకు పాల్పడిన చెన్నబసప్పతో తమకు సంబంధం లేదన్నట్టుగా బీజేపీ అప్పట్లో నాటకాలు ఆడింది. అనంతరం జరిగిన ప్రతి హిందూత్వ ర్యాలీల్లోనూ, సమీకరణల్లోనూ చెన్నబసప్ప క్రియాశీలంగా వ్యవహరిస్తూవచ్చారు. ఇప్పుడు అదే చెన్నబసప్పకు బీజేపీ టిక్కెట్ ఇవ్వడం లౌకిక వాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నామినేషన్ అనంతరం చెన్నబసప్ప మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తానని తెలిపారు. కనీసం 60 వేల మెజార్టీతో తాను గెలుపొందుతానని చెప్పారు.

కనీసం కారు లేదట!

బీజేపీ అభ్యర్థిగా శివమొగ్గ నుంచి నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా చెన్నబసప్ప తన ఆస్తిపాస్తుల వివరాలను అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తాను 9వ తరగతి వరకే చదువుకున్నట్టు తెలిపారు. తనకు, తన భార్యకు కలిసి రూ.1.05 కోట్ల విలువ చేసే ఆస్తులున్నట్టు పేర్కొన్నారు. దంపతులిద్దరికీ కలిసి మూడు ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, అయితే కారు మాత్రం లేదని ప్రకటించారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్న ఘనత.. రాష్ట్ర ప్రభుత్వానిదే..

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

- నాంపల్లి ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్. బ్లడ్ బ్యాంక్ కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ- సుల్తాన్‌బజార్

రాష్ట్రంలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఏరియా ఆస్పత్రిలో 5 పడకల డయాలసిస్ కేంద్రం, బ్లడ్ బ్యాంక్ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం వార్డులన్నీ తిరుగుతూ రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాంపల్లి ఏరియా హాస్పిటల్‌కు చాలా మంది పేదలు వస్తారని, వారికి మెరుగైన సేవలు అందాలన్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ విన్నపం మేరకు వీటిని ఏర్పాటు చేశామని తెలిపారు. కిడ్నీ సమస్యలు ఉన్న వారు వారానికి రెండు, మూడు సార్లు డయాలసిస్ చేసుకోవాల్సిన అవసరం ఉంటుందని, ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారమన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు కేవలం ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆస్పత్రుల్లో మాత్రమే డయాలసిస్ సెంటర్లు ఉండేవని, ఇప్పుడు సీఎం కేసీఆర్ మానవతా హృదయంతో ఆలోచించి రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి ఒక డయాలసిస్ కేంద్రం ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించామన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా డయాలసిస్ చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో డయాలసిస్ కేంద్రాల సంఖ్య కేవలం మూడు ఉంటే ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటి సంఖ్య 102కు పెంచామన్నారు. రాష్ట్రంలో దాదాపు 12వేల మంది డయాలసిస్ చేయించుకుంటున్నారని తెలిపారు. వారిలో 10వేల మందికి ఉచితంగా ప్రభుత్వం డయాలసిస్ చేస్తున్నదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ ద్వారా సింగిల్ యూజ్డ్ ఫిల్టర్‌ను ఉపయోగించి డయాలసిస్ చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో డయాలసిస్ రోగులకు ఆర్థికంగా భరోసా ఇచ్చేందుకు ఆసరా పింఛను, ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించామన్నారు. ఏటా 150 వరకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు జరుగుతున్నాయని చెప్పారు. ఆరోగ్య శ్రీ కింద రూ. రూ. 10 లక్షల వరకు ప్రభుత్వమే భరిస్తుందని, దాంతో పాటు మందులను కూడా ఉచితంగా (రూ.15 వేలు విలువ చేసే) జీవిత కాలం అందిస్తున్నామని తెలిపారు. కిడ్నీ రోగుల కోసం ఏడాదికి రూ. 200 కోట్లు ఖర్చు చేస్తే, అందులో ఒక్క డయాలసిస్ రోగి కోసం ఏడాదికి రూ.100 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదన్నారు. ఇక రాష్ట్రంలో బ్లడ్ బ్యాంకుల సంఖ్య 56కు పెంచామన్నారు 27 బ్లడ్ బ్యాంక్‌లకు కాంపోనెంట్ సపరేటర్స్ ఇచ్చి వాటి వల్ల ఒక యూనిట్ రక్తాన్ని ముగ్గురు, నలుగురికి వాడుతున్నామని తెలిపారు. ఇక నగరం నలువైపులా టిమ్స్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

గచ్చిబౌలి టిమ్స్ ఆస్పత్రిని 1000 పడకలకు అప్డేట్ చేస్తున్నామని తెలిపారు. నిమ్స్‌కు అదనంగా 2000 పడకలను సీఎం కేసీఆర్ మంజూరు చేశారని, నిమ్స్ విస్తరణ పనులకు సీఎం కేసీఆర్ వచ్చే నెలలో శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఇక ట్రామా కేర్ సెంటర్‌ను లెవల్ 1, 2, 3గా వర్గీకరించి బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందజేసే కార్యక్రమం ఒకటి, రెండు వారాల్లో ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ అమర్ సింగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డాక్టర్ సునీత, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీదేవి, డీ బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్స్, డాక్టర్లు అరుణ పద్మావతి, శ్రీలత, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

శరద్ పవార్‌తో అదానీ భేటీ

- ఎన్సీపీ అధినేతతో రెండు గంటల పాటు చర్చ
- ముంబయిలోని శరద్ పవార్ ఇంటిలోనే జరిగిన సమావేశం
- 'హిండెన్‌బర్గ్-అదానీ' అంశం నేపథ్యంలో ప్రాధాన్యతను సంతరించుకున్న మీటింగ్

ముంబయి : హిండెన్‌బర్గ్ నివేదికతో అటు వ్యాపారపరంగా, ఇటు రాజకీయంగా తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న గౌతమ్ అదానీ.. ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్‌ను కలిశారు. ముంబయిలోని శరద్ పవార్ ఇంటిలో ఆయనతో భేటీ అయ్యారు. ఆర్థిక అవకతవకలు, స్టాక్ మోసాలకు పాల్పడ్డారని అదానీపై హిండెన్‌బర్గ్ తన నివేదికలో సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సహా ఇతర పార్టీలు జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) వేయాలని కొంత కాలంగా డిమాండ్ చేస్తున్న విషయం విదితమే. ఇలాంటి తరుణంలో అదానీ.. శరద్ పవార్‌ను కలవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. అయితే అదానీ, శరద్ పవార్‌ల మధ్య భేటీ రెండు గంటలు సాగినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

సుప్రీంకోర్టు పర్యవేక్షణలోని బృందంతో అదానీపై విచారణ జరపాలని మొదట్లో శరద్ పవార్ డిమాండ్ చేశారు. అయితే ఆ తర్వాత ఆ డిమాండ్ నుంచి ఆయన కాస్త వెనక్కి తగ్గినట్టుగా కనిపించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షం డిమాండ్ చేస్తున్నట్టుగా జేపీసీకి కూడా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆ తర్వాత తెలిపారు. అదానీ-హిండెన్‌బర్గ్ అంశంపై జేపీసీ వేయాలని ఇటు కాంగ్రెస్.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ద్వారా నియమించబడిన బృందం ద్వారా దర్యాప్తు జరపాలని, దీని ద్వారానే దర్యాప్తుపై అధికార బీజేపీ ప్రభావం ఉండకుండా నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంటుందని అటు శరద్ పవార్ అనడం.. రాజకీయ వర్గాల్లో కాస్త అనైక్యతకు దారి తీశాయని విశ్లేషకులు తెలిపారు. మహారాష్ట్రలో కాంగ్రెస్, ఎన్సీపీలు మిత్రపక్షాలుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే, అదానీ అంశంలో శరద్ పవార్ కొంత వెనక్కి తగ్గినట్టుగా కనిపిస్తున్నదని విశ్లేషకులు తెలిపారు. అదానీని 'లక్ష్యంగా' చేసుకుంటూ ఆరోపణలు వచ్చాయని అప్పట్లో ఎన్డీటీవీ(ఈ ఛానెల్ ప్రస్తుతం అదానీ చేతిలో ఉన్నది)కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్సీపీ అధినేత చెప్పారు. దీంతో ఆయన కామెంట్లపై అప్పుడు కొందరు ప్రతిపక్ష నాయకులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మరికొందరు శరద్ పవార్ తీరును తప్పుబట్టారు. ఇప్పుడు అదానీతో భేటీ సైతం ఇలాంటి అనుమానాలకు బలం చేకూరుస్తున్నదని రాజకీయ విశ్లేషకులు, నిపుణులు అభిప్రాయపడ్డారు.

చంద్రబాబు జీవితచరిత్ర ఆధారంగా
లోకనాయకుడు సినిమా

- ట్రైలర్‌ను విడుదల చేసిన కాసాని జ్ఞానేశ్వర్



నవతెలంగాణ-హైదరాబాద్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జన్మదినం నేపథ్యంలో ఆయన జీవిత చరిత్ర ఆధారంగా త్వరలో సినిమా తెరకెక్కనుంది. లోక నాయకుడు పేరుతో ఈ సినిమాను దర్శకుడు కిరణ్‌కుమార్ నిర్మించనున్నారు. చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన బయోగ్రఫీ సినిమా ట్రైలర్‌ను గురువారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ విడుదల చేశారు. కార్యక్రమంలో దర్శకుడు కిరణ్‌కుమార్, టీడీపీ రాష్ట్ర నాయకులు కాసాని వీరేష్, బండారి వెంకటేశ్, టీటీడీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బియ్యని సురేష్, కాసాని సాయి పాల్గొన్నారు. నిబద్ధత గల దార్శనిక ప్రజా నాయకుడు అయిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీవిత చరిత్ర ఆధారంగా లోకనాయకుడు సినిమాను నిర్మించడం సంతోషకరమని టీటీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ వ్యాఖ్యానించారు. చంద్రబాబు జీవిత చరిత్రకు చిత్రరూపం ఇచ్చినందుకు దర్శకుడు కిరణ్‌కుమార్‌కు, చిత్ర బందానికి అభినందనలు తెలుపుతూ లోకనాయకుడు చిత్రం ప్రజల మన్ననలు పొంది భారీ విజయం సాధించాలని కాసాని జ్ఞానేశ్వర్ ఆకాంక్షించారు.

బిజినెస్

మొబైల్ రంగంలో మందగమనం

- ఒత్తిడిలో భారత మార్కెట్
- అమ్మకాల్లో 20 శాతం పతనం



హైదరాబాద్ : భారత మొబైల్ మార్కెట్‌లో మందగమనం చోటు చేసుకుంది. ప్రస్తుత ఏడాది మార్చితో ముగిసిన తొలి త్రైమాసికం స్మార్ట్‌ఫోన్ల సరఫరాలో 20 శాతం పతనం చోటు చేసుకుందని కెనలిస్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. 2022 డిసెంబర్ త్రైమాసికంలో 6 శాతం తగ్గుదలను చవి చూసిందని వెల్లడించింది. కెనలిస్ రీసెర్చ్ రిపోర్ట్ ప్రకారం.. భారత మొబైల్ మార్కెట్‌కు 2023 సవాలుగా ప్రారంభమైంది. మార్కెట్ ఇప్పటికీ డిమాండ్ లేమితో పోరాడుతోంది. అమ్మకాలు తగ్గి స్టాక్ మిగిలిపోతోంది. కాగా.. క్రితం క్యూ1లో సామ్‌సంగ్ 63 లక్షల యూనిట్ల అమ్మకాలతో 21 శాతం మార్కెట్ వాటా కలిగి మార్కెట్ లీడర్‌గా నిలిచింది. వివో, షావోమిలను వెనక్కి నెట్టిన ఒప్పో 55 లక్షల యూనిట్ల అమ్మకాలతో రెండో స్థానంలోకి వచ్చింది. వివో 54 లక్షల యూనిట్లతో మూడో స్థానంలో, షావోమి 5లక్షల యూనిట్లతో నాలుగో స్థానంలోకి, రియల్‌మి 29 లక్షల యూనిట్ల విక్రయాలతో ఐదో స్థానంలో ఉంది.

"భారత మొబైల్ మార్కెట్ కష్టాలను ఎదుర్కొంటున్నప్పటికీ విక్రేతలు ఆశాజనకంగానే ఉన్నారు. మాస్ మార్కెట్ సెగ్మెంట్ ఇప్పటికీ నెమ్మదిగానే ఉంది. మొబైల్ మార్కెట్‌కు 2023 సవాలుతో కూడినదిగా ఉంది. ప్రీమియం సెగ్మెంట్ వృద్ధికి సిద్ధంగా ఉంది. వినియోగదారులు క్రమంగా ప్రీమియం పరికరాలపై ఎక్కువ ఖర్చు చేయడానికి ఇష్టపడతారు. ఈ విభాగంలో విజయం సాధించాలంటే, బ్రాండ్‌లు తప్పనిసరిగా లభ్యత, స్థోమత, విలువకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రస్తుతం ఆపిల్, సామ్‌సంగ్ భారతదేశ స్మార్ట్‌ఫోన్ ఎగుమతి వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఎగుమతి వ్యూహాలపై దృష్టి పెట్టాలి." అని కెనాలిస్ విశ్లేషకుడు సన్యామ్ చౌరాసియా పేర్కొన్నారు.

'కూ'లో 30 శాతం ఉద్యోగులకు కోత

న్యూఢిల్లీ : సోషల్ మీడియా వేదిక 'కూ'లో 30 శాతం మంది ఉద్యోగులను తొలగించినట్లు బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. ట్విట్టర్‌కు ప్రత్యామ్నాయంగా భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన కూ ఇటీవల 260 మందిపై వేటు వేసిందని పేర్కొంది. అంతర్జాతీయంగా నెలకొన్న స్థూల ఆర్థిక అంశాల నేపథ్యంలో ఉద్యోగుల కోతకు మొగ్గు చూపింది. గతేడాది ఓ దశలో ట్విట్టర్‌తో భారత అధికారులకు ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో కూకు ప్రాధాన్యత పెరిగింది. బాధిత ఉద్యోగులకు పరిహార ప్యాకేజీతో పాటు వైద్య బెనిఫిట్స్ సహా కొత్త ఉద్యోగాలను అన్వేషించే క్రమంలో తమ సిబ్బందికి సాయం అందిస్తామని కూ ప్రతినిధి పేర్కొన్నారు. కూ సంస్థకు అంతకుముందు ఏడాదితో పోలిస్తే మార్చితో ముగిసిన త్రైమాసికంలో 75 శాతం మేర ఫండింగ్ తగ్గిన నేపథ్యంలో తొలగింపులు చోటు చేసుకున్నాయనే సాంకేతాలు వస్తున్నాయి.

హెచ్‌డిఎఫ్‌సి డిప్యూటీ ఎండిగా కైజాడ్ భరుచా



న్యూఢిల్లీ : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కైజాడ్ భరుచా నియామకానికి ఆర్‌బిఐ ఆమోదం తెలిపింది. భరుచా నియామకం బుధవారం నుంచే అమల్లోకి వచ్చింది. 2023 ఏప్రిల్ 29 నుంచి మూడేండ్ల పాటు ఆయన ఈ హోదాలో కొనసాగనున్నారు. ఇంతక్రితం ఈ హోదాలో ఐదేండ్లు పని చేసిన పరేష్ సుక్తాంకర్ 2022 నవంబర్‌లో రాజీనామా చేశారు. భరుచాకు బ్యాంకింగ్ రంగంలో 35 ఏండ్ల విశేష అనుభవం ఉంది.

బిఎల్‌డిసి టెక్నాలజీతో సింఫనీ ఎయిర్ కూలర్లు

హైదరాబాద్ : ప్రపంచంలోనే తొలిసారి బిఎల్‌డిసి టెక్నాలజీ ద్వారా నడిచే అత్యంత శక్తివంతమైన ఎయిర్ కూలర్ల శ్రేణిని ఆవిష్కరించినట్లు ఎయిర్ కూలర్లలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న సింఫనీ లిమిటెడ్ తెలిపింది. ఇతర కూలర్లతో పోలిస్తే ఇవి 60 శాతం తక్కువ విద్యుత్తును వినియోగిస్తాయని ఆ సంస్థ పేర్కొంది. ఈ శ్రేణిలో 80 లీటర్లు, 55 లీటర్లు, 30 లీటర్ల వాటర్ ట్యాంక్ సామర్థ్యంతో 3 మోడళ్లను విడుదల చేసినట్లు తెలిపింది. 7 స్పీడ్ ఆప్షన్లు, 8 గంటల వరకు నైట్ స్లీప్ మోడ్, టచ్ స్క్రీన్ కంట్రోల్ ప్యానెల్, వాటర్ ట్యాంక్ ఖాళీ అయితే అలారం లాంటి అదనపు ఫీచర్లు వీటిలో ఉన్నాయని పేర్కొంది. ఎసిలతో పోలిస్తే ఇవి కేవలం 10 శాతం విద్యుత్తునే వాడుకుంటాయని సింఫనీ లిమిటెడ్ సిఎండి అచల్ బకేరీ తెలిపారు.

ఆపిల్ రెండో స్టోర్ ప్రారంభం

న్యూఢిల్లీ : టెక్ దిగ్గజం ఆపిల్ భారత్‌లో తన రెండో స్టోర్‌ను ఢిల్లీలో ఏర్పాటు చేసింది. దీన్ని గురువారం ఆ కంపెనీ సిఇఒ టిమ్ కుక్ లాంఛనంగా ప్రారంభించారు. భారీ ఎత్తున వినియోగదారులు స్టోర్‌ను సందర్శించడానికి వచ్చారు. ఈ సందర్భంగా టిమ్‌కుక్ వినియోగదారులకు స్వాగతం పలికారు. టిమ్ కుక్ బుధవారం ప్రధాని మోడీతో భేటీ అయ్యారు.

అంతక్రితం రోజు ముంబయి స్టోర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న విషయం తెలిసిందే. భారత మార్కెట్‌పై ఆపిల్ కీలక దృష్టి సారించిన నేపథ్యంలో ఇక్కడ రిటైల్ స్టోర్ల ఏర్పాటును వేగవంతం చేసింది.

సామ్‌సంగ్ గెలాక్సీ ఎం14 5జి ఆవిష్కరణ

హైదరాబాద్: సామ్‌సంగ్ ఇండియా 5జి విభాగంలో 19 విస్తృత మోడళ్లను కలిగి ఉందని ఆ కంపెనీ మొబైల్ బిజినెస్ డైరెక్టర్ వరుణ్ సచ్‌దేవా తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన సామ్‌సంగ్ గెలాక్సీ ఎం14 5జిని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రూ.10వేల నుంచి 20,000 శ్రేణీ స్మార్ట్‌ఫోన్ విభాగంలో సామ్‌సంగ్ అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రస్తుత ఏడాదిలో 5జిలో కొత్తగా తొమ్మిది ఫోన్లను ఆవిష్కరించామన్నారు. ఎం14ను 50ఎంపి కెమెరా, సెల్ఫీ కోసం 13ఎంపి కెమెరా, 6000 ఎంఎహెచ్ బ్యాటరీతో, 5ఎన్ఎం ప్రాసెసర్‌తో అందుబాటులోకి తెచ్చామన్నారు. 4జిబి, 128 జిబి ధరను రూ.13,490గా, 6జిబి, 128 జిబి ధరను రూ. 14,990గా నిర్ణయించామన్నారు. ఇది ఏప్రిల్ 21 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అమ్మకానికి అందుబాటులో ఉంటుందన్నారు.

రాష్ట్రంలో 3వేల ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ కేంద్రాలు

2025 వరకు ఏర్పాటుకు చర్యలు

- తెలంగాణ రెడ్కో చైర్మెన్ వై.సతీష్‌రెడ్డి
- ఈవీ రంగం, అనుబంధ రంగాలప్రతినిధులతో సమావేశం
- చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు రూట్ మ్యాప్ కోసం కమిటీ
- ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు ముందుకు రావాలని పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్, ఇతర మౌలికవసతులు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర పునరుత్పాధక శక్తి అభివృద్ధి సంస్థ(రెడ్కో) కృషి చేస్తోందని ఆ సంస్థ చైర్మెన్ వై.సతీష్‌రెడ్డి తెలిపారు. మౌలిక వసతుల కల్పనను మరింత వేగంగా పూర్తి చేసేందుకు ఎలక్ట్రిక్ వాహన రంగం, దాని అనుబంధ రంగాలకు చెందిన ప్రతినిధులతో హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఆస్కీ) ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 2025నాటికి 3వేలకుపైగా ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ కేంద్రాల ఏర్పాటే లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నట్టు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఇప్పటి వరకు కేవలం హైదరాబాద్‌లోనే ఎక్కువగా చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, దీంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకోసమే సదస్సు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతీ మారుమూల ప్రాంతంలోనూ చార్జింగ్ వసతులు కల్పించే దిశగా ప్రయత్నాలు చేపట్టామని తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాలు, 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 129 మున్సిపాలిటీల్లోనూ ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ వసతి కల్పిస్తామని వివరించారు. గతేడాదిలో రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు దాదాపు ఐదు రెట్లు పెరిగిందని గుర్తుచేశారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పట్టణాల్లోని ప్రధాన ప్రాంతాల్లో చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలక్ట్రిక్ వాహనాల పట్ల విశ్వాసం కల్పించడమే లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రజలు కూడా ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దీనికోసం ఆ రంగంలోని సంస్థలు కలిసి రావాలని కోరారు.

తెలంగాణ రెడ్కో స్వయంగా ఇప్పటికే 150 చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని సతీష్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం(పీపీపీ)లో దేశంలోనే మొదటి చార్జింగ్ కేంద్రం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల న్నింటిలో కలిపి హైదరాబాద్‌లో దాదాపు 500 చార్జింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటి సంఖ్య త్వరలోనే మరింత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్కో వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ జానయ్య, జీఎం ప్రసాద్, వాహన తయారీ సంస్థల ప్రతినిధులు, వాహన డీలర్లు, చార్జింగ్ స్టేషన్ నిర్వహణ సంస్థల ప్రతినిధులు, ఫ్లీట్ సర్వీస్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మైత్రి మూవీస్‌పై ఐటీ దాడులు

- ముంబయి ఫైనాన్షియర్స్ నుంచి తీసుకున్న కోట్లాది రూపాయలపై ఆరా

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రి మూవీస్ కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖాధికారులు గురువారం కూడా కొనసాగాయి. గతేడాది అక్టోబర్ నెలలో ఈ చిత్ర నిర్మాణ సంస్థపై మొదట ఐటీ అధికారులు దాడులు జరిపారు. మైత్రి మూవీస్ నిర్మించిన చిత్రాలలో పెట్టుబడులు, తద్వారా వచ్చిన ఆదాయం సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఐటీ అధికారులు అనుమానిస్తున్నారు. తాజాగా పుష్ప-2 సినిమా నిర్మాణంలో సైతం భారీ ఎత్తున పెట్టుబడులను ఈ నిర్మాణ సంస్థ పెట్టిందనీ, అందులో విదేశాల నుంచి దాదాపు రూ. 500 కోట్ల మేరకు పెట్టుబడులు వచ్చాయనీ, అవి ఎక్కడ నుంచి వచ్చాయి? దానికి సంబంధించిన ఆదాయపు పన్ను చెల్లింపులు జరిగాయా? అనే కోణంలో తాజాగా ఐటీ అధికారులు దృష్టిని సారించారని తెలిసింది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని మైత్రి మూవీస్ చిత్ర నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు నిర్మాణ సంస్థకు చెందిన యాజమాన్యాల నివాసాల పైనా బుధవారం ఐటీ దాడులు ప్రారంభించారు. దీనికి కొనసాగింపుగా గురువారం కూడా సోదాలు నిర్వహించిన అధికారులు ముంబయికి చెందిన కొందరు ఫైనాన్షియర్ల నుంచి కూడా భారీ మొత్తంలో ఈ సంస్థ పెట్టుబడులను సేకరించి బాలీవుడ్‌లో చిత్ర నిర్మాణంపై ఆ నిధులను వ్యయం చేస్తున్నదనే కోణంలో కూడా ఐటీ అధికారులు ఆరా తీస్తున్నారని తెలిసింది. ఇందులో భాగంగా ముంబయికి చెందిన కొందరు ఫైనాన్షియర్ల కార్యాలయాలపై కూడా ఐటీ అధికారులు దాడులు కొనసాగిస్తున్నట్టు సమాచారం. మొత్తమ్మీద రాత్రి పొద్దుపోయేంత వరకు కూడా ఈ సంస్థకు చెందిన ఆడిటర్లు, అకౌంటెంట్లు, యాజమాన్యాల నుంచి ఆదాయపు పన్ను లెక్కలకు సంబంధించిన వివరాల సేకరణలో ఢిల్లీ నుంచి వచ్చిన ఐటీ బృందం బిజీబిజీగా ఉన్నట్టు తెలిసింది.

ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు 25 వరకు పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్-2023 దరఖాస్తు గడువును ఈనెల 25వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఎడ్‌సెట్ కన్వీనర్ ఎ రామకృష్ణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుం లేకుండా ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేయొచ్చని సూచించారు. ఫైనల్ ఇయర్ లేదా సెమిస్టర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసేందుకు అవకాశముందని తెలిపారు. వచ్చేనెల 18న ఎడ్‌సెట్ రాతపరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు https:// edcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఎడ్‌సెట్‌కు ఇప్పటి వరకు 21,456 దరఖాస్తులొచ్చాయని వివరించారు.

నిరుద్యోగ సమస్యపై కాంగ్రెస్ ఫోకస్

ఐదు చోట్ల భారీ బహిరంగ సభ : మహేష్‌కుమార్ గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నిరుద్యోగ సమస్యపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. రాష్ట్రంలో ఐదు చోట్ల భారీ బహిరంగ సభలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. గురువారం ఈమేరకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ ప్రకటించారు.

ఈనెల 24న ఖమ్మం, 26న ఆదిలాబాద్, 28న నల్లగొండ, 30న మహబూబ్‌నగర్, మే 1న రంగారెడ్డి జిల్లాలో బహిరంగ సభలు నిర్వహిస్తామని ఆయన తెలి పారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్ రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాలమేరకు ఆయా కాంగ్రెస్ జిల్లా కమిటీలు బాధ్యత తీసు కుని బహిరంగ సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌లోకి పొంగులేటి, జూపల్లి

మే మొదటివారంలో కాంగ్రెస్ నిర్వహించ నున్న నిరుద్యోగ నిరసన సభకు ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీ హాజరుకానున్నట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చెప్పారు. అదే సభలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

రాహుల్‌కు హైకోర్టులో న్యాయం జరుగుతుంది :మల్లు రవి

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి హైకోర్టులో న్యాయం జరుగుతుందని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లు రవి చెప్పారు.